www.peoplesnews.in

హైదరాబాద్

# పీపుల్స్ న్యూస్

దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్   సంపుటి : 16   సంచిక : 181   శుక్రవారం, మార్చి 27, 2026, పేజీలు - 12   వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad




## గత ప్రభుత్వం బకాయిలు

# కడుతున్నాం

**- ఆరోగ్యశ్రీ కింద 600 కోట్ల బకాయిలు పెట్టి వెళ్లారు**

**ఇప్పటివరకు రూ.2,408 కోట్ల బిల్లులు చెల్లించాం**

**విద్య,వైద్యానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాం**

**సిఎంఆర్ఎఫ్ నిధులను దుర్వినియోగం చేశారు**


**అన్ని బాగోతాలు బయటపెట్టబోతున్నాం**

**అసెంబ్లీలో సిఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్,మార్చి 26 :** గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకానికి రూ.600 కోట్లు బకాయిలు పెట్టి వెళ్తే తాము ప్రతినెలా రూ.89 కోట్లు ఖర్చు పెడుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఇప్పటివరకు రూ.2,408 కోట్ల బిల్లులు చెల్లించామని అసెంబ్లీ సాక్షిగా తెలిపారు. ఏడో రోజైన గురువారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సభలో సీఎం రేవంత్ ప్రసంగించారు. ఆరోగ్య శ్రీ కింద ప్రభుత్వాసు పత్రులకు రూ.927 కోట్లు, ప్రైవేట్ ఆస్పత్రులకు రూ.1,480 కోట్లు చెల్లించామని చెప్పుకొచ్చారు. 27 నెలల్లో పేదల వైద్యం కోసం రూ.4,500 కోట్లు చెల్లించామని ఆయన వివరించారు. పేదలకు అన్యాయం జరుగుతోందని విపక్షాలు అపోహలు సృష్టిస్తున్నాయని.. బీఆర్ఎస్ గత ప్రభుత్వంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఎలా దుర్వినియోగం చేశారో అందరికీ తెలుసంటూ విమర్శించారు. ఎవరి పీఏలు సీఎం రిలీఫ్ ఫండ్ కాజేశారో కూడా తెలుసంటూ చురకలు అంటించారు. గత ప్రభుత్వంలో సీఎంఆర్ఎఫ్ నిధులను కొందరు తమ సొంత ఖాతాల్లో వేసుకున్నారని, దీనిపై విచారణ జరుగుతోందన్నారు. త్వరలోనే అన్నీ బయటకు వస్తాయని హెచ్చరించారు. తాము అధికారంలోకి వచ్చాక 27 నెలల్లో రూ.2,046 కోట్ల సీఎంఆర్ఎఫ్ కింద ఇచ్చామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం అప్పుల భారాన్ని తమకు వారసత్వంగా ఇచ్చిందని, ఆ బకాయిలను తామే చెల్లిస్తున్నామని రేవంత్ రెడ్డి చెప్పారు. బీఆర్ఎస్ గత ప్రభుత్వం

మిగతా2లో...




## పద్దులపై చర్చలకు బదులు గొప్పలా?

**మిషన్ భగీరథ పేరుతో డబ్బు దుబారా..**

**దీనిపై ఎక్కడికైనా వెళ్లి పరిశీలిద్దామా..?**

**సభలో బిఆర్ఎస్ సభ్యుల తీరుపై మండిపడ్డ భట్టి**



## నేడు రాష్ట్రాల సిఎంలతో ప్రధాని వీడియో కాన్ఫరెన్స్


**పశ్చిమాసియా పరిస్థితులపై రాష్ట్రాలకు వివరించే ఛాన్స్**

**న్యూఢిల్లీ,మార్చి 26 :** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మరింత అప్రమత్తమయ్యింది. ఈ క్రమంలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ శుక్రవారం వర్చువల్‌గా సమావేశం కానున్నారు. శుక్రవారం

మిగతా2లో...

## కడియం , సంజయ్‌లపై విచారణ

**- విచారణ ఏప్రిల్ 16కు వాయిదా**




## ఇరాన్‌కు మరోమారు ట్రంప్ వార్నింగ్

- ఆలస్యం చేస్తే పరిస్థితులు మారిపోతాయి
- త్వరగా ఒప్పందానికి రావాలని హెచ్చరిక






# ఏపీలో ఘోర ప్రమాదం



**మార్కాపురం జిల్లాలో టిప్పర్- ట్రావెల్స్ బస్సు ఢీ**

**బస్సులో చెలరేగిన మంటలు**

**14 మంది సజీవదహనం**

**15 మంది ప్రయాణికులకు గాయాలు..**

**మార్కాపురం ప్రభుత్వాస్పత్రికి క్షతగాత్రుల తరలింపు - బస్సు హరేకృష్ణ ప్రయివేటు ట్రావెల్స్‌కు చెందినదిగా గుర్తింపు**


**- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, గాయపడిన వారికి రూ.2 లక్షల చొప్పున పరిహారం : ఏపీ సీఎం ఆదేశం**

**మార్కాపురం,మార్చి 26:** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని మార్కాపురం జిల్లా రాయవరం సమీపంలో గురువారం తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ప్రయివేట్ ట్రావెల్స్‌కు చెం దిన బస్సు మూలమలుపు తిరుగుతుండగా ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొట్టింది. దీంతో బస్సులో క్షణాల్లో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 14మంది ప్రయాణికులు సజీవదహనమయ్యారు. 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మార్కాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన బస్సు హరేకృష్ణ ప్రయివేటు ట్రావెల్స్ బస్సుగా గుర్తించారు.ప్రమాద సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు

మిగతా2లో...

## నేడు శ్రీరామనవమి వేడుక

**● నగరంలో శోభాయత్రకు భారీగా ఏర్పాట్లు ● యాత్ర మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు**



**హైదరాబాద్,మార్చి 26 :** శ్రీరామనవమి శోభాయాత్ర సందర్భంగా హైదరాబాద్ నగరంలో శుక్రవారం ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి. సీతారాంబాగ్ దేవాలయం నుంచి కోఠిలోని హనుమాన్ వ్యాయామశాల వరకు శోభాయాత్ర జరగనుంది.

మిగతా2లో...

## కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి

# ఫండ్స్ పెరగాలి

**● ఇక్కడ పరిశ్రమలు ఉన్నవారు ఇక్కడే వెచ్చించేలా చూడాలి**

**● ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షా సమావేశం**



**హైదరాబాద్,మార్చి 26 :** తెలంగాణలో కంపెనీలు,పరిశ్రమలు ఏర్పాటు చేసి సీఎస్ఆర్ ఫండ్స్ వేరే చోట ఖర్చు పెడతానంటే ఎలా అని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఇప్పటి వరకు వచ్చిన సీఎస్ ఆర్ ఫండ్స్ మెరుగు గా లేవని అన్నారు. రాష్ట్రానికి మరిన్ని సీఎస్ఆర్ ఫండ్స్ రావాల్సిన అవసరం ఉందన్నారు. సీఎస్ఆర్ ఫండ్స్

మిగతా2లో...

## ఏప్రిల్ 2నుంచి 5 మండలాల్లో

# ఇంటిగ్రేటెడ్ భూభారతి

**సర్వే నుంచి రిజిస్ట్రేషన్ వరకు.. అంతా ఒకే గొడుగు కిందకు**

**ఒకే క్లిక్‌తో సమస్త భూ సమాచారం**

**ప్రతి సర్వేనెంబర్‌కు భూధార్ నెంబర్**

**రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**హైదరాబాద్,మార్చి 26 :** తెలంగాణ భూపరిపాలనలో సరికొత్త శకం ఆరంభం కాబోతోందని గత ప్రభుత్వ హయాంలో ధరణి తెచ్చిన చిక్కుముడులను విప్పుతూ, రైతులకు అత్యంత పారదర్శకంగా, సులభతరమైన సేవలు అందించడమే లక్ష్యంగా కొత్తగా రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ( ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజిమెంట్ సిస్టమ్) ను ఏప్రిల్ 2వ తేదీ నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ,

మిగతా2లో...



## ఆరోగ్యశ్రీపై అబద్ధాలు చెప్పే ప్రయత్నం

**మైక్ కట్ చేయడం ద్వారా నిజాలు దాచారు**

**మాజీ మంత్రి హరీష్ రావు విమర్శలు**

**హైదరాబాద్,మార్చి 26 :** రాష్ట్రంలో ఆరోగ్య రంగానికి సంబంధించిన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలపై ఎమ్మెల్యే హరీశ్ రావు ఘాటుగా స్పందించారు. అసెంబ్లీ వేదికగా తమ గళాన్ని వినిపించేం దుకు ప్రయత్నించినప్పటికీ, మైక్ ఇవ్వకపోవడంపై

మిగతా2లో...

## లోక్‌భవన్‌లో మహాస్టమి వేడుకలు

**● శక్తి స్వరూపిణి అమ్మవారి పూజ ● పూజలో పాల్గొన్న గవర్నర్ దంపతులు**




**హైదరాబాద్, 26 :** శ్రీరామ నవమిని పురస్కరించుకుని చైత్ర నవరాత్రి మహాష్టమి వేడుకలు దివ్యశక్తి ఆరాధనకు ప్రతీక అని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. గురువారం లోక్ భవన్ అధ్వర్యంలో తెలంగాణలో తొలిసారిగా సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో

మిగతా2లో...

## ఏపీలో ఘోర ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.2 లక్షల చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించింది. మార్కాపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల నుంచి ఏపీలోని మార్కాపురం జిల్లా పామూరుకు వస్తున్న హరికృష్ణ ట్రావెల్స్‌కు చెందిన ప్రయివేటు బస్సు రాయవరం సమీపంలోని పలకల క్వారీ వద్ద మలుపు తిరుగుతుండగా ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు, టిప్పర్ ఇంజన్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో బస్సులో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన 10మంది ప్రయాణికులు వెంటనే బస్సు దిగిపోయారు. మరికొందరు దిగే ప్రయత్నం చేస్తుండగానే దట్టమైన పొగ అలుముకోవడంతో బస్సులోనే 14 మంది సజీవ దహనమయ్యారు. 15 మందికి గాయాల య్యాయి. ఘటనాస్థలిని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులను మార్కాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని జాయింట్ కలెక్టర్ కల్పన కుమారి పరామర్శించారు. రిమ్స్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను కలిసి వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. **బస్సు కండీషన్ సరిగాలేకనే..** బస్సు కండీషన్ సరిగా లేకపోవడమే ఈ ప్రమాదానికి కారణమని ప్రయాణికులు తెలిపారు. ఇదే విషయాన్ని బస్సు డ్రైవర్‌తో మాట్లాడినట్టు చెబుతున్నారు. ప్రమాదానికి ముందు బస్సును యర్రగొండపాలెం వద్ద గంటసేపు నిలిపి మరమ్మతులు చేపట్టారని అన్నారు. ఇదిలా ఉండగా ప్రమాద సమయంలో బస్సు స్టీరింగ్ స్టక్ అయ్యినట్టు బస్సు డ్రైవర్ చెబుతున్నారు. దీనిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. **మృతులకు రూ.5 లక్షల పరిహారం** మార్కాపురం బస్సు ప్రమాద ఘటనపై ఏపీ క్యాబినెట్ భేటీలో చర్చ జరిగింది. మృతులకు ఏపీ మంత్రులు సంతాపం తెలిపి, బాధిత కుటుంబాలకు సానుభూతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున, గాయపడినవారికి రూ.2 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశించారు. అదే విధంగా బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని మంత్రులు, అధికారులకు సూచించారు. **బస్సు ప్రమాద ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి ఏపీ అధికారులతో మాట్లాడాలని సీఎస్‌కు ఆదేశం** ఏపీలోని మార్కాపురం బస్సు ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనలో పలువురు మృతి చెందడం.. కొందరికి తీవ్ర గాయాలవడంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బస్సు నిర్మల్ నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న నేపథ్యంలో ఈ ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. మృతి చెందిన, గాయపడిన వారి వివరాలు తెలుసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును సీఎం ఆదేశించారు. ఏపీ అధికారులతో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించాలని సూచించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సహాయం అందేలా చూడాలని తెలిపారు. సీఎం ఆదేశాలతో ఏపీ సీఎస్‌తో సీఎస్ రామకృష్ణారావు మాట్లాడారు.

## నేడు రాష్ట్రాల సిఎంలతో ప్రధాని వీడియో కాన్ఫరెన్స్

(మొదటి పేజీ తరువాయి)

సాయంత్రం 6.30గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారితో మాట్లాడనున్న ఆయన.. పశ్చిమాసియాలో పరిస్థితులు, భారత్ అనుసరిస్తున్న విధానాలను వివరించనున్నట్లు సమాచారం. ఆయా రాష్ట్రాల సన్నద్ధత, సహకారంపై చర్చించనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల ముఖ్య మంత్రులు మాత్రం ఈ సమావేశానికి దూరంగా ఉండనున్నట్లు తెలిసింది. అయితే, ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో కేబినెట్ సెక్రటరీ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ప్రధాని-సీఎంల వీడియో కాన్ఫరెన్స్‌లో తీసుకున్న వివరాలను సీఎస్‌లకు వెల్లడించి.. ఆయా రాష్ట్రాల్లో అమలు చేసేలా కేబినెట్ సెక్రటరీ సూచించనున్నట్లు సమాచారం. ఇటీవల పార్లమెంటు ఉభయసభల్లో మాట్లాడిన ప్రధాని మోదీ.. యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సంక్లిష్ట పరిస్థితులు దీర్ఘకాలం కొనసాగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇది పరీక్షా సమయమేనని తెలిపారు. సంక్షోభం నుంచి బయటపడటంలో రాష్ట్రాలన్నీ కేంద్రంతో కలిసి టీమ్ ఇండియాలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ప్రజలు సిద్ధమై ఉండాలని కోరారు. ఈ క్రమంలోనే అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశానికి సిద్ధమవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశంలో పశ్చిమాసియా యుద్ధం కారణంగా తలెత్తిన సంక్షోభంపై కీలక సూచనలు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దేశంలో చమురు, గ్యాస్‌పై విపరీతంగా వదంతులు వ్యాపిస్తున్నాయి. మధ్యప్రాచ్యం యుద్ధం కొనసాగితే.. ఎదురయ్యే ఇబ్బందులను ఎలా ఎదుర్కోవాలన్న దానిపై మోడీ దిశానిర్దేశర చేయనున్నారు. గత నెల 28 నుంచి పశ్చిమాసియాలో యుద్ధం జరుగుతోంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడి చేశాయి. ఈ ఘటనలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా లీ ఖమేనీ హతమయ్యాడు. దీంతో ఇరాన్ ప్రతీకార దాడులకు దిగింది. గల్ఫ్ దేశాల్లోని ఇంధన, గ్యాస్ క్షేత్రాలపై క్షిపణులతో విరుచుకుపడింది. అంతేకాకుండా హోర్ముజ్ జలసంధిని కూడా మూసేసింది. దీంతో ప్రపంచ దేశాల్లో చమురు, గ్యాస్ కష్టాలు తీవ్ర స్థాయికి చేరాయి. ఇప్పటికే ఆయా దేశాల్లో అత్యవసర పరిస్థితులు అమలు అవుతున్నాయి. అలాగే భారత్‌లో కూడా కరోనా కాలం నాటి లాక్‌డౌన్ పరిస్థితులు వస్తాయంటూ పుకార్లు వ్యాప్తి చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ.. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

## పద్దులపై చర్చలకు బదులు గొప్పలా?

**హైదరాబాద్,మార్చి 26 :**బీఆర్ఎస్ శాసనసభ్యులు పద్దులపై చర్చను పక్కనపెట్టి, గత పదేళ్ల కేసీఆర్ ప్రభుత్వ పాలన గురించి గొప్పలు చెప్పుకోవడమే లక్ష్యంగా మాట్లాడుతున్నారని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క చురకలంటించారు.. ప్రజా సమస్యలపై చర్చించాల్సింది పోయి గత ప్రభుత్వం గొప్పలు చేసిందని చెప్పడానికి ప్రాధాన్యం ఇవ్వడం సిగ్గుచేటన్నారు. అసెంబ్లీలో మహిళా శిశు సంక్షేమం పంచాయతీరాజ్ పద్దులపై జరుగుతున్న చర్చ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడారు. పెళ్లయి బిడ్డ సంకలోకి వచ్చినా కల్యాణ లక్ష్మి చెక్కు అందలేదు' అని ఎమ్మెల్యే సునీత చేసిన వ్యాఖ్యలు వాస్తవమైతే, ఆ ఆలస్యానికి గల కారణాలను ప్రభుత్వం ఖచ్చితంగా పరిశీలిస్తుందన్నారు. సాధారణంగా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి జాప్యం జరగడం లేదు. ఒకవేళ ఎక్కడైనా ఆలస్యం జరిగితే అది ఎమ్మెల్యే సంతకం లేకపోవడం వల్లో, దరఖాస్తు చేయడంలో జాప్యం వల్లో లేదా సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్లో జరిగి ఉండవచ్చు. దీనిపై పూర్తి వివరాలను సభ ముందు ఉంచుతాం అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రజలకు నీళ్లు ఇవ్వడం కోసం తెచ్చిందా? లేక పైపుల కంపెనీల ప్రయోజనం కోసం తెచ్చిందా అని అన్నారు. ఈ పథకం కోసం దాదాపు రూ. 40 వేల కోట్లకు పైగా నిధులు ఖర్చు చేసి, లక్షా 23 వేల కిలోమీటర్ల మేర పైపులు వేశామని లెక్కలు చెప్పారు. కానీ ఎక్కడో దూరం నుంచి నీళ్లు తెచ్చి, ఫిల్టర్ చేసి పంపిణీ చేసే విధానం క్షేత్రస్థాయిలో ఎక్కడా సక్రమంగా అమలు కాలేదన్నారు. తెలంగాణలోని ఏ జిల్లాలో కూడా మిషన్ భగీరథ సక్రమంగా పనిచేయడం లేదు. ఎక్కడ చూసినా పైపుల లీకేజీలు, పగిలిన పైపులతో నీరు వృథా అవుతోంది కానీ ప్రజలకు మాత్రం అందడం లేదన్నారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల నుంచి ఎర్రుపాలెం వరకు వేసిన పైప్‌లైన్ ద్వారా సరిగ్గా నీరు అందిన పరిస్థితి లేదు. మిషన్ భగీరథ పనితీరుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సిద్ధమైతే ఒక కమిటీ వేద్దాం. ఊరూరా తిరిగి నీటి పంపిణీ ఎలా జరుగుతుందో, క్షేత్రస్థాయి వాస్తవాలు ఏంటో ప్రత్యక్షంగా పరిశీలిద్దాం అన్నారు. ప్రతిపక్ష నేతలు సభను, ముఖ్యమంత్రిని మరియు మంత్రులను గౌరవించి మాట్లాడాలి. సభా మర్యాదలను పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించడం అవసరం అని గుర్తు చేశారు.

## ఏప్రిల్ 2నుంచి 5 మండలాల్లో ఇంటిగ్రేటెడ్ భూభారతి

(మొదటి పేజీ తరువాయి)

హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ , ఎన్ఐసి అధికారులతో మంత్రి సమీక్షించారు. మంత్రిగారు మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి ఆలోచన మేరకు తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా భూపరిపాలన సేవలను మరింత వేగవంతంగా అందించడానికి రెవెన్యూ. స్టాంప్స్/ రిజిస్ట్రేషన్ , సర్వే విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ భూభారతి పోర్టల్‌ను అభివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి భూలావాదేవీ వివరాలు కనిపించేలా పారదర్శకంగా ఈ పోర్టల్‌ను రూపొందిం చినట్లు వెల్లడించారు. ఈ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ను నారాయణపేట జిల్లా కొస్గి, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలాల్లో వచ్చేనెల 2వ తేదీ నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేస్తామని తెలిపారు. ఈ పైలట్ మండలాల్లో మెరిట్- డీమెరిట్ లను క్షుణ్ణంగా పరిశీలించి వాటికి అవసరమైన మార్పులు చేర్పులు చేసి రెండవ దశలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలు చేస్తామని తెలిపారు.తద్వారా రాష్ట్రంలో భూవి వాదాలకు పరిష్కారం లభిస్తుంద న్నారు. ఈ ఐదు మండలాల్లో ప్రతి సర్వే నెంబరుకు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ నెంబర్‌ను కూడా ఇస్తామని తెలిపారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా నక్షాలేని ఐదు గ్రామాల్లో రీసర్వే నిర్వహించి భూధార్ నెంబర్‌ను కేటాయించడం జరిగిందన్నారు. ఈ పోర్టల్‌లో ప్రధానంగా సమా చారం సేవలు, సర్వే సేవలు, కరెక్షన్ సేవలు, అప్పీల్ సేవలు, రిజిస్ట్రేషన్ సేవల తోపాటు సిటిజన్ డాష్ బోర్డు సేవలకు సంబంధించి మైల్యాండ్ పోర్ట్‌ఫోలియో, నాలా ఆర్డర్స్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ వివరాలు, ఫీడ్‌బ్యాక్, సం బంధిత అధికా రుల వివరాలు, ఆర్వోఆర్, భూధార్ నెంబర్, దరఖాస్తు వివరాలు, మ్యూటేషన్, ఈసీ, మార్కెట్ విలువ, విలేజ్ మ్యాప్, ప్రతి సర్వేనెంబర్‌కు మ్యాప్, ఆర్వోఆర్, గ్రామాల నక్షా, పాస్ బుక్ కరెక్షన్, వంటి పూర్తి సమాచారం, సేవలు లభించేలా మూడు విభాగాలను అనుసంధానం చేస్తూ భూభారతి పోర్టల్ ను పూర్తి స్థాయిలో ప్రజలకు చేరువ చేయబోతున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్, ఇతర భూసేవలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్నప్పటి నుంచి ఆ పక్రియ పూర్తయ్యేవరకు ప్రతి స్టేజ్ లో దాని వివరాలను తెలియజేస్తూ ఎస్.ఎమ్.ఎస్ ద్వారా ఖాతాదారునికి సమాచారం కూడా అందుతుందన్నారు.

## లోక్‌భవన్‌లో మహాష్టమి వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)




చైత్ర నవరాత్రి మహాష్టమి ఫలహార వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తన సతీమణి జానకి శుక్లా తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. గత 35 సంవత్సరాలుగా తాను ఈ వేడుకల్లో భాగస్వామ్యం అవుతున్నానని, తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన తాను, ఈ పవిత్ర వేడుకను తొలిసారిగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. రానున్న రోజుల్లోనూ ఈ వేడుకలు తెలంగాణాలో కొనసాగాలని గవర్నర్ ఆకాంక్షించారు. అమ్మవారి శక్తి స్వరూపమైన దుర్గాదేవిని భక్తిశ్రద్ధలతో పూజిస్తూ, మనలోని అజ్ఞానం, అహంకారం, దుర్గుణాలను తొలగించుకోవాలని సూచించారు. ఫలహార దీక్ష కేవలం ఆహార నియమం మాత్రమే కాకుండా, మనస్సు, శరీరం, ఆత్మలను శుద్ధి చేసే ఆధ్యాత్మిక పవిత్ర సాధనమని గవర్నర్ పేర్కొన్నారు. ఈ ఆచారాలు నియమశీలత, సహనం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా సమాజంలో శాంతి, సోదరభావం పెంపొందించేందుకు అందరూ కృషి చేయాలని గవర్నర్ పిలుపునిచ్చారు. పరస్పర గౌరవం, సహకారం ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దామని సూచించారు. చివరిగా, మహాష్టమి సందర్భంగా ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం కలగాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు గవర్నర్ తెలిపారు. వేడుకలలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు,మాజీ గవర్నర్ దత్తాత్రేయ, బీజేపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, మల్క కొమురయ్య, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్,అదనపు డీజీపీ మహేష్ భగవత్,జిల్లా కలెక్టర్ హరి చందన, రాజ్ భవన్ సీనియర్ అధికారులు, ఇతర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇరాన్‌కు మరోమారు ట్రంప్ వార్నింగ్

**వాషింగ్టన్,మార్చి 26 :** ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరికలు జారీ చేశారు. ఒప్పందం విషయంలో మరీ ఆలస్యం చేస్తే పరిస్థితులు తీవ్రంగా మారిపోతాయని హెచ్చరించారు. అమెరికాతో ఒప్పందం కోసం ఒకవైపు ప్రయత్నిస్తూనే, బయటకు మరోలా మాట్లాడుతోందని ఇరాన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరీ ఆలస్యం కాకముందే సీరియస్‌గా వ్యవహరించడం మంచిదని హితవు పలికారు.'ఇరాన్ మిలిటరీ పూర్తిగా నాశనమైంది. తిరిగి పుంజుకునే అవకాశం లేదు. దీంతో వారు ఒక ఒప్పందం కోసం మమ్మల్ని వేడుకుంటున్నారు. మరోవైపు మా ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని చెబుతున్నారు. వారు చాలా తప్పు చేస్తున్నారు. మరీ ఆలస్యం కాకముందే వారు ఒక నిర్ణయం తీసుకుంటే మంచిది. ఆలస్యమైతే వెనక్కి తిరిగి చూసే ప్రసక్తే లేదు. పరిస్థితులు తీవ్రంగా ఉంటాయి' అని తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ ద్వారా హెచ్చరించారు. అమెరికాతో చర్చల పట్ల ఇరాన్ భిన్నంగా ప్రకటనలు చేస్తోంది. ఘర్షణలు ముగించేందుకు చర్చలు జరిపే ఉద్దేశం ఉద్దేశం తమకు లేదని, అమెరికా ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని ఇరాన్ విదేశాంగ మంత్రి వ్యాఖ్యానించారు. అమెరికాతో చర్చలు జరుగుతున్న సమయంలో పశ్చిమాసియా దేశాలపై ఇరాన్ దాడులకు పాల్పడుతోంది.

## నేడు శ్రీరామనవమి వేడుక

(మొదటి పేజీ తరువాయి)

ఈ మార్గంలో వాహనాలకు అనుమతి ఉండదు. శోభాయాత్ర సమయంలో ట్రాఫిక్‌ను ఇతర మార్గాల్లోకి మళ్లించనున్నారు. సీతారాంబాగ్, బోయిగూడ కమాన్ నుంచి మల్లేపల్లి ఎక్స్ రోడ్స్ వైపు ట్రాఫిక్ మళ్లించనున్నారు. మంగళ్‌హాట్, గాంధీ విగ్రహం, పురానాపూల్, జుమేరాత్ బజార్ నుంచి వచ్చే వాహనాలను టక్కర్‌వాడీ జంక్షన్ వైపు డైవర్ట్ చేయనున్నారు. ఎంజే బ్రిడ్జ్, బేగంబజార్, అఫ్జల్‌గంజ్, సిటీ కాలేజీ వైపు వెళ్లే వాహనాలను జుమేరాత్ బజార్ మీదుగా మళ్లించనున్నారు. అబిడ్స్ జీపీఓ, సుల్తాన్ బజార్, కోఠి, అబిడ్స్ ప్రధాన రోడ్ల వద్ద ట్రాఫిక్‌ను నిలిపివేయనున్నారు. బేగంబజార్, అఫ్జల్‌గంజ్, ఎంజే మార్కెట్, కోఠి, కాచిగూడ ప్రాంతాల్లోనూ ట్రాఫిక్ రద్దీగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా చర్యలు తీసుకునేందుకు హైదరాబాద్ పోలీసులు సిద్ధమవుతున్నారు. సీతారాంబాగ్ టెంపుల్ నుంచి సుల్తాన్‌బజార్ వరకు జరిగే ఈ శోభాయాత్ర మార్గంలో వాహనాలకు మళ్లింపులు అమలు చేస్తారు. ప్రత్యేకంగా బేగంబజార్, అఫ్జల్‌గంజ్, ఎంజే మార్కెట్, కోఠి, కాచిగూడ ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ ఉండే అవకాశం ఉంది. ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించాలని, ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని అధికారులు సూచించారు. శ్రీరామనవమి శోభాయాత్రను అత్యంత వైభవంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సర్వం సిద్ధమయ్యారు. 2010లో ప్రారంభమైన ఈ యాత్ర అతి తక్కువ కాలంలోనే దేశవ్యాప్త గుర్తింపు పొందిందని, సీతారాం బాగ్ నుంచి హనుమాన్ వ్యాయామశాల వరకు సాగే ఈ వేడుకను భక్తులు క్రమశిక్షణతో జరుపుకోవాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ కోరారు.

## కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి ఫండ్స్ పెరగాలి

(మొదటి పేజీ తరువాయి)

మరిన్ని తెలంగాణలో ఖర్చు పెట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో సీఎస్ ఆర్ ఫండ్స్ ఎక్కువ ఖర్చు చేసిన వారిని గుర్తించి ప్రభుత్వం తరపున సత్కరించాలన్నారు. సీఎస్ ఆర్ ఫండ్స్ కోసం వెబ్సైట్ ఏర్పాటు చేయాలి..సీఎస్‌ఆర్ ఫండ్స్ ను పర్యవేక్షించడానికి ఒక ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలి..ఇతర రాష్ట్రాల్లో సీఎస్‌ఆర్ ఫండ్స్ కోసం అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలన్నారు. రాష్ట్రంలో ఉన్న సంస్థలు కనీసం 50 శాతం సీఎస్‌ఆర్ ఫండ్స్ కచ్చితం గా ఇక్కడే ఖర్చు పెట్టాలని, సీఎస్‌ఆర్ ఫండ్స్ కోసం ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు,స్పెషల్ సీఎస్ సబ్యసాచి ఘోష్,సిఎంఓ ముఖ్యకార్యదర్శి శేషాద్రి,సిఎంఓప్రత్యేక కార్యదర్శి, సిఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్ ,ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## గత ప్రభుత్వం బకాయిలు కడుతున్నాం

(మొదటి పేజీ తరువాయి)

ఆరోగ్యశ్రీ కోసం నెలకు రూ.52 కోట్లు ఖర్చు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నెలకి రూ.89 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. ఆరోగ్య శ్రీ ఇవ్వకపోవడం వల్ల చికిత్స చేయట్లేదు అనేది అపోహ మాత్రమే అన్నారు. ఇన్ని ఇబ్బందుల్లో కూడా ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. విద్యా, వైద్యం విషయంలో కోతలు ఉండవని సీఎం రేవంత్ మరోసారి తేల్చి చెప్పారు. కోతలు పెట్టాల్సి వస్తే వేరే కోతలు పెడతామని అన్నారు. టీచింగ్ కాలేజీల నిర్వహణ గ్రూప్-1 అధికారులకు అప్పగిస్తామని, ప్రతి కుటుంబానికి జీవిత బీమా అందించేందుకు కొత్త పథకం తీసుకు వస్తున్నట్లు సీఎం రేవంత్ తెలిపారు.విద్య, పేదల వైద్యం తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యాంశాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వైద్యానికి నిధులు కేటాయించి రాష్ట్రాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో రూ.2,046 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశామని చెప్పారు. గతంలో ఈ చెక్కుల విషయంలో అవినీతి జరిగిందన్నారు. 27 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పేదల వైద్యం కోసం రూ.4,500 కోట్లు చెల్లించామన్నారు. టీచింగ్ కాలేజీలకు రోగులు వెళ్లడం లేదని సీఎం అన్నారు. ఈ కాలేజీల నిర్వహణను గ్రూప్-1 అధికారులకు అప్పగిస్తామని చెప్పారు. ప్రతి కుటుంబానికి జీవిత బీమా అందించేందుకు కొత్త పథకం తీసుకొచ్చామని వివరించారు. గోషామహల్‌లో 30 ఎకరాల్లో రూ.3వేల కోట్లతో ఉస్మానియా ఆస్పత్రి నిర్మిస్తున్నామన్నారు. ఆ పనులు వేగంగా జరిగేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు.

## కడియం , సంజయ్‌లపై విచారణ

**హైదరాబాద్,మార్చి 26 :**పార్టీ మారలేదని పేర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, సంజయ్‌ల వ్యవహారంపై హైకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో ఇద్దరు ఎమ్మెల్యేలతో పాటు అసెంబ్లీ స్పీకర్‌కు కోర్టు నోటీసులు జారీ చేసింది. ఇటీవల కడియం శ్రీహరి, సంజయ్ పార్టీ మారలేదని అసెంబ్లీ స్పీకర్ తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే.అయితే, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్వర్ రెడ్డి, కెపి వివేకానంద స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. కడియం శ్రీహరి, సంజయ్‌లకు కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు ఆదేశించింది. ఇప్పటికే ఈ వ్యవహారం రాజకీయంగా చర్చనీయాంశంగా మారగా, కోర్టు విచారణపై అన్ని వర్గాల్లో ఆసక్తి నెలకొంది. తదుపరి విచారణను వచ్చే నెల 16వ తేదీకి వాయిదా వేసింది.

## ఆరోగ్యశ్రీపై అబద్ధాలు చెప్పే ప్రయత్నం

(మొదటి పేజీ తరువాయి)

హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మైకులు కట్‌చేసి తాము చెప్పాలనుకున్న వాస్తవాలను సభ దృష్టికి తీసుకురాకుండా ప్రభుత్వం అడ్డుపడు తోందన్నారు. హరీశ్ రావు మాట్లాడుతూ.. 'ఆరోగ్యశ్రీ ఖర్చుల పెంపుపై ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. 2014 జూన్ 2 నాటికి ఆరోగ్యశ్రీ కోసం నెలకు రూ.32 కోట్లు ఖర్చయ్యేవి. 2023 నాటికి ఇది రూ.68 కోట్లకు చేరుకుంది. కానీ.. ప్రభుత్వం రూ.89 కోట్లు ఖర్చు చేస్తున్నామని చెబుతోంది. జనాభా పెరుగుదల, వైద్య ఖర్చుల పెరుగుదల దృష్ట్యా ఈ పెంపు సహజం, ఇందులో కాంగ్రెస్ కొత్తగా సాధించిన ఘనతేమీ లేదు. కాంగ్రెస్ వచ్చిన తర్వాతే ఆరోగ్యశ్రీ ఖర్చులు బాగా పెరిగిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసి, పనులు చేపట్టిన ఆసుపత్రుల నిర్మాణానికి ప్రస్తుత ప్రభుత్వం జాప్యం చేస్తోంది. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి ఉంటే ఆ ఆస్పత్రులన్నీ పూర్తై ప్రజలకు మెరుగైన సేవలు అందేవి. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు మరింత అండగా నిలవాలనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎక్సైజ్ అదాయంలో వాటాను పెంచి నిధులను సమకూర్చింది' అని అన్నారు.

# విధుల్లో నిర్లక్ష్యం.?
# మిల్స్ కాలనీ ఎస్ఐ సస్పెండ్

**సీపీ సన్ ప్రీత్ సింగ్ఉత్తర్వులు జారీ..వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఘటన చోటు. ఎస్ఐపై వచ్చిన ఫిర్యాదులపై అధికారులు విచారణ.. ఆరోపణలు నిజం.**



**వరంగల్ ప్రతినిధి, మార్చి 26, (పీపుల్స్ న్యూస్):**మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ సురేష్పై సస్పెన్షన్ వేటు పడింది. విధుల్లో నిర్లక్ష్యం, ఇతర ఆరోపణల నేపథ్యంలో చర్యలు తీసుకున్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్ఐపై వచ్చిన ఫిర్యాదులపై అధికారులు విచారణ జరిపారు. ఆరోపణలు నిజమని తేల్చారు. విచారణ నివేదికను సీపీ సన్ ప్రీత్ సింగ్కు సమర్పించారు. నివేదిక ఆధారంగా శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు చేపట్టారు. బుధవారం రాత్రి సీపీ సన్ ప్రీత్ సింగ్ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్ఐ సురేష్ను విధుల నుండి తప్పించారు.


# ములుగు జిల్లా లోని సఖి కేంద్రాన్ని సందర్శించిన ములుగు మెడికల్ స్టూడెంట్స్



**ములుగు జిల్లా ప్రతినిధి మార్చి 26( పీపుల్స్ న్యూస్):**కమ్యూనిటీ మెడిసిన్ డిపార్ట్మెంట్ ఎంబీబీఎస్ సెకండియర్ చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు వారి కమ్యూనిటీ సర్వీస్ లో భాగంగా జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రాన్ని సందర్శించడం జరిగింది. ఈ సందర్శన సందర్భంగా సఖి కేంద్రం ద్వారా మహిళ లకు అందుతున్న సేవలను తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత మహిళ లకు సఖి కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలు గురించి చట్టాల గురించి హక్కుల గురించి క్షుణ్ణంగా వివరించడం జరిగింది. విద్యార్థి దశలోనే సమాజంలోని ఎన్నో సామాజిక రుగ్మతలు పరిస్థితుల పైన అవగాహన పెంచుకోవడం ఎంతో అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్లు భాస్కర్ , డాక్టర్ విజయ్, సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ లావణ్య సఖి సిబ్బంది మహిళ సాధికారత సిబ్బంది పాల్గొన్నారు.

# జీవన్ రెడ్డి గారు వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలి....

**-- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ మదన్ మోహన్**



**బాలానగర్ మార్చి 27 ( పీపుల్స్ న్యూస్)** :కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయంగా ఎదిగి ఎన్నో కీలక పదవులను అనుభవించిన జీవన్ రెడ్డి గారు ఈరోజు అదే పార్టీపై ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంపై విమర్శలు చేయడం తీవ్ర వివాదానికి దారి తీసింది. ఈ చర్యను కాంగ్రెస్ శ్రేణులు తీవ్రంగా ఖండిస్తున్నాయి. కాంగ్రెస్ అనే మహత్తర సంస్థ జీవన్ రెడ్డికి గుర్తింపు, గౌరవం, రాజకీయ స్థానం కల్పించిందని గుర్తు చేస్తూ అలాంటి పార్టీని విడిచిపెట్టి ఇప్పుడు అదే పార్టీపై విమర్శలు చేయడం ఆయన నైతిక విలువలపై ప్రశ్నలు లేవ నెత్తుతోందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వ్యక్తి గత ఆశయాలు నెరవేరలేదనే అసంతృప్తితో పార్టీపై దుష్ప్రచారం చేయడం ప్రజలు గమనిస్తున్నారని, ఇది కేవలం విశ్వాసఘాతం మాత్రమే కాకుండా రాజకీయ విలువలను పూర్తిగా విస్మరించిన చర్యగా కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికే రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిబద్ధతతో పనిచేస్తున్న వేళ, ఇలాంటి నిరాధార ఆరోపణలు చేయడం వెనుక వ్యక్తిగత స్వార్థం తప్ప మరేదీ లేదని విమర్శిస్తున్నారు. గతంలో కూడా కాంగ్రెస్ను విడిచిన మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఉదాహరణను ప్రస్తావిస్తూ, ఇలాంటి ఆరోపణలు చివరికి రాజకీయ పతనానికి దారి తీస్తాయని హెచ్చరిస్తున్నారు.

# పోలీసుల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం

**-- సీపీఎం నాయకుడు ఐలాపురం రాజశేఖర్ ఘాటు విమర్శలు**




**బాలానగర్ మార్చి 27 ( పీపుల్స్ న్యూస్) :**సైబరాబాద్ మున్సిపల్ కమిషనరేట్ పరిధిలోని బాలానగర్ మండలంలో సీపీఎం పార్టీ సభ్యులపై జరుగుతున్న అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఎం పార్టీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఐలాపురం రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్ధరాత్రి దాడులు -- ప్రజాస్వామ్యానికి ముప్పు"ముందస్తు అరెస్టుల పేరుతో అర్ధరాత్రి సమయంలో ఇళ్లలోకి చొరబడి తనిఖీలు చేయడం, కార్యకర్తలను అరెస్టు చేయడం పూర్తిగా అప్రజా స్వామికమని మండిపడ్డారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తాయని అన్నారు. ధర్నాకు అనుమతి తీసుకున్నా, అరెస్టులు ఎందుకు? ఇందిరా పార్క్ వద్ద నిర్వహించబోయే ధర్నాకు ప్రజాస్వామ్య పద్ధతిలో అనుమతి తీసుకున్నప్పటికీ, అర్ధరాత్రి ఇళ్లలోకి వెళ్లి కార్యకర్తలను అరెస్టు చేయడం ఏమిటని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే...రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే, ప్రజా పోరాటాలతో బుద్ధి చెబుతామని సీపీఎం పార్టీ హెచ్చరించింది. ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని, అక్రమ అరెస్టులను వెంటనే నిలిపివేయాలని సీపీఎం పార్టీ డిమాండ్ చేసింది.

# దళిత బంధు నిధులు విడుదల చేస్తూ, చేవెళ్ల ఎస్సి డిక్లరేషన్ తక్షణమే అమలు చేయాలి

**తెలంగాణ రాష్ట్ర దళిత బంధు సాధన సమితి డిమాండ్**
**రాష్ట్ర దళిత బంధు సాధన సమితి అధ్యక్షులు కోగిల మహేష్, రాష్ట్ర సలహాదారు దర్శనాల సంజీవ**







**ములుగు జిల్లా ప్రతినిధి మార్చి 26 (పీపుల్స్ న్యూస్):**తెలంగాణ రాష్ట్ర దళిత బంధు సాధన సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్, హైదర్ గూడా ఎన్ ఎస్ ఎస్ లో మీడియా సమావేశం 1పెండింగులో ఉన్న దళిత బంధు నిధులు విడుదల చేయాలికాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ చేవెళ్లే డిక్లరేషన్ అమలు చేయాలి కాంగ్రెస్ ఎన్నికలల్లో దళితులకు అంబేద్కర్ అభయహస్తం పథకం12లక్షలు అమలు చేయాలి, చట్టబద్ధత కల్పించాలి. మొదటి ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ లో దళిత బంధు కోసం కేటాయించిన వేయి కోట్లు ఎవరి జేబులోకి వెళ్లాయి బట్టి విక్రమార్క చెప్పాలి..నేను దళిత బిడ్డను అని చెప్పే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ బడ్జెట్ లో నిధులు ఎందుకు కేటాయించలేదో సమాధానం చెప్పాలి..కేవలం దళితుల ఓట్లకోసం చేవెళ్ల డిక్లరేషన్ చేశామని చెప్పి,దళితలకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాల త్వరలోనే చేవెళ్లలో దళితుల ఆత్మగౌరవ భారీ సదస్సును ఏర్పాటు చేసి.రేవంత్ రెడ్డి,మంత్రికర్గం చెస్తున్న మోసాలను ఎండగడుతాం చిత్తశుద్ధి ఉంటే బడ్జెట్లో ఎస్సీలకు జరిగిన అన్యాయాన్ని బాధ్యతగా స్వీకరించి దళిత మంత్రులు రాజీనామా చేయాలి ఈ కార్యక్రమంలో తెలంగాణ దళిత బంధు సాధన సమితి నాయకులు కందుల లక్ష్మయ్య, బడుపుల శంకర్, ఎనగందుల మొగిలి, మద్రి రేణుక పులిగిల్ల మధుకర్, ఇల్లందుల సుధాకర్ కొమ్ముల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

# గొదిరే ..పని అదిరే...!



**విద్యుత్ తీగలపై సర్కస్ ఫీట్లను తలపించిన అన్ మ్యాన్డ్ వర్కర్ సూరయ్య**
**లైన్ క్లియరెన్స్ కోసం చెట్ల కొమ్మలు తొలగింపు**





**(లక్ష్మీదేవి పేట )వెంకటాపూర్ ములుగు జిల్లా ప్రతినిధి మార్చి 26( పీపుల్స్ న్యూస్):**ప్రజలకు నిత్యం విద్యుత్ వెలుగులు అందించేందుకు ప్రాణాలకు తెగించి సిబ్బంది చేసే సాహసాలు, శ్రమ చాలామందికి కనిపించవు. గురువారం ఇంచెన్ చెరువుపల్లి గ్రామ పరిధిలో విద్యుత్ లైన్ క్లియరెన్స్ లో భాగంగా చెట్ల కొమ్మలను తొలగించేందుకు అన్మ్యాన్డ్ వర్కర్ గొదిరె సూరయ్య విద్యుత్ తీగలపై నడిచి వెళ్తూ సర్కస్ ఫీట్లను తలపించేలా చేసిన పనులు విద్యుత్ సిబ్బంది కష్టాలకు ప్రతిబింబంగా కనిపిస్తున్నాయి. మండు వేసవిని సైతం లెక్కచేయకుండా రైతులకు విద్యుత్ ఆటంకాలు లేకుండా ఉండేందుకు తీగల వెంట ఉన్న సమస్యలను తొలగించేందుకు వెంకటాపూర్ ఏఈ రమేష్ ఆధ్వర్యంలో ఏఎల్ఎం కృష్ణాకర్ సిబ్బందితో కలిసి చేస్తున్న పనులలో వెంకటాపూర్ సెక్షన్ లక్ష్మీదేవి పేట పరిధిలో పనిచేస్తున్న అన్ మ్యాన్డ్ వర్కర్ పనితీరును చూసిన పలువురు గొదిరె సూరయ్య.. పని అదిరిందయ్యా... అంటూ అభినందిస్తున్నారు. కాగా ఎన్పీడీసీఎల్ సీఎండీగా కార్తికేయ మిశ్రా ఉన్న సమయంలో అన్మ్యాన్డ్ వర్కర్ వ్యవస్థ అమలులోకి వచ్చింది. 2013 నుంచి వీరు పనిచేస్తున్నారు. విద్యుత్ లైన్మెన్ కింద సహాయకులుగా వీరిని నియమించారు. అన్మ్యాన్డ్ అంటే అన్స్కిల్డ్ అని అర్థం. ఎన్పీడీసీఎల్లో పనిచేస్తున్న అన్మ్యాన్డ్ కార్మికుల శ్రమకు తగ్గ వేతనాలు అందించేలా ప్రభుత్వం , విద్యుత్ శాఖ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# విద్యాతోనే శాశ్వత పేదరిక నిర్మూలన

**.అమరావతి విద్యాలయం కరస్పాండెంట్ వీరగాని రాజయ్య.**











**ములుగు జిల్లా ప్రతినిధి మార్చి 26 (పీపుల్స్ న్యూస్):**ములుగు జిల్లా, వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేట గ్రామంలో అమరావతి విద్యాలయం లో టిజి గురుకుల సెట్ ఫలితాలు వెలువడిన సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాజయ్య మాట్లాడుతూ, టి జి సెట్ గురుకులంలో విజయం సాధించిన విద్యార్థులకు అభినందనలు.మీ కష్టం, అంకితభావం ఫలించాయి. భవిష్యత్తు లో మరిన్ని విజయాలను సాధించాలని,మాట్లాడుతూ, విద్యా అనేది మనిషి జీవితంలో మహోన్నతమైన అంశం. విద్యా మనిషి ని మనిషిగా మారుస్తుంది, సమాజంలో గౌరవాన్ని సంపాదించి పెడుతుంది. విద్యార్థుల పట్టుదల, కష్టపడే తత్వం విద్యాలయం లోనే ఏర్పడతాయి.విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని, ఆ లక్ష్యాలను సాధించడానికి కష్టపడాలి. విద్యాలయంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులకు మార్గదర్శకులుగా ఉండాలి. విద్యార్థులు తమ పట్టుదల, కష్టపడే తత్వంతో విద్యాలయంలో మాత్రమే కాక, జీవితంలో కూడా విజయం సాధించగలరు. థామస్ ఎడిసన్ – విద్యుత్ బల్బు ఆవిష్కర్త స్టీవ్ జాబ్స్ – ఆపిల్ సంస్థ స్థాపకుడు అబ్దుల్ కలాం భారతదేశ మహామహులలో ఒకరు విద్యార్థులు తమ పట్టుదల, కష్టపడే తత్వంతో విజయం సాధించాలని ఈ సందర్భంగా తెలిపారు.

# ఆన్లైన్ గేమింగ్/బెట్టింగ్ మోసాలకు పాల్పడుతున్న భారీ ఆర్థిక నెట్వర్క్ గుట్టురట్టు

**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, మార్చి 26 (పీపుల్స్ న్యూస్) :** ఆన్లైన్ గేమింగ్/బెట్టింగ్ మోసాలకు పాల్పడుతున్న భారీ ఆర్థిక నెట్వర్క్ ను గుట్టురట్టు, హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు నలుగురు ప్రధాన నిందితులను అరెస్ట్ చేశారు. నిందితులు సుమారు రూ. 26,07,01,460/– లావాదేవీలు జరిపినట్లు గుర్తించారు. హైదరాబాద్కు చెందిన 24 ఏళ్ల యువతి, ఇన్స్టాగ్రామ్లో వచ్చిన ఒక తప్పుడు ప్రకటనను చూసి సుమారు రూ. 30 లక్షలు నష్టపోయినట్లు ఫిర్యాదు చేశారు. వాట్సాప్ ద్వారా ఆమెను 'ఎ1.స్త్రుఎవ' అనే గేమింగ్/కాసినో ప్లాట్ఫామ్లోకి ఆహ్వానించి, ప్రారంభంలో బోనస్లు మరియు నగదు ఉపసంహరణలు సులభంగా అయ్యేలా చేసి నమ్మకం కలిగించారు. అది నిజమైన సైట్ అని నమ్మిన బాధితురాలు, తన బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్.బి.ఐ మరియు ఇండియన్ బ్యాంక్ ఖాతాల నుండి పలు యూపీఐ (ఖ్రా×) లావాదేవీల ద్వారా భారీ మొత్తంలో నగదు డిపాజిట్ చేశారు. వరుసగా నష్టపోతున్నప్ప టికీ, కుటుంబ అప్పులు తీర్చాలనే ఆర్థిక అవసరం రీత్యా ఆమె మరింతగా ఆ ఉచ్చులో చిక్కుకుని, వారు సూచించిన వివిధ యూపీఐ ఐడీలకు నిరంతరం నగదు పంపారు. చివరకు, ఈ అనుమానాస్పద లావాదేవీల కారణంగా తన బ్యాంక్ ఖాతాలు ఫ్రీజ్ అయ్యాయని 'లీన్ మార్క్'చేయబడ్డాయని ఆమె గుర్తించారు. ఫలితంగా ఆమె పొదుపు చేసిన సొమ్మునంతా కోల్పోవడమే కాకుండా,ఖాతాలో ఉన్న మిగిలిన నిధులు కూడా నిలిచి పోయాయి.నిందితులైన రాజేష్ వెంకట రామన్ , గుజరాత్కు చెందిన రుషభ్ జస్వంతరాయ్ గాంధీలు 'వన్ స్టాప్ షాపింగ్ స్టేషన్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థకు డైరెక్టర్లుగా ఉన్నారు. వీరు క్లోజ్ఎక్స్ పే , ట్రస్టీ పే అకల్ట్ పే వంటి పేమెంట్ గేట్వేలను సృష్టించి, ఐఎంపీఎస్, యుపీఐ క్రెడిట్ డెబిట్ కార్డుల ద్వారా లావాదేవీలు నిర్వహించేవారు. ప్రతి లావాదేవీపై 2% నుండి 3% వరకు కమిషన్ వసూలు చేసేవారు.రాజేష్ వెంకట రామన్, ఈ పేమెంట్ గేట్వే కార్యకలాపాలను నిర్వహించడానికి భమిడిపాటి అభిషేక్ , కేరళకు చెందిన అగస్టీన్ విలియమ్స్ను ఉద్యోగులుగా నియమించుకున్నారు.ఢిల్లీకి చెందిన ఆండీ ఏ షహీర్, నకిలీ కంపెనీల పేరుతో 'మ్యూల్ ఖాతాల'ను తెరిచి, వాటి కెవైసీ వివరాలను గోవాకు చెందిన మన్మీత్ శర్మ ఏ సోనియాకు పంపేవారు.మన్మీత్ శర్మ ఆ పత్రాలను సేకరించి అభిషేక్కు పంపగా, అభిషేక్ వాటిని గుజరాత్లోని అహ్మదా బాద్లో గల సూర్యోదయ బ్యాంక్ అధికారులకు పంపేవాడు. సూర్యోదయ బ్యాంక్ అధికారులు 0.75% కమిషన్ తీసుకుని పేమెంట్ గేట్వే సేవలను అందించేవారు.బెట్టింగ్ ద్వారా వచ్చే సొమ్ము రాజేష్ వెంకట రామన్ నిర్వహించే గేట్వేలో డిపాజిట్ అయ్యేది. రాజేష్ తన 5% కమిషన్ , సోనియా వాటా 5% కమిషన్ ఉంచుకుని, మిగిలిన మొత్తాన్ని ఆండీ ఖాతాకు పంపేవాడు.ఈ విధంగా నిందితులంతా కలిసి బెట్టింగ్ వెబ్సైట్ల ద్వారా రూ. 26,07,01,460/– భారీ మొత్తంలో లావాదేవీలు జరిపారు.పరారీలో ఉన్న నిందితులు ఆండీ ఏ షహీర్ , రుషభ్ జస్వంతరాయ్ గాంధీల కోసం గాలింపు చర్యలు కొనసాగు తున్నాయి. ఈ కేసులో 4 ల్యాప్టాప్లు, 6 మొబైల్ ఫోన్లు , 09 చెక్ బుక్కులు , 02షెల్ కంపెనీల స్టాంపులు , రూ.6,50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఇన్ స్పెక్టర్ పి. శివ చంద్ర నేతృత్వంలోని బృందం ఛేదించింది. ఇందులో రిజర్వ్ ఇన్ స్పెక్టర్ సి.హెచ్. ప్రవీణ్, ఎస్.ఐ. ఎ. ఉమ, హెచ్.సి. సునీల్, పి.సి.లు భాస్కర్, గణేష్, సందీప్, విజయ్ కుమార్, మనీష్ కుమార్, డబ్ల్యూ.పి.సి. ధరణి మరియు ఎ.ఆర్.పి.సి. శివ కుమార్ సభ్యులుగా ఉన్నారు.

## విద్యుత్ ఏఈ రమేష్ సబ్ ఇంజనీర్ సాంబరాజుకు సలాం...


**-24 గంటల్లో ట్రాన్స్ఫార్మర్ అందించడం పట్ల లక్ష్మీదేవి పేట రైతుల సంతోషం**





**వెంకటాపూర్ (లక్ష్మీదేవి పేట) ములుగు జిల్లా ప్రతినిధి మార్చి 26 (పీపుల్స్ న్యూస్):**విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు కాలిపోతే తీవ్రంగా ఇబ్బంది పడ్డ రైతుల అవస్థలు తరచూ చూస్తుంటాం.కానీ తక్షణమే స్పందించి ట్రాన్స్ఫార్మర్ కాలిపోయిన 24 గంటల్లో రైతుల సమస్యను తీర్చిన ఏ ఈ రమేష్ ,సబ్ ఇంజనీర్ సాంబరాజుకు రైతులు సలాం కొడుతున్నారు. బుధవారం మండలంలోని లక్ష్మీదేవి పేట పరిధిలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ కాలిపోవడంతో రైతులు స్థానిక విద్యుత్ అధికారుల ద్వారా సబ్ ఇంజనీర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గురువారం ట్రాన్స్ఫార్మర్ ను ఏర్పాటు చేశారు. దీంతో రైతులు ముక్కెర వీరయ్య ,మామిండ్ల మల్లక్క ,గొడుగు సదానందం, కేతిరి రమేష్ , నత్రం సారయ్య, రంగశెట్టి రవి, ఎర్ర రమేష్ లు విద్యుత్ అధికారుల పనితీరు పట్ల సంతోషం వ్యక్తం చేశారు .

## శ్రీరామనవమి శోభాయాత్ర లో భాగంగా ట్రాఫిక్ మళ్లింపులు




**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, మార్చి 26 (పీపుల్స్ న్యూస్) :** శ్రీ రామ నవమి పర్వదినం సందర్భంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుండి సీతారాంబాగ్ ఆలయం నుండి సుల్తాన్ బజార్‌లోని హనుమాన్ వ్యాయామశాల పాఠశాల వరకు నిర్వహించే "శ్రీరామనవమి శోభాయాత్ర" సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపులు అమలులో ఉంటాయి. శోభాయాత్ర సాగే మార్గాల్లో ఉదయం 9:00 నుండి రాత్రి 9:00 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపులు వర్తిస్తాయని హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ తెలిపారు. సీతారాంబాగ్ ఆలయం: ఆసిఫ్ నగర్ నుండి భోయిగూడ కమాన్ వైపు వచ్చే ట్రాఫిక్ మల్లేపల్లి ఎక్స్ రోడ్స్ వద్ద విజయ్ నగర్ కాలనీ, నాంపల్లి మెహదీపట్నం వైపు మళ్లించబడుతుంది.ఫ్రెండ్స్ కేఫ్: అఘాపురా , భోయిగూడ కమాన్ బై-లేన్ల నుండి సీతారాంబాగ్ వైపు వచ్చే ట్రాఫిక్ భోయిగూడ కమాన్ వద్ద అఘాపురా హబీబ్ నగర్ వైపు మళ్లించబడుతుంది.భోయిగూడ కమాన్: దారుసలాం నుండి సీతారాంబాగ్ వైపు వచ్చే ట్రాఫిక్ అఘాపురా ఎక్స్ రోడ్స్ వద్ద ఘోడే-కీ-ఖబర్ లేదా కొత్త అఘాపురా, చార్‌కందిల్ ఎక్స్ రోడ్ , నాంపల్లి వైపు మళ్లించబడుతుంది.భోయిగూడ కమాన్ కుడి మలుపు: శోభాయాత్ర భోయిగూడ కమాన్ వద్ద మంగళ్‌హాట్ మార్కెట్ వైపు కుడి మలుపు తీసుకున్నప్పుడు, గాంధీ విగ్రహం నుండి మంగళ్‌హాట్ వైపు వచ్చే ట్రాఫిక్ ఘోడే-కీ-ఖబర్ వద్ద టక్కర్‌వాడీ జంక్షన్ లేదా కొత్త అఘాపురా వైపు మళ్లించబడుతుంది.జాలీ హనుమాన్ ఆలయం: పురానాపూల్ , జుమేరాత్ బజార్ నుండి మంగళ్‌హాట్ వైపు వచ్చే ట్రాఫిక్ గాంధీ విగ్రహం వద్ద టక్కర్‌వాడీ జంక్షన్ లేదా ఘోడే-కీ-ఖబర్/పురానాపూల్ వైపు మళ్లించబడుతుంది.రహీంపురా: పురానాపూల్ నుండి గాంధీ విగ్రహం వైపు వచ్చే ట్రాఫిక్ పురానాపూల్ ఎక్స్ రోడ్స్ వద్ద పురానాపూల్ దర్వాజా, కర్వాన్, కుల్సుంపురా 100 ఫీట్ రోడ్డు వైపు మళ్లించబడుతుంది.గాంధీ విగ్రహం: ఎంజే బ్రిడ్జ నుండి టక్కర్‌వాడీ జంక్షన్ వైపు వచ్చే ట్రాఫిక్ అఘాపురా , ఘోడే-కీ-ఖబర్ వైపు మళ్లించబడుతుంది. ఎంజే బ్రిడ్జ్ నుండి అఫ్జల్‌గంజ్/సిటీ కాలేజీ వైపు వెళ్లే వాహనాలు జుమేరాత్ బజార్ రోడ్డు మీదుగా మళ్లించబడతాయి.టక్కర్‌వాడీ జంక్షన్: బేగంబజార్ ఛత్రీ నుండి వచ్చే ట్రాఫిక్ రాణి అవంతి బాయి విగ్రహం వద్ద ఎంజే బ్రిడ్జ వైపు మళ్లించబడుతుంది.రాణి అవంతి బాయి విగ్రహం (జుమేరాత్ బజార్): బేగంబజార్ బై-లేన్ల నుండి గాంధీ విగ్రహం/పురానాపూల్ వైపు వచ్చే ట్రాఫిక్ లేబర్ అడ్డా వద్ద అలాస్కా టి-జంక్షన్ వైపు మళ్లించబడుతుంది.బేగంబజార్ ఛత్రీ: మాలకుంట నుండి ఎంజే బ్రిడ్జ వైపు వెళ్లే ట్రాఫిక్ అలాస్కా టీ-జంక్షన్ వద్ద దారుసలాం/మాలకుంట వైపు మళ్లించబడుతుంది. రంగచారి లేన్ , అఫ్జల్‌గంజ్ నుండి బేగంబజార్ వైపు వచ్చే ట్రాఫిక్ ఎస్ ఎ బజార్ (శ్రీకృష్ణ జ్యువెలరీ వద్ద) నుండి ఎంజే మార్కెట్ వైపు మళ్లించబడుతుంది.బర్తన్ బజార్: అఫ్జల్‌గంజ్ బై-లేన్ల నుండి ఎస్ఎ బజార్ వైపు వచ్చే ట్రాఫిక్ ఎస్ ఎ బజార్ యూ-టర్న్ వద్ద అఫ్జల్‌గంజ్/సాలార్‌జంగ్ బ్రిడ్జ వైపు మళ్లించబడుతుంది.ఎస్ ఎ బజార్: అజంతా గేట్ మరియు జాంబాగ్‌ల నుండి ఎస్ ఎ బజార్ వైపు వచ్చే ట్రాఫిక్ ఎం.జే మార్కెట్ వద్ద పుత్లీబౌలి ,రంగమహల్ వైపు మళ్లించబడుతుంది.ఎస్ఎ బజార్ మసీదు: నయాపూల్ నుండి ఎస్ఎ బజార్ మసీదు వైపు వచ్చే ట్రాఫిక్ అఫ్జల్‌గంజ్ టి-జంక్షన్ వద్ద సెంట్రల్ లైబ్రరీ -- శివాజీ బ్రిడ్జ -- సీబీఎస్ వైపు మళ్లించబడుతుంది.ఎంజే మార్కెట్: నాంపల్లి మరియు అబిడ్స్ నుండి ఎస్ఎ బజార్ మసీదు వైపు వెళ్లే ట్రాఫిక్ ఎం.జే మార్కెట్ వద్ద జాంబాగ్, పుట్లీబౌలి , రంగమహల్ వైపు మళ్లించబడుతుంది.అబిడ్స్ జీపీఓ: అబిడ్స్ రోడ్డు నుండి ఎంజే మార్కెట్ వైపు వచ్చే ట్రాఫిక్ బ్యాంక్ స్ట్రీట్ , ఆంధ్ర బ్యాంక్ రోడ్డు వైపు మళ్లించబడుతుంది. (యాత్ర శంకర్ షేర్ హోటల్ చేరుకోగానే ఈ మళ్లింపు తొలగించబడుతుంది).ఎస్ఎ బజార్/గౌలిగూడ చమన్: పుట్లీబౌలి నుండి శంకర్ షేర్ హోటల్ వైపు వచ్చే ట్రాఫిక్ గౌలిగూడ చమన్ వద్ద త్రివేణి లాడ్జ సీబీఎస్ వైపు మళ్లించబడుతుంది.శంకర్ షేర్ హోటల్: రంగమహల్ నుండి గౌలిగూడ చమన్ వైపు వచ్చే ట్రాఫిక్ పుట్లీబౌలి ఎక్స్ రోడ్స్ వద్ద జాంబాగ్ మరియు ఎం.జే మార్కెట్ వైపు మళ్లించబడుతుంది. ఆంధ్ర బ్యాంక్ నుండి వచ్చే ట్రాఫిక్ కూడా ఇదే విధంగా మళ్లించబడుతుంది.రామ్ మందిర్ కమాన్: చాదర్‌ఘాట్ ఎక్స్ రోడ్ నుండి పుట్లీబౌలి/జాంబాగ్ వైపు వచ్చే ట్రాఫిక్ రంగమహల్ వై -జంక్షన్ వద్ద సీబీఎస్ , అఫ్జల్‌గంజ్ వైపు మళ్లించబడుతుంది.రామ్ మందిర్ కమాన్ (అబిడ్స్ నుండి): జీపీఓ -అబిడ్స్ నుండి పుట్లీబౌలి ఎక్స్ రోడ్ వైపు వచ్చే ట్రాఫిక్ ఆంధ్ర బ్యాంక్ ఎక్స్ రోడ్ వద్ద డిఎంహెచ్ఎస్ ఎక్స్ రోడ్ వైపు మళ్లించబడుతుంది. అబిడ్స్ రోడ్డు నుండి బ్యాంక్ స్ట్రీట్ వైపు వచ్చే వాహనాలను జీపీఓ వద్ద ఎం.జే మార్కెట్ వైపు మళ్లిస్తారు.పుట్లీబౌలి ఎక్స్ రోడ్: ఎంజే మార్కెట్ నుండి ట్రూప్ బజార్/బ్యాంక్ స్ట్రీట్ వైపు వచ్చే ట్రాఫిక్ యూసుఫ్ అండ్ కంపెనీ వద్ద జీపీఓ , ఎంజే మార్కెట్ వైపు మళ్లించబడుతుంది.పుట్లీబౌలి ఎక్స్ రోడ్ (చాదర్‌ఘాట్ నుండి): చాదర్‌ఘాట్ నుండి ఆంధ్ర బ్యాంక్ ఎక్స్ రోడ్ వైపు వచ్చే ట్రాఫిక్ డిఎంహెచ్ఎస్ ఎక్స్ రోడ్ వద్ద సుల్తాన్ బజార్ ఎక్స్ రోడ్ వైపు మళ్లించబడుతుంది. సుల్తాన్ బజార్ నుండి వచ్చే ట్రాఫిక్ చాదర్‌ఘాట్ వైపు మళ్లించబడుతుంది.ఆంధ్ర బ్యాంక్ ఎక్స్ రోడ్: చాదర్‌ఘాట్ ఎక్స్ రోడ్ నుండి డిఎంహెచ్ఎస్ ఎక్స్ రోడ్ వైపు వచ్చే ట్రాఫిక్ చాదర్‌ఘాట్ ఎక్స్ రోడ్స్ వద్ద నింబోలిఅడ్డ -- కాచిగూడ ఎక్స్ రోడ్ వైపు మళ్లించబడుతుంది.ఆంధ్ర బ్యాంక్ ఎక్స్ రోడ్ (నారాయణగూడ నుండి): నారాయణగూడ నుండి బడీచౌడి వైపు వచ్చే ట్రాఫిక్ కాచిగూడ ఎక్స్ రోడ్ వద్ద కాచిగూడ స్టేషన్ రోడ్డు వైపు మళ్లించబడుతుంది. అబిడ్స్ నుండి ఆంధ్ర బ్యాంక్ వైపు వచ్చే ట్రాఫిక్ జీపీఓ వద్ద ఎంజే మార్కెట్ వైపు మళ్లించబడుతుంది.సుల్తాన్ బజార్ ఎక్స్ రోడ్: బాటా రోడ్ -- కింగ్ కోఠి -- రాంకోఠి ఎక్స్ రోడ్ నుండి ప్రగతి టిఫిన్ సెంటర్ వైపు వచ్చే ట్రాఫిక్ బొగ్గులకుంట ఎక్స్ రోడ్ వద్ద మళ్లించబడుతుంది.రద్దీ ఉండే ప్రాంతాలు: బేగంబజార్ ఛత్రీ, ఎస్ఎ బజార్, అఫ్జల్‌గంజ్ ౹-జంక్షన్, శివాజీ బ్రిడ్జ, సీబీఎస్ , రంగమహల్ వై-జంక్షన్, పుట్లీబౌలి ఎక్స్ రోడ్, కోఠి ఆంధ్ర బ్యాంక్, అబిడ్స్ జీపీఓ, ఎంజే మార్కెట్, చాదర్‌ఘాట్, కాచిగూడ ఎక్స్ రోడ్, నింబోలిఅడ్డ ప్రాంతాలు రద్దీగా ఉంటాయని తెలిపారు. ప్రయాణికులందరూ పై ట్రాఫిక్ ఏర్పాట్లను గమనించి, తదనుగుణంగా ప్రయాణాన్ని ప్లాన్ చేసుకోవాలని తెలిపారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు. తాజా సమాచారం కోసం మా సోషల్ మీడియా పేజీలను ఫాలో అవ్వండి లేదా అత్యవసర సహాయం కోసం ట్రాఫిక్ హెల్ప్‌లైన్ 9010203626 కు కాల్ చేయాలన్నారు.

# మేడారం గద్దెల వద్ద ప్రమాదం...

**పూజారి కుమారుడికి తీవ్ర గాయాలు...**
**నిర్మాణాల నాణ్యతపై విమర్శలు...**
**ప్రభుత్వంపై రాజకీయ ఆరోపణలు....**

**ములుగు ప్రతినిధి మార్చి 26(పీపుల్స్ న్యూస్)** తెలంగాణలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన మేడారం సమ్మక్క--సారలమ్మ గద్దెల వద్ద జరిగిన ప్రమాదం తీవ్ర చర్చనీయాంశమైంది. గద్దెల పరిసరాల్లో నిర్మించిన రాతి దిమ్మలు అకస్మాత్తుగా కూలిపోవడంతో సమ్మక్క ప్రధాన పూజారి కుటుంబానికి చెందిన బాలుడు తీవ్రంగా గాయపడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. సమ్మక్క ప్రధాన పూజారి సిద్దబోయిన రానా రమేష్ కుమారుడు యువన్ (6) గద్దెల వద్ద ఆడుకుంటుండగా, అక్కడ ఏర్పాటు చేసిన రాతి దిమ్మలు ఒక్కసారిగా కూలిపోయాయి. ఈ ప్రమాదంలో బాలుడి కాలు రెండు చోట్ల విరిగినట్లు సమాచారం. అతనికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం వరంగల్‌కు తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బాలుడు చికిత్స పొందుతున్నాడు.

నాసిరకం పనులపై ఆరోపణలు...

ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మేడారం వంటి ప్రముఖ ఆధ్యాత్మిక స్థలంలో నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నిర్వహించడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపిస్తున్నారు. ఇటీవల నిర్మించిన రాతి కట్టడాలు బలహీనంగా ఉన్నాయని విమర్శలు

కనీస భద్రతా ప్రమాణాలు పాటించలేదని ఆరోపణలు

పర్యవేక్షణలో అధికారులు విఫలమయ్యారని స్థానికుల ఆవేదన

గాయపడిన బాలుడికి ప్రభుత్వం పూర్తి వైద్య ఖర్చులు భరించాలి–

బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు సిద్దబోయిన సురేందర్.

ప్రభుత్వ పనుల్లో నాణ్యతా లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని,







గాయపడిన బాలుడికి ప్రభుత్వం పూర్తి వైద్య ఖర్చులు భరించాలని డిమాండ్ చేశారు

మేడారం పనులపై షీట్ విచారణ చేపట్టాలి టిఆర్ఎస్ ములుగు జిల్లా నాయకుడు భూక్య జంపన్న ఈ ప్రకటన ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని వందేళ్ళ కట్టడాలు అంటూ చెప్పిన నిర్మాణాలు వంద రోజులు కూడా నిల్వలేదని కాంట్రాక్టర్లకు పనులు వదిలేసి నాణ్యతను పట్టించుకోలేదని భక్తుల ప్రాణాల కంటే కమిషన్లకే ప్రాధాన్యం ఇచ్చారని మేడారం పాములపై షీట్ విచారణ చేపట్టాలి అని నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని సంబంధిత మంత్రులు నైతిక బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు

అధికారుల మౌనం

ఈ ఘటనపై సంబంధిత శాఖల అధికారులు ఇంకా అధికారికంగా స్పందించకపోవడం గమనార్హం ప్రమాదానికి గల కారణంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు కోట్లాదిమంది భక్తులు విశ్వాసానికి ప్రతిగంగా నిలిచిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలో ఈ ఘటన భద్రత ప్రమాణాలపై ప్రశ్నలు లేవనెత్తుతుంది చిన్నారి గాయపడిన ఈ సంఘటన పై ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

# దక్షిణ అయోధ్య భద్రాద్రిలో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం


**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.**
**శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణం, మహా పట్టాభిషేకం ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి .**

**భద్రాచలం , మార్చి 26 (పీపుల్స్ న్యూస్) :** భక్త రామదాసు నిర్మించిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం "దక్షిణ అయోధ్య"గా ప్రసిద్ధి చెందినదని, ఈ పవిత్ర క్షేత్రానికి దేశ విదేశాల నుంచి భారీగా భక్తులు విచ్చేసే అవకాశం ఉన్నందున ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమగ్ర ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత ఉ జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. గురువారం భద్రాచలంలోని మిథిలా స్టేడియంలో నిర్వహించనున్న శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణం, మహా పట్టాభిషేకం ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించేందుకు విచ్చేయనున్నారని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం సమన్వయంతో ప్రతి శాఖ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, వీఐపీలు, వివిఐపీలు, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మర్యాదపూర్వకంగా సేవలు అందించాలని మంత్రి ఆదేశించారు. శుక్రవారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు స్వామివారి కల్యాణం, 28వ తేదీన అదే సమయాల్లో మహా పట్టాభిషేకం నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు.భక్తుల రాకను దృష్టిలో ఉంచుకొని అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.351 కోట్లను మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. స్వామివారి కల్యాణం అనంతరం ముఖ్యమంత్రి చేతుల మీదుగా భూమిపూజ నిర్వహించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. దేవాలయ అభివృద్ధితోపాటు భద్రాచలం పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.భక్తులకు





మరింత సౌకర్యం కల్పించేందుకు రహదారులు, రైల్వే, నదీ మార్గాల అభివృద్ధిపై చర్యలు తీసుకుంటున్నామని, అమరావతి--జగదల్పూర్ మధ్య రవాణా సౌకర్యాల విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. భద్రాచలాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకొని కరకట్టల ఎత్తు పెంపు, ఘాట్‌ల నిర్మాణం, రెండో పీట నిర్మాణం వంటి పనులు చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో భక్తుల రాకను మరింత సులభతరం చేసే దిశగా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.అనంతరం భద్రాచలం అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికల ఫోటోలను మంత్రి పరిశీలించారు.వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం మిథిలా స్టేడియం వద్ద జిల్లా కలెక్టర్ అంకిత్ సెక్టార్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తలంబ్రాల కౌంటర్లు, ప్రసాదాల కౌంటర్లు, పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వైద్య సదుపాయాలు వంటి అన్ని అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సెక్టార్ అధికారులు, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు



తీసుకోవాలని సూచించారు. ప్రతి అధికారి క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, ఎక్కడైనా లోపాలు గమనించిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ స్పష్టం చేశారు.శ్రీరామనవమి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటీడీఏ పీవో రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్, దేవస్థానం ఈవో దామోదర్ రావు, ఎస్పీ రోహిత్ రాజ్, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.


# అక్రమంగా నీటి తరలింపు.. వద్దని హెచ్చరించిన ఎమ్మార్వో.

**జిన్నారం : మార్చి 26 (పీపుల్స్ న్యూస్):**జిన్నారం మండలంలో అక్రమంగా నీటిని తరలిస్తున్న ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. వేసవికాలం కారణంగా నీటి కొరత ఏర్పడిన నేపథ్యంలో, కొందరు నీటి వ్యాపారులు అధిక లాభాల కోసం ట్యాంకర్ల ద్వారా అనుమతి లేకుండా నీటిని తరలిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై స్థానిక ప్రజలు జిన్నారం తహసిల్దార్ దేవదాసుకు ఫిర్యాదు చేయడంతో అధికారులు అప్రమత్తమయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మార్వో దేవదాసు మాట్లాడుతూ, వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి అక్రమంగా నీటిని తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతి లేకుండా బోరులు త్రవ్వడం, నీటిని వాణిజ్యపరంగా తరలించడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు.ఇప్పటికే సంబంధిత సిబ్బందిని క్షేత్రస్థాయిలో నిఘా పెట్టినట్లు తెలిపారు. ఇకపై ఎవరైనా అక్రమంగా నీటిని తరలిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు కూడా ఇలాంటి ఘటనలు గమనిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అక్రమ నీటి ట్యాంకర్ల వెనుక ఉన్నదెవరు..?


నగర పరిధిలో అక్రమంగా నీటి రవాణా వ్యవహారం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుంటూ, అక్రమంగా నీటిని తరలిస్తున్న ట్యాంకర్లను అడ్డుకుంటున్నప్పటికీ, వందల సంఖ్యలో నీటి ట్యాంకర్లు నిరంతరం రాకపోకలు కొనసాగించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

స్థానికుల సమాచారం మేరకు, ఈ అక్రమ నీటి రవాణా వెనుక ఒక పెద్ద సిండికేట్ పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. కొంతమంది ప్రభావశీలుల అండతోనే ఈ ట్యాంకర్లు ఎటువంటి అడ్డంకులు లేకుండా రాత్రింబవళ్లు నీటిని తరలిస్తున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నియమాలను ధిక్కరిస్తూ, భూగర్భ











జలాలను అధికంగా దోచుకుంటూ ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారని సమాచారం. దీని వల్ల స్థానికంగా నీటి కొరత తీవ్రంగా మారుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇదిలా ఉండగా, రెవెన్యూ అధికారులు కొన్నిచోట్ల దాడులు నిర్వహించి ట్యాంకర్లను సీజ్ చేసినప్పటికీ, ఈ చర్యలు సరిపోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలంటే పెద్ద ఎత్తున దర్యాప్తు చేసి, సిండికేట్ వెనుక ఉన్న అసలు మాస్టర్మైండ్లను బయటకు తీసుకురావాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

# ప్రయాణికుల సజీవ దహనం.. స్పందించిన డిప్యూటీ సీఎం, మంత్రులు



**అమరావతి, మార్చి 26:** మార్కాపురం సమీపంలో రాయవరం వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 13 మంది ప్రయాణికులు సజీవ దహనమైన ఘటనపై సీఎం చంద్రబాబు నాయుడి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తోపాటు మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ప్రగాఢ సానుభూతి: పవన్ కల్యాణ్ మార్కాపురం జిల్లా రాయవరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో 13 మంది సజీవ దహనం అయ్యారని తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యానని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ ప్రమాదానికి గల కారణాలను జిల్లా అధికార యంత్రాంగం నుంచి వివరాలు తీసుకున్నానని చెప్పారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని అధికారులకు స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఈ మేరకు ఎక్స్ ఖాతా వేదికగా పవన్ కల్యాణ్ తెలిపారు.అత్యంత విషాదకరం: హోం మంత్రి అనిత టిప్పర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టడంతో బస్సు పూర్తిగా అగ్నికి ఆహుతి కావడం అత్యంత విషాదకరమని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఈ దుర్ఘటనలో పలువురు సజీవదహనం కావడంపై తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తక్షణమే క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా ఉన్నతాధికారులను మంత్రి అదేశించారు.ఈ ప్రమాద ఘటనపై జిల్లా కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాద ఘటనపై సమాచారం అందగానే.. హుటాహుటిన విజయవాడ నుంచి రాయవరానికి హోం మంత్రి అనిత బయలుదేరారు. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని బాధిత కుటుంబాలకు ఈ సందర్భంగా మంత్రి అనిత భరోసా ఇచ్చారు. ఈ ప్రమాద ఘటన కారణంగా చేపట్టిన సహాయక చర్యలను మంత్రి అనిత ఎప్పటికప్పుడు అధికారులను అడిగి తెలుసుకుంటున్నారు.ఆ వార్తలు కలచివేస్తున్నాయి: మంత్రి రాంప్రసాద్‌ఈ ప్రమాదంలో పలువురు సజీవదహనం కావడం చాలా బాధాకరమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. మృతుల కుటుంబాలకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రోడ్డు ప్రమాదాల వల్ల నిండు ప్రాణాలు కోల్పోవడం చాలా విషాదకరమన్నారు. గాయపడిన వారికి అత్యుత్తమ వైద్యం అందించాలని అధికారులకు ఆదేశించారు. ప్రమాదంపై పూర్తి వివరాలు సేకరించాలని వారికి సూచించారు. మృతుల సంఖ్య పెరగ వచ్చుంటూ వస్తున్న వార్తలు తనను కలచివేస్తున్నాయని మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.డ్రైవర్లు ప్రయాణాల్లో నిబంధనలు పాటించాలి: మంత్రి సవితరాయవరం వద్ద ప్రమాద ఘటనలో మృతుల ఆత్మలకు శాంతి కలగాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు మంత్రి సవిత తెలిపారు. 13 మంది ప్రయాణికులు సజీవ దహనం కావడంపై విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. మృతులు, క్షతగాత్రుల వివరాలు సేకరించి.. వాటిని వారి బంధువులకు తెలియపర్చాలని మార్కాపురం జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఆదేశించినట్లు తెలిపారు. ప్రయాణాల్లో నిబంధనలు పాటించాలని డ్రైవర్లకు సూచించారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలంటూ బస్సు డ్రైవర్లకు స్పష్టం చేశారు. బస్సుల్లో ప్రయాణికులను జాగ్రత్తగానలు పాటించాలని డ్రైవర్లకు సూచించారు. గమ్యస్థానాలకు చేర్చేలా చూడాలని వారిని మంత్రి సవిత కోరారు.బాధితులకు సాయ చర్యలు ముమ్మరం చేయాలి: మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిసజీవ దహనం ఘటన తీవ్ర ఆవేదనకు గురి చేసిందని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పలకల క్వారీల వద్ద టిప్పర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకోవడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని జిల్లా అధికారులకు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశించారు. ఘటనాస్థలిలో బాధితులకు సహాయ చర్యలు ముమ్మరం చేయాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం అండగా ఉంటుంది: గొట్టిపాటి రవికుమార్‌ఈ ప్రమాద ఘటనపై మంత్రి గొట్టిపాటి రవి కుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ హామీ ఇచ్చారు. ఈ ప్రమాదంపై సమాచారం అందిన వెంటనే అధికారులు, స్థానిక ఎమ్మెల్యేతో మంత్రి గొట్టిపాటి మాట్లాడారు. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలను మంత్రి గొట్టిపాటికి అధికారులు వివరించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బస్సులో ప్రయాణికులు సజీవ దహనం కావడంపై తీవ్ర విచారకరమన్నారు. మృతుల కుటుంబాలకు ఆయన తన సానుభూతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానని మంత్రి గొట్టిపాటి తెలిపారు.అత్యంత విషాదకరం: మంత్రి ఆనంటిప్పర్‌ను ఢీకొట్టడంతో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు పూర్తిగా అగ్నికి ఆహుతి కావడం అత్యంత విషాదకరమని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో పలువురు సజీవదహనం కావడం పట్ల ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తక్షణమే క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను అదేశించారు. ఈ ప్రమాదానికి గల కారణాలను పూర్తిగా పరిశీలించి నివేదిక అందజేయాలని జిల్లా కలెక్టర్, ఎస్పీలను ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు.

## బాధ్యులైన వారిపై కఠిన చర్యలు



**మార్కాపురం, మార్చి 26:** ప్రకాశం జిల్లా మార్కాపురంలో జరిగిన బస్సు ప్రమాద ఘటన బాధాకరమని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డ అన్నారు. ఈరోజు ఉదయం బస్సు ప్రమాద ఘటనా స్థలాన్ని మంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ ప్రమాదానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రమాదంలో 13 మంది మరణించారని. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని అన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తామని మంత్రి వెల్లడించారు. కర్నూలు ఘటన జరిగిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామని.. ట్రావెల్స్ బస్సుల తనిఖీలు నిర్వహిస్తున్నామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.బస్సు ప్రమాదంపై మంత్రి సుభాష్ దిగ్భ్రాంతి మార్కాపురంలో జరిగిన బస్సు ప్రమాదంపై మంత్రి వాసంశెట్టి సుభాష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఘటనాస్థలిలో బాధితులకు అన్ని రకాల సహాయ చర్యలు అందించాలన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం అందేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచనలు చేశారు.

## మార్కాపురం బస్సు ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన వైఎస్ జగన్



**అమరావతి :** మార్కాపురం ఘటనపై మాజీ సీఎం వైఎస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదంలో పలువురు మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిటమైన చర్యలు తీసుకోవాలన్నారు. కాగా, ఏపీలోని మార్కాపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ నుంచి పామూరు వెళున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు రాయవరం సమీపంలో పలకల క్వారీల వద్ద టిప్పర్‌ను ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో భయంతో పది మంది ప్రయాణికులు దిగిపోగా ఘటనలో మరో పది మంది సజీవదహనమయ్యారు. 26 మంది గాయపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. పమాద సమయంలో బస్సులో మొత్తం 40 మంది ప్రయాణికులు ఉన్నారు.

## ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలపై ఏపీ స్పీకర్ క్లారిటీ




**అమరావతి, మార్చి 26:** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి పూర్తిస్థాయి చట్టబద్ధత కల్పించే దిశగా కీలక అడుగు పడిందని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు వెల్లడించారు. రాజధాని అమరావతి చట్టబద్ధత కోసమే అసెంబ్లీ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. గురువారం వెలగపూడిలోని సచివాలయంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. మార్చి 28వ తేదీ ఉదయం 11 గంటలకు అసెంబ్లీ ప్రత్యేక సమావేశం జరుగనుందని చెప్పారు. అమరావతిని రాజధానిగా గుర్తించాలనే అంశంపై ఇప్పటి వరకు చట్టపరమైన స్పష్టత లేదని పేర్కొన్నారు.ఈ లోటును భర్తీ చేసేందుకే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఆయన వివరించారు. విజయవాడ – అమరావతి ప్రాంతమే రాష్ట్ర రాజధానిగా ఉండాలని అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి.. ఆ వెంటనే కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని స్పీకర్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా అమరావతిని రాజధానిగా ఆమోదించిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అయితే ఈ బిల్లు పార్లమెంట్‌లో పాస్ కావాల్సి ఉందన్నారు. ఏప్రిల్ 4 వరకు పార్లమెంట్ సమావేశాలు జరగనున్నాయని.. ఈ నేపథ్యంలో ఏపీ అసెంబ్లీ చేసే ఈ తీర్మానాన్ని వెంటనే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టం చేయించేలా నిర్ణయం తీసుకుంటారని స్పీకర్ తెలిపారు. ఈ చట్టం పూర్తి అయితే రాజధాని విషయంలో కొందరు చేస్తున్న విమర్శలకు శాశ్వతంగా తెరపడుతుందన్నారు. గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఉత్తర్వుల మేరకు వెలగపూడిలోని అసెంబ్లీ హాల్‌లో ఈ ఆరో సెషన్ జరుగు తుందని ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వివరించారు.

## ఏపీలో 10 లక్షల పీఎన్‌జీ కనెక్షన్‌లే లక్ష్యం



**అమరావతి, మార్చి 26:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షత ఏపీ కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలను మంత్రి నాదెండ్ల మనోహర్ మీడియాకు వివరించారు. ఎల్పీజీ సిలెండర్‌లకు సంబంధించి ఏపీ క్యాబినెట్‌లో కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఎల్పీజీ సిలెండర్‌లు వాడుతున్న వారు గుంటూరు, నెల్లూరు, కాకినాడ, విశాఖ వంటి నగరాల్లో పైప్డ్ గ్యాస్‌ను వాడేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. పీఎన్‌జీ ద్వారా గ్యాస్ నిరంతరం సరఫరా అవుతుందన్నారు. అపార్టమెంట్స్, ఇండస్ట్రీయల్ యూనిట్‌లు ఈ స్కీమ్‌ను వాడుకుంటే కేంద్రం ఇన్సెంటివ్‌లు కూడా వస్తాయని వెల్లడించారు.ప్రధాన దేవాలయాల్లో పీఎన్‌జీ ఫెసిలిటీ తీసుకోవాలని ఆదేశించామని మంత్రి తెలిపారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే ఆంధ్రప్రదేశ్‌కు ఈ విషయంలో ఎక్కువ సౌలభ్యం ఉందని అన్నారు. జీఎస్టీని 5 శాతం నుంచి 25 శాతానికి పెంచడం వల్ల లబ్ధిదా రులు ముందుకు రాలేదని చెప్పారు. దీపం సబ్సిడీ పథకాన్ని పీఎన్జీ సబ్ స్క్రైబర్స్‌కు కూడా వర్తించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. దీపం పథకంలో నాలుగు నెలలకు ఒకసారి ఫ్రీ సిలెండర్ ఇస్తున్నామని.. పీఎన్‌జీలో రెండు నెలలకు ఒకసారి ఆ పేమెంట్‌ను షేర్ చేస్తామన్నారు. రూ.2,400 డీబీటీ సొమ్మును మూడు సిలెండర్లకు సమానంగా పైప్డ్ గ్యాస్ పైప్‌లైన్‌కు మారేవారికి బదిలీ చేస్తామన్నారు. 24 గంటల్లోనే పైప్ లైన్లు వేసుకోవడానికి అనుమతులు అందిస్తామని లేదా ఆటోమెటిక్‌గా అనుమతులు వచ్చేస్తాయని మంత్రి తెలిపారు. పీఎన్‌జీకి 10 లక్షల కొత్తకనెక్షన్‌లు ఇచ్చేలా టార్గెట్ పెట్టుకున్నామ న్నారు. నెలరోజుల్లో లక్షమందికి అందించేలా చర్యలు తీసకుంటామని చెప్పారు. సోషల్ మీడియా భయాందోళనలు సృష్టిస్తోందని.. ఏపీలో ఎక్కడా పెట్రోల్, గ్యాస్, డీజిల్ విషయ ంలో కొరత లేదని స్పష్టం చేశారు. ప్రతిరోజు 2 లక్షల 70 వేల మందికి గ్యాస్ సిలెండర్‌లు అందిస్తున్నామన్నారు. కేంద్రం ఇచ్చిన ప్రోత్సాహంతో ఇండక్షన్ స్టవ్‌లు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేస్తున్నామని, ఆ ప్రక్రియ కొనసాగుతుందని అన్నారు. దేశంలోనే మొదటి సారి ఏపీ ప్రభుత్వం ఈ విధానాన్ని పాలసీగా తీసుకుని అమలు చేస్తోందని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.రాజధాని అమరావతిపై. .రాజధాని అమరావతి అంశంపై కూడా ఏపీ కేబినెట్‌లో చర్చ జరిగింది. 2014లో గుంటూరు–విజయవాడ మధ్య రాజధాని ఏర్పాటు చేస్తామని ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తుచేశారు. ఈసారి సీఆర్‌డీఏ పరిధిలో అమరావతిని రాజధానిగా పేర్కొని తీర్మానం చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఈ నెల 28న అసెంబ్లీలో అమరావతి రాజధాని అంశంపై తీర్మానం చేసి పంపుతామని ప్రకటించారు. రాజధాని చరిత్రను ప్రజలకు తెలియజేయాలని సీఎం స్పష్టం చేశారు. కర్నూలు నుంచి హైదరాబాద్‌కు మారిన రాజధాని మళ్లీ అమరావతికి వచ్చిందని వివరించారు. 2014లో జగన్‌మోహన్ రెడ్డి కూడా గుంటూరు – విజయవాడ మధ్యే రాజధాని అని సమర్థించారని, అధికారంలోకి వచ్చాక మూడు రాజధానులు అని మార్చారన్నారు. ఆ సమయంలో శాసనమండలి చైర్మన్ షరీఫ్‌పై దాడి చేసినంత పని చేశారని విమర్శించారు.అమరావతి రాజధాని అని తీర్మానం చేసి పంపాలని పీఎంఓ చెప్పిందని సీఎం తెలిపారు. శనివారం(మార్చి 28) అసెంబ్లీలో తీర్మానం చేసి అదే రోజు సాయంత్రానికి పంపుతామని తెలిపారు. ఏప్రిల్ 1న జరిగే కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ తీర్మానం ఆమోదం పొందుతుందని పీఎంఓ తెలిపిందని సీఎం వెల్లడించారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే సవరణ బిల్లు ప్రవేశపెట్టనున్నారని సీఎం చెప్పారు. హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం రాజధానికి అనుకూలంగా తీర్పు ఇచ్చినప్పుడు రైతులు ధర్మాసనం సభ్యులకు పూలు చల్లి వీడ్కోలు పలికారని సీఎం గుర్తుచేశారు. డీలిమిటేషన్ వల్ల అసెంబ్లీ సీట్లు 50 శాతం పెరుగుతాయని, దీని ద్వారా 50 శాతం మందికి అవకాశాలు వస్తాయని వివరించారు. రాజకీయ పార్టీలకు ఇది మంచి అవకాశమని చంద్రబాబు అన్నారు. మార్చి 28న ఉదయం 11 గంటల నుంచి అసెంబ్లీ సమావేశాల్లో నాలుగు గంటల పాటు చర్చ నిర్వహించాలని నిర్ణయించినట్లు సీఎం తెలిపారు.విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణీలో నష్టాలను తగ్గించేందుకు ఏపీ కేబినెట్‌లో సీఎం చంద్రబాబు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. సూర్యాఘర్ పథకం కింద ఏప్రిల్ 5 నుంచి 14 వరకు ప్రతి నియోజకవర్గంలో 2,000 రూఫ్‌టాప్ కనెక్షన్లు ఇవ్వాలని సూచించారు. 33/11 కెవి సబ్‌స్టేషన్ల వద్ద బ్యాటరీ స్టోరేజ్ ఎనర్జీ సిస్టమ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండేళ్లలో ఒక్క పైసా కూడా విద్యుత్ ఛార్జీలు పెంచలేదని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు.

## ఏపీ కేబినెట్ భేటీ.. రాజధాని అమరావతికి చట్టబద్ధత, పునర్విభజన చట్ట సవరణకు తీర్మానం



**అమరావతి :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం సమావేశమైన ఆంధ్ర పదేశ్ మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి కి చట్టబద్ధత కల్పిస్తూ.. ఏపీ మంత్రివర్గం చారిత్రత్మకమైన తీర్మానం చేసింది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014లోని సెక్షన్–5ని సవరించాలని కేబినెట్ తీర్మానించింది. ఇక కొత్త రాజధాని స్థానంలో అమరావతి పేరును చేర్చాలని చంద్రబాబు సర్కార్ భావిస్తోంది. సీఆర్డీఏ పరిధిలోని అమరావతి పేరును కొత్త రాజధానిగా చేర్చాలని ప్రతిపాదనలు చేసింది. దీనికి సంబంధించి తాజాగా నిర్వహించిన కేబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు.ఈనెల 28వ తేదీన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో 4 గంటల పాటు రాజధాని అమరావతిపై చర్చను నిర్వహించి. తీర్మానించాలని నిర్ణయం తీసుకుం ది. ఆ తర్వాత ఆ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వాని కి పంపించనున్నారు. ఈ క్రమంలోనే ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న వేళ.. ఈ సమావేశాల్లోనే రాజధాని అమరావతిగా ఆమోదం కల్పించే అవకాశాలు ఉన్నాయి. ఈ సందర్భంగా రాజధాని అమరావతి చరిత్రను.. రాష్ట్ర ప్రజలకు తెలియజేయాలని మంత్రులను సీఎం చంద్రబాబు ఆదేశించారు.అదే సమయంలో గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నీరుకొండ గ్రామంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ.. 60 మీటర్ల ఎత్తు వరకు అకడమిక్ భవనాల నిర్మాణం చేసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం అనుమతులు కల్పించింది. ఈ క్రమంలోనే ఏపీ కేబినెట్ మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 96 జూనియర్, సీనియర్ సివిల్ జడ్జిల కోర్టులను ఏర్పాటు చేసేందుకు ఆమోదం ఇచ్చింది. ప్రాధాన్య క్రమంలో వడ్డెర సంఘాలకు ఖనిజాల లీజుల కేటాయింపులకు ఆమోదం కల్పించారు. ఖనిజాలకు సంబంధించిన లీజుల కేటాయింపులో ప్రీమియం, సీనరేజ్ ఫీజుల్లో 50 శాతం రాయితీ కల్పించే నిర్ణయానికిగ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.చిత్తూరు జిల్లా కుప్పం బాలికల పాఠశాలలో పీఈటీ, నర్సు, రికార్డు అసిస్టెంట్ వంటి పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి.. ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీని మాఫీ చేయాలని నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖలో వివిధ ప్రాజెక్టుల ఆధునికీకరణ.. మరమ్మతులకు ఏపీ కేబినెట్ పరిపాలన అనుమతులను మంజూరు చేసింది. రాష్ట్రంలో పలు సంస్థలకు భూమి కేటాయింపులకు సంబంధించి.. రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది.ఆంధ్రప్రదేశ్ విద్యుత్ వ్యవస్థపై కేబినెట్ భేటీలో సీఎం చంద్రబాబు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు.ఎప్పటికప్పుడు సంస్కరణలను తీసుకొచ్చి విద్యుత్ శాఖ ముందుకెళ్లాలని సూచించారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం.. ఆచూకీ కోసం పోలీసుల గాలింపు



**బాలానగర్ మార్చి 27 ( పీపుల్స్ న్యూస్)** :సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. గురువారం నర్సాపూర్ చౌరస్తా సమీపంలోని మస్జీద్ రోడ్డులో డివైడర్ వద్ద ఒక గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారంతో వెంటనే స్పందించిన బాలానగర్ సీఐ నర్సింహా రాజు తన సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పోలీసుల ప్రాథమిక విచారణలో, మృతుడి వయస్సు సుమారు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉంటుందని అంచనా వేశారు. అతను తెలుపు రంగు బనియన్ ధరించి ఉన్నట్లు గుర్తించారు. ఘటన స్థలంలో పంచనామా నిర్వహించిన అనంతరం, మృతదేహాన్ని గాంధీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, మృతుడి గుర్తింపునకు సంబంధించి తీవ్రంగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతుడిని ఎవరైనా గుర్తించినట్లయితే వెంటనే కింది నంబర్లను సంప్రదించాలని సీఐ నర్సింహా రాజు ప్రజలను కోరారు.

# దౌత్యంలో మోదీ ప్రభుత్వం ఘోర వైఫల్యం : పశ్చిమాసియా యుద్ధంలో పాక్ మధ్యవర్తిత్వంపై కాంగ్రెస్ ఫైర్



న్యూఢిల్లీ: పశ్చిమాసియా యుద్ధంలో మధ్యవర్తిగా పాక స్థాన్ వ్యవహరిస్తోందనే అంశం ప్రాంతీయ దౌత్యంలో మోదీ ప్రభుత్వ వైఫల్యాన్ని సూచి స్తుందని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శించారు. ఈవిషయంలో భారత్ తత్తర పాటును కనిపించకుండా కవర్ చేసే ప్రయ త్నాన్ని విదేశాంగ మంత్రి జైశంకర్ చేస్తున్నారని ఆరోపించారు. ఈమేరకు ఆయన ఒక ట్వీట్ చేశారు. సీమాంతర ఉగ్రవాదం, అణ్వస్త్ర విస్తరణ, సామాన్య ప్రజలపై దాడులు చేసిన దుష్ట చరిత్ర కలిగిన పాక్ లాంటి దేశాన్ని మధ్య వర్తిత్వ పాత్రకు పరిశీలించడం అత్యంత దారు ణమని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. పాక్ లాంటి దేశానికి మధ్యవర్తిత్వ అవకాశమా ?"పశ్చిమాసియా యుద్ధాన్ని ముగించే చర్చలకు మధ్యవర్తిగా పాకిస్థాన్‌ను పరిగణించడం నిజంగా దారుణం. అది నాలుగు దశాబ్దాల కుపైగా భారతదేశంలో, ఇతర దేశాలలో ఉగ్రవాదాన్ని నడిపించిన దేశం. ఒసామా బిన్ లాడెన్ లాంటి భయంకరమైన ఉగ్రవాదులకు పాక్ ఆశ్రయం ఇచ్చింది. ఇతర దేశాలకు అణ్వస్త్ర టెక్నాలజీని అందించడానికి పాక్‌లోని ఏక్యూ ఖాన్ నెట్‌వర్క్ ప్రయత్నాలు చేసింది. దీని గురించి స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి. పాక్ మాజీ అధ్యక్షుడు ముషారఫ్ ఈవిషయాన్ని బహిరంగంగానే అంగీకరించారు. ఈవిధంగా అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక చట్టాలను పాక్ ఘోరంగా ఉల్లంఘి ంచింది. అఫ్గానిస్థాన్‌లోని ఆస్పత్రులు, పౌర సౌకర్యాలపై పాక్ బాంబు దాడులు చేసింది. బెలూచిస్తాన్, ఖైబర్ పఖ్తూన్‌ఖ్వాలో సొంత పౌరులపైనే పాక్ ఎటాక్స్ చేసింది. వివిధ ప్రావిన్సులలో మతపరమైన మైనారిటీలపై దాడులు చేసింది. అలాంటి పాక్‌కు దౌత్యపరమైన వ్యవహారాల్లో స్థానం ఉండకూడదు" అని ట్వీట్‌లో కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ రాసుకొచ్చారు. మోదీ దౌత్యంలో ఆర్భాటమే తప్ప, ప్రభావం లేదు"పశ్చిమాసియా యుద్ధంలో మధ్యవర్తిత్వ పాత్ర కోసం పాక్‌ను పరిగణనలోకి తీసుకోవడం అనేది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దౌత్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతు ంది. మోదీ కౌగిలింతల దౌత్యం(హగ్లోమసీ) ఆర్భాటంగా ఉందే తప్ప, ప్రభావవంతంగా లేదు. భారత ప్రధాని సాహసోపేతంగా స్వేచ్ఛాయుత నిర్ణయాలను తీసుకోలేకపోతున్నారనే ఆరోపణ ఉంది. తనను తాను విశ్వగురువుగా చెప్పుకునే ప్రధాని మోదీ వైఫల్యం వల్లే చీలిపోయిన పాక్ లాంటి దేశానికి బ్రోకర్‌గా మారే అవకాశం దక్కింది. 26/11 అనంతర కాలంలో మన్మోహన్ సింగ్ హయా ంలో పాక్ అంతర్జాతీయంగా ఏకాకిగా ఉండేది. అయితే 2025 ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్ర దాడి జరగడానికి ముందు పాక్ సైన్యాధిపతి ఆసిమ్ మునీర్ రెచ్చగొట్టే వ్యాఖ్యలను చేసినా, పాక్‌ను భారతదేశం ఏకాకి చేయలేకపోయింది. దీనివల్లే ఆనాడు ఆసిమ్ మునీర్ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఆపరేషన్ సిందూర్ ముగిసిన (2025 మే 10) తర్వాతే అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ఇష్టమైన వ్యక్తిగా ఆసిమ్ మునీర్ మారారు" అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. భారత్ సమతూకం ైన విదేశాంగ విధానంరక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన బుధవారం అఖిలపక్ష సమావేశం జరిగిన నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఈ విమర్శలు చేశారు. పశ్చిమాసియా సైనిక ఉద్రిక్తతల విషయంలో భారత్ సమతూకమైన విదేశాంగ విధానంతోనే ముందుకు సాగుతుందని ఆ సమావేశంలో ప్రతిపక్ష నేతలకు కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ సమావేశంలో విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, విదేశాంగ మంత్రి జైశంకర్, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి మాట్లాడుతూ ఇంధన భద్రత, నౌకాయానం, విదేశాల్లో ఉన్న భారత పౌరుల భద్రతపై వివరించారు. పశ్చిమాసియా ప్రాంతంలోని అన్ని పక్షాలతో భారత్ దౌత్య సంబంధాలను కొనసాగిస్తోందని, సప్లై చైన్‌లను తెరిచి ఉంచుతోందని చెప్పారు. ఈ సమావేశంలో కాంగ్రెస్‌కు చెందిన ముకుల్ వాస్నిక్, తారిఖ్ అన్వర్, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ధర్మేంద్ర యాదవ్, జావేద్ అలీ, సీపీఐ(ఎం)కు చెందిన జాన్ బ్రిట్టాస్, డీఎంకేకు చెందిన పి. విల్సన్, ఆప్‌కు చెందిన సంజయ్ సింగ్ సహా పలువురు ప్రతిపక్ష నాయకులు హాజరయ్యారు. అయితే, తృణమూల్ కాంగ్రెస్ నాయకులు పాల్గొనలేదు.

## మర్కాపురం బస్సు ప్రమాదం.. ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రధాని మోదీ





న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మర్కాపురం జిల్లాలోని రాయవరం వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై ప్రధాని నరేంద్రమోదీ స్పందించారు. రోడ్డు ప్రమా దంలో 13 మంది మృతిచెందిన ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. ఇది చాలా విషాదకరమైన ఘటన అని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారికి రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారికి రూ.50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.ఏపీలోని మార్కాపురం జిల్లాలో గురువారం తెల్లవారుజా మున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి పామూరు వెళ్తున్న తెలంగాణకు చెందిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు రాయవరం సమీపంలో పలకల క్వారీల వద్ద కంకర లోడ్‌తో వెళ్తున్న టిప్పర్‌ను ఢీకొట్టింది. దాంతో బస్సులో ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న 13 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో 25 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం వారంతా ఆస్పత్రిలో చికిత్స బస్సులో ఉన్న 13 మంది అక్కడికక్కడే పొందుతున్నారు.ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 41 మంది ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. గాయపడిన వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం గుంటూరుకు తరలించినట్లు వెల్లడించారు. ప్రమాదం సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది మూడు ఫైరింజన్‌ల సాయంతో ఘటనా ప్రాంతానికి చేరుకుని మంటలను ఆర్పేశారు.

## సొంత సంస్థ 'ఐఆర్‌సీటీసీ'కు.. రూ.10 లక్షల జరిమానా విధించిన రైల్వే



న్యూఢిల్లీ: వందే భారత్ రైలు ప్రయాణికుడి ఆహార ఫిర్యాదుపై రైల్వే స్పందించింది. సొంత సంస్థ అయిన ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ)కు రూ. 10 లక్షల జరిమానా విధించింది. క్యాటరింగ్ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు పలు చర్యలు చేపట్టింది. మార్చి 15న పాట్నా–టాటానగర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణికుడు ఫిర్యాదు చేశాడు. దీనిపై రైల్వే సీరియస్‌గా స్పందించింది. సొంత సంస్థ ఐఆర్‌సీటీసీకి రూ.10 లక్షల జరిమానా విధించింది. అలాగే సంబంధిత సర్వీస్ ప్రొవైడర్‌కు రూ.50 లక్షల జరిమానా విధించడంతో పాటు కాంట్రాక్టును రద్దు చేయాలని ఆదేశించింది. ప్రయాణికుల భద్రత, ఆహార నాణ్యత తమ ప్రధాన ప్రాధాన్యతలు అని రైల్వే అధికారి తెలిపారు.కాగా, రైళ్లలో ఏటా సుమారు 58 కోట్ల భోజనాలను రైల్వే అందిస్తున్నది. అయితే ఆహార నాణ్యత, అధిక ఛార్జీలకు సంబంధించిన ఫిర్యాదులు సగటున 0.0008 శాతం మాత్రమే ఉన్నాయని రైల్వే మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ ఫిర్యాదులపై విచారణ తర్వాత గత మూడేళ్లలో రూ.2.6 కోట్ల మేర జరిమానాలు విధించినట్లు పేర్కొంది.మరోవైపు రైలు ప్రయాణికులపై పాంట్రీ కార్ సిబ్బంది దాడి చేసినట్లుగా 2025లో 3 సంఘటనలు నమోదైనట్లు రైల్వే తెలిపింది. ప్రభుత్వ రైల్వే పోలీసులు ఆ పాంట్రీ సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది.

## '16ఏళ్లుగా కరెంట్, నీరు, మరుగుదొడ్లు లేవు'- ఎన్నికలను బహిష్కరించిన 50 కుటుంబాలు

చెన్నై : తమిళనాడులో ఎన్నికల హడావుడి మొదలైంది. మరో 10 రోజుల్లో నామినేషన్ ప్రక్రియ కూడా మొదలుకానుంది. ఇప్పటికే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను రాజకీయ పార్టీలు విడు దల చేశాయి. ఈ ఎన్నికల్లో ఎలాగైన గెలవాలని పార్టీలు తమ వ్యూహాలను రచిస్తున్నాయి. ఓటర్లను ఆకట్టుకునేందుకు పలు రకాల హామీలు ప్రకటిస్తున్నాయి. అయితే తిరుచిరా పల్లిలోని ఓ 50 కుటుంబాలు మాత్రం అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించాలని నిర్ణయించుకున్నా యి. పోలింగ్ తేదీ దగ్గర పడుతున్న సమయ ంలో ఆ కుటుంబలు అసలేందుకు ఈ నిర్ణయం తీసుకున్నాయి? అందుకు గల కారణం ఏంటో ఈ కథనంలో తెలుసుకుందాం.తిరుచిరాపల్లిలోని నందవనం గ్రామానికి చెందిన 50కు పైగా కుటుంబాలు కలిసి ఈ కీలక నిర్ణయం తీసుకున్నాయి. గత 16 ఏళ్లుగా విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్డు వంటి ప్రాథమిక సదుపాయలు లేకుండా జీవిస్తున్నారని, అందుకే రానున్న అసెంబ్లీ ఎన్నికలకు బహిష్కరించాలని ప్రకటించాయి. జాతీయ రహదారిని విస్తరించే సమయంలో తమ ఇళ్లను ఖాళీ చేయించి



నందవనం గ్రామానికి తరలించారని, కానీ ఇక్కడ సదుపాయాలు ఏం లేవని వాపోతున్నారు. తమకు ఇంత వరకు విద్యుత్, నీరు, వ్యవసాయానికి మద్దతు వంటి ప్రాథమిక అవసరాలు కల్పించలేదని నందవవం గ్రామనికి చెందిన స్థానికుడు తంగరాజ్? తెలిపాడు.హైవే విస్తరణ తర్వాత పునరావాసం– కానీ సదుపాయాలే లేవు'నందవనం ప్రాంతంలో గత 16 ఏళ్లుగా ప్రజలు విద్యుత్ లేకుండా జీవిస్తున్నారు. మేం ముందుగా జాతీయ రహదారి పక్కన ఉండేవాళ్లం. హైవే విస్తరణ సమయంలో అప్పటి ప్రభుత్వం మమ్మల్ని ఇక్కడికి మార్చింది. అప్పటి నుంచి మమ్మల్ని పూర్తిగా మర్చిపోయారు. ఇప్పటి వరకు నలురుగు ముఖ్యమంత్రులు మారారు. కానీ మానవ మనుగడకు అవసరవైన కరెంట్, త్రాగునీరు, మరుగుదొడ్లు, వ్యవసాయానికి మద్దతు వంటి అంశాల్లో ఎవరూ సహాయం చేయలేదు' అని తంగ్?రాజ్ పేర్కొన్నాడు.పిటిషన్లు పెట్టినా స్పందన లేదుతమ సమస్యలపై అనేకసార్లు తమిళనాడు ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని తంగరాజ్ ఆరోపించారు. దీంతో ప్రాథమిక సదుపాయాలు కల్పించే వరకు ఎన్నికలను బహిష్కరించాలని గ్రామస్తులు నిర్ణయించుకున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో పాముల బెడదమరో స్థానికురాలు సరోజా కూడా ఇదే ఆవేదనను వ్యక్తం చేసింది. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు హామీలు ఇస్తున్నప్పటికీ, వాటిని అమలు చేయడంలో విఫలమవుతున్నాయని తెలిపింది. 'గత 16 ఏళ్లుగా మేం కరెంట్, మరుగుదొడ్డు లేకుండా గుడిసెల్లో జీవిస్తున్నాం. ప్రతి ఎన్నికల సమయంలో అన్ని పార్టీలు హామీలు ఇస్తాయి. కానీ ఇప్పటివరకు ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. విద్యుత్ లేకపోవడం వల్ల ముఖ్యంగా వర్షాకాలంలో పాములు వంటి ప్రమాదకర జీవులు ఇళ్లలోకి వస్తుంటాయి. సరైన వెలుతురు లేకపోవడం వల్ల మా ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయి. ఇప్పటికీ ఎవరూ కనీస సదుపాయాలు కూడా కల్పించలేదు. అందుకే ఈసారి ఎన్నికలను బహిష్కరించాలని నిర్ణయించుకున్నాం' అని సరోజా వెల్లడించింది.

## 'పాకిస్థాన్‌లాగా భారత్ బ్రోకర్ కంట్రీ కాదు'



న్యూఢిల్లీ: : అమెరికా–ఇరాన్ కాల్పుల విరమణ చర్చలకు మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్ధమన్న పాకిస్థాన్‌పై భారత విదేశాంగమంత్రి ఎస్. జైశంకర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్‌ను ఒక దళారీ దేశంగా అభివర్ణించారు. అఖిలపక్ష సమావేశం అనంతరం మాట్లాడిన ఆయన పాక్ మాదిరి దళారీ దేశంగా భారత్ ప్రవర్తించదని స్పష్టంచేశారు. పాక్ చేస్తున్న ప్రయత్నాల్లో కొత్తేమీ లేదని అభిప్రాయపడ్డారు. 1981 నుంచి పాకిస్థాన్‌ను అమెరికా ఉపయోగించు కుంటుంద న్నారు. భారత్ తన సొంత ప్రయోజనాలను కాపాడుకుంటూనే చర్చలు, దౌత్యం ద్వారా సమస్యల పరిష్కారానికి మొగ్గ చూపుతుందని, ఎవరికో మధ్యవర్తిగా పనిచేయ డం తమ విధానం కాదని జైశంకర్ పేర్కొన్నా రు.మధ్యవర్తిత్వానికి మేము సిద్ధమే!అంతకు ముందు, అమెరికా, ఇరాన్ మధ్య అర్థవంత మైన, నిర్వహించేందుకు తాము సిద్ధమని పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ప్రకటించారు. పశ్చిమాసియా యుద్ధాన్ని ఆపే ఈ సంప్రదింపులను నిర్వహించే అవకాశం లభిస్తే, దాన్నొక గౌరవంగా భావిస్తామని ఆయన వెల్లడించారు. అమెరికా, ఇరాన్‌ల వైపు నుంచి ఉమ్మడి అంగీకారం లభిస్తే చర్చలకు మధ్యవర్తిగా వ్యవహరించేందుకు పాక్ సిద్ధంగా ఉంటుందన్నారు. ఈ యుద్ధాన్ని ఆపేందుకు, పశ్చిమాసియాలో శాంతి, సుస్థిరతల పరిరక్షణకు ప్రస్తుతం జరుగుతున్న అన్ని ప్రయత్నాలను పాకిస్థాన్ స్వాగతిస్తుందని షెహబాజ్ షరీఫ్ పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం ఆయన ఒక ట్వీట్ చేశారు.మధ్యవర్తులుగా పాక్, తుర్కియే, ఈజిప్ట్‌రహస్యంగా జరుగుతున్న అమెరికా, ఇరాన్ శాంతి చర్చలకు పాకిస్థాన్, తుర్కియే, ఈజిప్ట్ మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నాయి అంటూ ఇటీవలే మీడియాలో కథనాలు వచ్చాయి. ఇప్పుడు పాక్ ప్రధాని చేసిన ప్రకటన, ఆ కథనాలకు బలం చేకూర్చేలా ఉందని అంతర్జాతీయ వ్యవహారాల పరిశీలకులు అంటున్నారు.శాంతి చర్చలకు వేదికగా పాకిస్థాన్అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చలకు వేదికగా పాకిస్థాన్‌ను ఎంపిక చేస్తారంటూ పలు అంతర్జాతీయ మీడియా సంస్థలు కథనాలను ప్రచురించాయి. అయితే ఈ ఊహాగానాలను నమ్మొద్దని, అధికారిక ప్రకటనలు వెలువడే వరకు వేచి చూడాలని మీడియాకు పాకిస్థాన్ విదేశాంగ శాఖ సూచించింది. దౌత్యం, చర్చల ద్వారానే పశ్చిమాసియా సైనిక ఘర్షణను ఆపగలుగుతామని పేర్కొంది.ఇదిలా ఉండగా, అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం విషయంలో ప్రభుత్వం మౌనంగా ఉందని విపక్షాలు చేస్తున్న ఆరోపణలపై స్పందించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇరాన్ సుప్రీం లీడర్ హత్య, యుద్ధం గురించి వస్తున్న వార్తలపై ప్రభుత్వం ఎప్పటికప్పుడు స్పందిస్తోందని తెలిపారు. గల్ఫ్ ప్రాంతంలోని భారతీయుల భద్రతకు, దేశీయ ఇంధన అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యమిస్తోందని పేర్కొన్నాయి. ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ఇప్పటికే నాలుగు ఇంధన నౌకలు హార్మూజ్ జలసంధిని దాటాయని తెలిపాయి. మరో ఐదు త్వరలో దాటనున్నాయని చెప్పాయి. ఇంకో 18 నౌకలు అక్కడికి సమీపంలో నిలిచి ఉన్నాయని కేంద్రమంత్రులు వివరించినట్లు వెల్లడించాయి. శ్రీలంక జలాల్లో ఇరాన్ నౌకపై అమెరికా దాడి చేయడం గురించి కేంద్రమంత్రులు ప్రస్తావించారు.. ఆ నౌక మన జలాల్లో ఉంటే కాపాడేవాళ్లమని పేర్కొన్నారు. ఇరాన్‌కు చెందిన ఇతర నౌకల్ని, సిబ్బందిని మనం కాపాడటంపై ఆ దేశం కృతజ్ఞతతో ఉందని తెలిపారు. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్‌లకు మనం మంచి స్నేహితులుగా ఉన్నామని చెప్పారు.

## రాహుల్ గాంధీకి ప్రాంతీయ నాయకుడికి ఉన్నంత అవగాహన కూడా లేదు:




కేరళ : కేరళలో అసెంబ్లీ ఎన్నికల సమయం దగ్గరపడుతోంది. ఈ క్రమంలో అధికార విపక్షాల మధ్య మాటల యుద్ధం ముదురుతోంది. తాజాగా కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాహుల్ గాంధీ జాతీయ నాయకుడు అయిన ప్పటికీ, లోకల్ లీడర్‌కు ఉన్నంత అవగాహన కూడా లేదని విమర్శలు గుప్పించారు. గత అనుభవాల నుంచి నేర్చుకోవడానికి ఆయన సిద్ధంగా లేరని ఎద్దేవా చేశారు. అంతేకాదు, రాహుల్ ఆయన పార్టీ బీజేపీకి బీ టీమ్‌గా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కోతమంగళంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ మేరకు వ్యాఖ్యానించారు."వాస్తవం ఏమిటంటే, రాహుల్? గాంధీ ఓ జాతీయ నాయకుడు. అయినప్పటికీ ప్రాంతీయ నాయకుడికి ఉన్నంత అవగాహన కూడా ఆయనకు లేదు. అంతేకాదు, ఆయన ఏ విషయాన్ని ఆయన లోతుగా తెలుసుకునే ప్రయత్నం చేయరు. ఇలాంటి లక్షణాలు రాజకీయ నాయకుడికి తగవు. కాంగ్రెస్ వంటి పెద్ద పార్టీకి చెందిన ముఖ్య నాయకుడిలో ఇలాంటి దిగజారుడు కనిపించడం ఆశ్చర్యకరం"ఇటీవల కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, దేశవ్యాప్తంగా ప్రతిపక్ష నేతలపై కేసులు నమోదు చేస్తూ కేంద్ర సంస్థలు ఒత్తిడి తెస్తున్నాయని ఆరోపించారు. అయితే, కేరళలో ఉన్న అవినీతి కేసుల్లో పినరయి విజయన్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, ఎల్‌డీఎఫ్, బీజేపీ మధ్య కుమ్మక్కు ఉన్నదనే అనుమానాలకు దారితీస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, రాహుల్? గాంధీ వ్యాఖ్యలకు పినరయి విజయన్? గట్టి కౌంటర్? ఇచ్చారు.

## ఎయిర్ ఇండియా లండన్ విమానం



న్యూఢిల్లీ: లండన్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం మార్గమధ్యలో యూటర్న్ తీసుకున్నది. సాంకేతిక లోపం కారణంగా సౌదీ గగనతలంలో వెనక్కి మళ్లింది. ఏడు గంటలు ప్రయాణించిన ఆ విమానం తిరిగి ఢిల్లీకి చేరుకున్నది. యిర్ ఇండియాకు చెందిన ఏ350 విమానం (ఏఐ 111) లండన్‌లోని హీత్రూ విమానాశ్రయానికి వెళ్లేందుకు గురువారం ఉదయం 6.13 గంటలకు ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ నుంచి టేకాఫ్ అయ్యింది. సుమారు మూడు గంటల పాటు 3,300 కిలోమీటర్లు గాలిలో ప్రయాణించింది.కాగా, ఇరాన్ యుద్ధం కారణంగా ప్రభావితమైన సౌదీ అరేబియా గగనతలంపై ఉన్న ఎయిర్ ప్రయాణించి లండన్ చేరుకోవాల్సి ఉన్నది. అయితే అనూహ్యంగా అది వెనక్కి మళ్లింది. గాలిలో యూ టర్న్ తీసుకున్నది. మరో మూడున్నర నుంచి నాలుగు గంటలపాటు వెనక్కి ప్రయాణించింది. మొత్తం ఏడు గంటల ప్రయాణం తర్వాత గురువారం మధ్యాహ్నం 1.20 గంటలకు ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో తిరిగి ల్యాండ్ అయింది.

## పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీకి కొరత లేదు- తప్పుడు ప్రచారం వల్లే బంకుల వద్ద క్యూలు



న్యూఢిల్లీ: :దేశంలో పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీకి ఎలాంటి కొరత లేదని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ స్పష్టంచేసింది. సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలను నమ్మి ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అత్యవసర కొనుగోళ్లకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేసింది. దేశవ్యాప్తంగా ఇంధన సరఫరా పూర్తిగా సాధారణంగానే కొనసాగుతోందని, అన్ని పెట్రోల్ బంకులు యథావిధిగా పనిచేస్తున్నాయని కేంద్రం తెలిపింది.అధికారిక సమాచారం మాత్రమే నమ్మాలి ఇటీవల పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో దేశంలో ఇంధన కొరత ఏర్పడుతుందన్న వార్తలు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం కావడంతో కొన్ని ప్రాంతాల్లో వాహనదారులు పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరుతున్నాయి. ఈ పరిస్థితిని గమనించిన కేంద్రం వెంటనే స్పందించి స్పష్టత ఇచ్చింది. ప్రజలు అపోహేసింది. దేశవ్యాప్తంగా ఇంధన సరఫరా హాలకు లోనవ్వకుండా అధికారిక సమాచారం మాత్రమే నమ్మాలని సూచించింది. ప్రస్తుతం దేశంలో 60 రోజులకు సరిపడా పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని కేంద్ర పెట్రోలియం శాఖ వెల్లడించింది. వ్యూహాత్మక నిల్వలను కలుపుకుంటే మొత్తం 74 రోజులకు సరిపడా చమురు నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపింది. అంతేకాకుండా దేశంలోని అన్ని రిఫైనరీలు 100 శాతం సామర్థ్యంతో పనిచేస్తున్నాయని, సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని పేర్కొంది. భారత్ ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద రిఫైనింగ్ సామర్థ్యం కలిగిన దేశంగా నిలిచిందని కేంద్రం గుర్తుచేసింది. అంతేకాకుండా ఐదో అతిపెద్ద పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతిదారుగా కూడా భారత్ స్థానం సంపాదించిందని తెలిపింది. దేశీయ అవసరాలను తీర్చడమే కాకుండా 150కి పైగా దేశాలకు శుద్ధి చేసిన ఇంధనాలను సరఫరా చేస్తున్నట్లు వెల్లడించింది.

# 10 రోజులు చక్కెర మానేస్తే మీ శరీరంలో జరిగే అద్భుతాలు తెలిస్తే ఆశ్చర్యపోతారు!



చక్కర ఎక్కువగా తీసుకుంటే ఆరోగ్యానికి ప్రమాదమేనని వైద్య నిపుణులు పదేపదే చెబుతుంటారు. అయితే మీరు ఒక్క పది రోజులు షుగర్ తీసుకోవడం మానేస్తే మీ శరీరంలో జరిగే అద్భుతాను చూసి మారే ఆశ్చర్యపోతారు. శరీరంలో జరిగే అద్భుతాలు ఏంటో తెలుసుకుందాం.చక్కెర అనేక వ్యాధులకు కారణమవుతుంది. శరీరానికి అవసరమైన దానికంటే ఎక్కువ చక్కెర తినడం వల్ల శరీరానికి నష్టం జరుగుతుంది. అందుకే చాలా మంది చక్కెరను వదులుకోవాలని సలహా ఇస్తారు. వరుసగా పది రోజులు చక్కెర తినకపోతే మీ శరీరంలో ఏం జరుగుతుందో చూద్దాం.చక్కెర అనేక వ్యాధులకు కారణమవుతుంది. శరీరానికి అవసరమైన దానికంటే ఎక్కువ చక్కెర తినడం వల్ల శరీరానికి నష్టం జరుగుతుంది. అందుకే చాలా మంది చక్కెరను వదులుకోవాలని సలహా ఇస్తారు. వరుసగా పది రోజులు చక్కెర తినకపోతే మీ శరీరంలో ఏం జరుగుతుందో చూద్దార.గా పది రోజులు మీ ఆహారం నుండి చక్కెరను తొలగిస్తే మీ శరీరంలో అనేక మార్పులను మీరు గమనించవచ్చు. చక్కెర తినడం వల్ల మెదడులో డోపమైన్ విడుదల అవుతుంది. చక్కెరను తగ్గించడం వల్ల మొదట్లో మీరు ఉత్సాహంగా అనిపించవచ్చు.మీరు వరుసగా పది రోజులు మీ ఆహారం నుండి చక్కెరను తొలగిస్తే మీ శరీరంలో అనేక మార్పులను మీరు గమనించవచ్చు. చక్కెర తినడం వల్ల మెదడులో డోపమైన్ విడుదల అవుతుంది. చక్కెరను తగ్గించడం వల్ల మొదట్లో మీరు ఉత్సాహంగా అనిపించవచ్చు. కానీ మీరు చక్కెర లేని ఆహారాన్ని తినడం అలవాటు చేసుకున్న తర్వాత, మీ శరీరంపై అనేక సానుకూల ప్రభావాలను చూడటం ప్రారంభిస్తారు. మీరు చక్కెరను వదులుకుంటే, మీరు మరింత తాజాగా ఉంటారు. మీ చర్మం ప్రకాశవంతంగా కనిపిస్తుంది.కానీ మీరు చక్కెర లేని ఆహారాన్ని తినడం అలవాటు చేసుకున్న తర్వాత, మీ శరీరంపై అనేక సానుకూల ప్రభావాలను చూడటం ప్రారంభిస్తారు. మీరు చక్కెరను వదులుకుంటే, మీరు మరింత తాజాగా ఉంటారు. మీ చర్మం ప్రకాశవంతంగా కనిపిస్తుంది చక్కెరను తగ్గించడం వల్ల ఉబ్బరం తగ్గుతుంది. రోజంతా ఉత్సాహంగా అనిపిస్తుంది. దీనితో పాటు ఒకటి నుండి రెండు కిలోల బరువు తగ్గుతుంది. చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి.చక్కెరను తగ్గించడం వల్ల ఉబ్బరం తగ్గుతుంది. రోజంతా ఉత్సాహంగా అనిపిస్తుంది. దీనితో పాటు ఒకటి నుండి రెండు కిలోల బరువు తగ్గుతుంది. చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. అందుకే చక్కెరను మానేయాలని వైద్య నిపుణులు పదేపదే సూచిస్తుంటారు. (నోట్– ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణులు తెలిపిన వివరాల ప్రకారం అందిస్తున్నాము. ఏవైనా సందేహాలు ఉంటే నిపుణులను సంప్రదించాలని సూచిస్తున్నాము. )అందుకే చక్కెరను మానేయాలని వైద్య నిపుణులు పదేపదే సూచిస్తుంటారు. (నోట్– ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణులు తెలిపిన వివరాల ప్రకారం అందిస్తున్నాము. ఏవైనా సందేహాలు ఉంటే నిపుణులను సంప్రదించాలని సూచిస్తున్నాము. )

# మొటిమలు, చుండ్రు సమస్యలకు "కలబంద మెడిసిన్"



కుదుళ్లకు తేమను అందించడమే కాదు.. ముఖంపై ఏర్పడిన మొటిమలు, మచ్చల్ని తగ్గించడంలోనూ కలబందను మించిన ఔషధం మరొకటి లేదంటున్నారు నిపుణులు. అందుకే, దీన్ని వివిధ రకాల హెయిర్ ప్రొడక్ట్స్, సౌందర్య ఉత్పత్తుల తయారీలో ఉపయోగిస్తుంటారని చెబుతున్నారు. ఈ క్రమంలో కలబందను చర్మం, జుట్టు ఆరోగ్యంగా ఉండటం కోసం ఎలా ఉపయోగించాలో ఇప్పుడు తెలుసుకుందాం !చర్మం, జుట్టు సమస్యలకు కలబంద ఒక వరం లాంటిది. ఇందులో ఎ,సి, ఈ విటమిన్లతోపాటు శరీరంలోని వివిధ ఎంజైమ్?ల పనితీరుకు అవసరమైన ఖనిజాలు కలబందలో ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి చర్మం, జుట్టు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయంటున్నారు. ఈ క్రమంలో వారానికి ఒకసారి కలబందను ఉపయోగించడం వల్ల కాంతివంతమైన చర్మంతోపాటు ఒత్తైన జుట్టు లభిస్తుందని పేర్కొంటున్నారు. అలాగే, జుట్టు పొడిబారడాన్ని తగ్గించడంతో పాటు ఆరోగ్యకరమైన, మెరిసే జుట్టును పొందవచ్చుట.నికి ఒకసారి కలబందను ఉపయోగించడం వల్ల కాంతివంతమైన చర్మంతోపాటు ఒ ఇది జుట్టుకు తేమను అందించడంతో పాటు చిక్కుబడకుండా చేస్తుందని సూచిస్తున్నారు.మండే ఎండల్లో చర్మ సంరక్షణ – ఈ జాగ్రత్తలు అవసరమంటున్న నిపుణులు!ఎలా ఉపయోగించాలి : కలబంద ఆకును తీసుకుని, దానిపై ఉన్న పచ్చటి పొరను తొలిగించాలంటున్నారు నిపుణులు. లోపల ఉండే గుజ్జును ముఖానికి మృదువుగా పట్టించి, 30 నిమిషాలపాటు అలాగే ఉంచుకోవాలంటున్నారు. ఆపై చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలట. ఇది మొటిమల మచ్చలను తగ్గించడమే కాకుండా, చర్మాన్ని కాంతివంతంగా, ముడుతలను తగ్గిస్తుందని పేర్కొంటున్నారు. ఎండ వల్ల దెబ్బతిన్న చర్మాన్ని శాంతపరచడానికి కూడా కలబంద జెల్ బాగా సహాయపడుతుందనిహెయిర్? మాస్క్?గా : పోషకగుణాలున్న కలబంద జెల్?ను ఆముదం లేదా కొబ్బరి నూనెతో కలిపి హెయిర్? మాస్క్?ల ఉపయోగించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ మిశ్రమాన్ని జుట్టుకు సమానంగా పట్టించి, సుమారు 45 నిమిషాల పాటు అలాగే ఉంచి, ఆపై గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలంటున్నారు. ఇలా క్రమం తప్పకుండా చేస్తే.. జుట్టుకు మంచి మెరుపును ఇవ్వడమే కాకుండా లోతుగా కండిషనింగ్ చేస్తుందని తెలియజేస్తున్నారు. అంతేకాదు, జుట్టు పెరుగుదలకు తోడ్పడుతుందని వివరిస్తున్నారు. అలోవెరా జుట్టు రాలడం, చుండ్రు, చికాకు లాంటి సమస్యలను తగ్గించి జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుందని

# శ్రీరామ నవమి స్పెషల్– సీతారాముల కల్యాణం వెనుకున్న రహస్యం ఇదే!



శ్రీ మహావిష్ణువు దశావతారాల్లో పరిపూర్ణ మానవావతారం శ్రీరాముడు. భగవంతుడైన రాముడు తానే స్వయంగా మనిషిగా జన్మించి సామాన్య మానవుని వలే ఎన్నో కష్టనష్టాలు భరించి, భార్య వియోగాన్ని పొంది తుదకు రావణాసుర సంహారం చేసి తన పరాక్రమాన్ని చాటుకున్నాడు. వేలాది సంవత్సరాలు ప్రజారంజకంగా పరిపాలించి తుదకు సరయు నదిలో జలప్రవేశం చేసి అవతార పరిసమాప్తి చెందాడు. చైత్ర శుద్ధ నవమి రోజు శ్రీరాముని జన్మదినమే కాదు, సీతారాముల కల్యాణం కూడా! ఈ సందర్భంగా సీతారాముల కల్యాణ వైభోగాన్ని గురించి ఈ కథనంలో తెలుసుకుందాం.

### అభిజిత్ లగ్నంలో జననం

శ్రీరాముడు చైత్ర శుద్ధ నవమి రోజు పునర్వసు నక్షత్ర యుక్త కర్కాటక లగ్నంలో సరిగ్గా మధ్యాహ్నం 12 గంటలకు జన్మించాడు. ఈ ముహూర్తాన్ని అభిజిత్ లగ్నం అంటారు. పురాణాల ప్రకారం శ్రీరాముడు త్రేతాయుగంలో జన్మించాడని తెలుస్తోంది. ఈ ముహూర్తాన్ని అనుసరించి జ్యోతిష్య శాస్త్ర పండితులు ఎన్నో పరిశోధనలు జరిపి శ్రీరాముడు క్రీస్తు పూర్వం 5114, జనవరి 10వ తేదీన జన్మించి ఉండవచ్చని అంచనా వేశారు. అప్పట్లో జనవరి నుంచి చైత్ర మాసం ప్రారంభమయ్యేది.

### దశరథ తనయుడు

దశరథుని ప్రియ పుత్రుడైన రాముడు విశ్వామిత్రుని యాగాన్ని రక్షించడానికి ఆయన వెంట వెళ్లి అతి చిన్న వయసులోనే రాక్షస సంహారం చేశాడు. అక్కడ నుంచి లేత యవ్వన ప్రాయంలో ఉన్న రామలక్ష్మణులను విశ్వామిత్రుడు మిథిలా నగరానికి తీసుకెళ్తాడు.

### సీతాస్వయంవరం

జనకుని ముద్దుల కుమార్తె సీతాదేవి. ఈమె అయోనిజ. భూమిలో నాగటి చాలుకు తగిలి జనకునికి దొరుకుతుంది. జనక మహారాజు ఇంట పెరుగుతుంది. జనక మహారాజు అంతఃపురంలో ఆయన పూర్వీకుల నుంచి వస్తున్న శివధనుస్సు ఉండేది. ఈ శివధనుస్సును సాక్షాత్తు శివుడే జనకుని పూర్వీకులకు అందించాడు. సీతాదేవి బాల్యంలో ఒకసారి బంతితో ఆడుకుంటూ ఉండగా ఆ బంతి శివధనస్సు కిందకు వెళ్తుంది. అమిత పరాక్రమవంతులు కనీసం జరపలేని శివధనుస్సును సీతాదేవి ఎడమచేతితో అవలీలగా పక్కకు జరిపి బంతిని తీసుకుంటుంది. ఈ అద్భుతాన్ని చూసిన జనక మహారాజు ఎవరైతే ఈ శివధనుస్సును విరుస్తారో వారికే సీతను ఇచ్చి వివాహం జరిపిస్తానని చాటింపు వేయిస్తాడు. ఆ ప్రకారంగా సీతా స్వయంవరానికి సుమూర్తం నిశ్చయిస్తారు.

### శివధనుర్భంగం

విశ్వామిత్రునికి ఈ విషయం తెలిసి రామలక్ష్మణులను వెంట బెట్టుకుని మిథిలా నగరానికి వెళ్తాడు. అక్కడ జరుగుతున్న స్వయంవరంలో ఎందరో రాజులు, పరాక్రమవంతులు, వీరులు శివధనుస్సును ఎక్కుపెట్టాడానికి ప్రయత్నించి విఫలమవుతారు. ఆ సమయంలో శ్రీరాముడు విశ్వామిత్రుని ఆదేశం మేరకు శివధనుర్భంగం చేసి సీతమ్మను వరించి ఆమె మనసులో ఆనందాన్ని నింపుతాడు. కల్యాణ ఘడియలు సమీపించినప్పుడు అన్నీ అలా కలిసి వస్తాయని పెద్దలు అంటారు కదా! అదే మన రామయ్య విషయంలో కూడా జరిగింది.

### వివాహానికి సుముహూర్తం

శివధనుర్భంగం జరిగాక జనకుడు పరమ సంతోషంతో విశ్వామిత్రునితో 'ఓ మహర్షీ! ఎంతో అసాధ్యమైన పనిని శ్రీరాముడు అవలీలగా చేశాడు. మీరు అనుమతి ఇస్తే సీతను శ్రీరాముని కిచ్చి వివాహం జరిపిస్తాను' అని పలుకుతాడు. అప్పుడు శ్రీరాముడు 'శివధనుస్సును అయితే విరిచాను కానీ వివాహానికి మా తండ్రి దశరథ మహారాజు గారి అనుమతి కావాలి అని అంటాడు' విశ్వామిత్రుడు కూడా శ్రీరాముడు చెప్పింది సబబే కాబట్టి అందుకు కావలసిన ఏర్పాట్లు చేయమని జనక మహారాజుకు చెప్తాడు.

### దశరథునికి శుభ వర్తమానం

జనకుని మంత్రులు వాయువేగంతో అయోధ్యకు పయనమై వెళ్లారు. దశరథ మహారాజును కలిసి శ్రీరాముడు చేసిన శివధనుర్భంగం గురించి వివరించి సీతారాముల కల్యాణానికి ఆహ్వానిస్తారు. అప్పుడు దశరథ మహారాజు ఎంతో సంతోషించిన పరివారంతో కలిసి మిథిలా నగరానికి బయల్దేరి వెళ్లారు.

### సీతాకల్యాణ వైభోగమే!

దశరథ మహారాజుకు జనక మహారాజు సకల లాంఛనాలతో స్వాగతం పలుకుతాడు. వివాహానికి ముందు జరగాల్సిన యజ్ఞయాగాది క్రతువులు పూర్తయ్యాక జనక మహారాజు సర్వాలంకార భూషితమైన సీతాదేవిని వివాహ వేదిక వద్దకు స్వయంగా తీసుకు వస్తాడు. సమంత్ర పూర్వకంగా జలాన్ని విడుస్తూ కన్యాదానం చేస్తాడు.

### దివి నుంచి పుష్ప వర్షం

శ్రీరాముడు సీతాదేవిని పాణిగ్రహణం చేసిన సమయంలో ఆకాశంలో దేవదుందుభులు మ్రోగుతాయి. పుష్ప వర్షం కురుస్తుంది. దశరథుడు ఇది చూసి ఎంతో సంతోషిస్తాడు. అపురూపమైన ఆ ఆనందకర సమయంలో దివి నుంచి పూల వర్షం కురుస్తుంది. గంధర్వులు గానం చేస్తారు.అప్సరసలు నాట్యం చేస్తారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు శ్రీరామనవమి రోజు సీతారాముల కల్యాణం అంగరంగ వైభోగంగా జరిపించడం సంప్రదాయంగా మారింది.

### ఊరంతా పండగే!

రాములోరి కల్యాణం అంటే ఊరంతా పండగే! శ్రీరామ భక్తులు ప్రతి ఆలయంలో, వీధుల్లో చలవ పందిళ్లు వేసి ఉత్సాహంగా సీతారాముల కల్యాణాన్ని ఘనంగా జరిపిస్తారు. శ్రీరాముడు స్వయంగా వెలసిన భద్రాచలంలో సీతారాముల కల్యాణ సంబరాలు అంబరాన్నంటుతాయి. ఇక రామజన్మభూమి అయోధ్యలో శ్రీరామనవమి వేడుకలు కోలాహలంగా సాగుతాయి. ఈ రోజు మనం కూడా మిథిలా నగరంలో సీతారాముల కల్యాణ వైభోగంలో పాలు పంచుకున్నట్లుగా భావించి తరిద్దాం. జైశ్రీరామ్!

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.

# ఆంజనేయుడు లేని ఏకైక రామాలయం- ఈ క్షేత్ర విశేషాలు మీకు తెలుసా?




ఉగాది నుంచి శ్రీరామనవమి వరకు వసంత నవరాత్రులుగా జరుపుకుంటాం. సాధారణంగా ఈ వసంత నవరాత్రుల్లో రామాలయాల్లో ప్రతిరోజు ఉత్సవాలు జరుగుతాయి. కొన్ని ఆలయాల్లో ఉగాదితో బ్రహ్మోత్సవాలు మొదలై శ్రీరామనవమి రోజు జరిగే సీతారాముల కల్యాణంతో ముగుస్తాయి. కానీ ప్రసిద్ధ శ్రీరామ క్షేత్రం ఒంటిమిట్టలో మాత్రం ఇందుకు భిన్నంగా జరుగుతుంది. ఇక్కడ శ్రీరామనవమి రోజు కల్యాణం జరగదు. అతి త్వరలో జరగనున్న బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఎప్పటి నుంచి ప్రారంభం కానున్నాయి? ఏ రోజు ఏ వాహన సేవ జరగనుంది? ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణం ఎప్పుడు జరుగుతుంది. తదితర విశేషాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

### ఆంజనేయుడు లేని రామాలయం

శ్రీరామనవమి వేడుకలకు అందరూ సిద్ధమవుతున్నారు. త్వరలో రానున్న శ్రీరామనవమికి రామాలయాలు ముస్తాబవుతున్నాయి. అయితే ప్రతి రామాలయంలో సీత రామలక్ష్మణులతో పాటుగా ఆంజనేయుడు కూడా కొలువై ఉంటాడు. కానీ ఆంజనేయుడు లేని ఏకైక రామాలయం ఒంటిమిట్ట! ఈ ఆలయంలో హనుమ లేకపోవడం వెనుక ఓ కథ ఉంది. శ్రీరాముడు ఆంజనేయ స్వామిని కలవక ముందే ఈ ప్రాంతంలో సీతాదేవి, లక్ష్మణునితో కలిసి సంచరించారని, అందుకే ఇక్కడ ఆంజనేయుని విగ్రహం ఉండదని స్థానికులు చెబుతారు.

ఏకశిలానగరం

త్రేతాయుగంలో సీతా లక్ష్మణ సమేతుడైన శ్రీరాముడు దండకారణ్యంలో సంచరిస్తూ ఈ ప్రాంతానికి వచ్చినట్లుగా ఆలయ స్థల పురాణం ద్వారా తెలుస్తోంది. ఆ సమయంలో సీతాదేవికి బాగా దప్పిక వేసిందని, సీతాదేవి దప్పిక తీర్చేందుకు శ్రీరాముడు భూమిలోనికి బాణం వేస్తే ఒక జలధార పైకి ఉబికిందని పురాణాల్లో వివరించి ఉంది. అదే ప్రస్తుత ఒంటిమిట్టలోని రామతీర్థంగా విరాజిల్లుతోందని తెలుస్తోంది. గర్భాలయంలో ఒకే శిలపై సీతారామ లక్ష్మణ దేవతామూర్తుల విగ్రహాలు ఉంటాయి. అందుకే ఒంటిమిట్టను ఏకశిలా నగరం అని కూడా పిలుస్తారు.

### చైత్ర శుద్ధ చతుర్దశి రోజు కల్యాణం

దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రామాలయాల్లో శ్రీరామ నవమి రోజు సీతారాముల కల్యాణం జరిగితే ఒంటిమిట్టలో మాత్రం శ్రీరామనవమి వెళ్లిన 4 రోజుల తర్వాత చైత్ర శుద్ధ చతుర్దశి రోజు సాయంత్రం సీతారాముల కల్యాణం జరుగుతుంది. దానికి ముందుగా చైత్ర శుద్ధ సప్తమితో బ్రహ్మోత్సవాలు మొదలై, చైత్ర బహుళ పాడ్యమితో ముగుస్తాయి. ఈ సందర్భంగా ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో ఏ రోజు ఏ వాహన సేవ జరుగనుందో తెలుసుకుందాం.

### కోదండ రాముని బ్రహ్మోత్సవ విశేషాలు

మార్చి 25, బుధవారం ఉదయం న్యాసాభిషేకం, సాయంత్రం జరిగే అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయి.

మార్చి 26, గురువారం ఉదయం ధ్వజారోహణం, రాత్రి శేషవాహన

### సేవ జరుగుతుంది. ఏకశిలానగరం

త్రేతాయుగంలో సీతా లక్ష్మణ సమేతుడైన శ్రీరాముడు దండకారణ్యంలో సంచరిస్తూ ఈ ప్రాంతానికి వచ్చినట్లుగా ఆలయ స్థల పురాణం ద్వారా తెలుస్తోంది. ఆ సమయంలో సీతాదేవికి బాగా దప్పిక వేసిందని, సీతాదేవి దప్పిక తీర్చేందుకు శ్రీరాముడు భూమిలోనికి బాణం వేస్తే ఒక జలధార పైకి ఉబికిందని పురాణాల్లో వివరించి ఉంది. అదే ప్రస్తుత ఒంటిమిట్టలోని రామతీర్థంగా విరాజిల్లుతోందని తెలుస్తోంది. గర్భాలయంలో ఒకే శిలపై సీతారామ లక్ష్మణ దేవతామూర్తుల విగ్రహాలు ఉంటాయి. అందుకే ఒంటిమిట్టను ఏకశిలా నగరం అని కూడా పిలుస్తారు.

మార్చి 27, శుక్రవారం ఉదయం వేణుగానాలంకారం, రాత్రి హంసవాహన సేవ జరుగుతాయి.

మార్చి 28, శనివారం ఉదయం వటపత్రశాయి అలంకారం, రాత్రి సింహవాహన సేవ జరుగుతాయి.

మార్చి 29, ఆదివారం ఉదయం నవనీత కృష్ణాలంకారం, రాత్రి హనుమంత వాహన సేవ జరుగుతాయి.

మార్చి 30, సోమవారం ఉదయం మోహిని అలంకారం, రాత్రి గరుడ వాహన సేవ జరుగుతాయి.

మార్చి 31, మంగళవారం ఉదయం శివధనుర్బాణాలంకారం, సాయంత్రం ఎదుర్కోలు, రాత్రి శ్రీ సీతారాముల కల్యాణోత్సవం, గజ వాహన సేవ జరుగుతాయి.

ఏప్రిల్ 1, బుధవారం ఉదయం రథోత్సవం జరుగుతుంది.

మార్చి 28, శనివారం ఉదయం వటపత్రశాయి అలంకారం, రాత్రి సింహవాహన సేవ జరుగుతాయి.

మార్చి 29, ఆదివారం ఉదయం నవనీత కృష్ణాలంకారం, రాత్రి హనుమంత వాహన సేవ జరుగుతాయి.

ఁవారం ఉదయం కాళీయమర్ధనాలంకారం, రాత్రి అశ్వ వాహనసేవ జరుగుతాయి.ఏప్రిల్ 3, శుక్రవారం ఉదయం చక్రస్నానం జరుగుతుంది. రాత్రి జరిగే ధ్వజావరోహణం కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.ఒంటిమిట్టలో జరగనున్న బ్రహ్మోత్సవాల్లో శ్రీ కోదండరాముని దర్శిస్తే సకల శుభాలు, అష్టైశ్వర్యాలు కలుగుతాయని విశ్వాసం.రానున్న బ్రహ్మోత్సవాలకు మనం కూడా ఒంటిమిట్టకు తరలి వెళ్దాం. శ్రీరామచంద్రుని అనుగ్రహంతో సకల శుభాలు పొందుదాం.

శుక్రవారం, మార్చి 27, 2026
హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# ట్రంప్ మూర్ఖానికి ప్రపంచదేశాలు మూల్యం !

అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు ఈ సంవత్సరపు అతిపెద్ద విలన్లుగా ప్రపంచంలో అవతరించారు. తమ యుద్ధ దాహానికి ప్రపంచాన్ని బలి తీసుకున్నారు. ఆయుధ సంపత్తి ఉందికదా అని ఇరాన్‌పై విచ్చలవిగిగా జరిపిన బాంబు దాడిలో ఇప్పటికే ఇరాన్ బాగా దెబ్బతింది. ఇరాన్ దాడుల్లో గల్ఫ్ దేశాలు కూడా దెబ్బిన్నాయి. ఈ క్రమంలో ఏం సాధించారో ట్రంప్ ప్రపంచానికి చెప్పాలి. గతంలో ఇరాక్‌లో ఇలాంటి దడి చేసి సద్దాం హెస్సేన్‌ను ఉరేశారు. ఇక్కడ ఖమేనీని చంపేశారు. వీరి యుద్ధాలు ప్రపంచానికి సంకటంగా మారాయి. ట్రంప్ తీరుతో ప్రపంచం కొరివితో తలగోక్కున్నట్లుగా తయారయ్యింది. ఇరాన్‌ను లొంగదీసుకుంటానని ప్రగల్భాలు పలికిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. క్రమంగా వెనక్కి జారుకున్నారు. చర్చలు జరుగుతు న్నాయని, ఐదు రోజులపాటు యుద్ధానికి విరామం ఇస్తున్నామని ప్రకటించారు. అయితే, ఇరాన్ మాత్రం.. యుద్ధం మొదలైనప్పటి నుంచీ ఇప్పటి వరకూ.. తమకూ అమెరికాకు మధ్య ఎటువంటి చర్చలు జరగలేదని, తాము చర్చలకు సిద్ధంగా లేమని స్పష్టం చేసింది. మీరు దాడులు మొదలు పెట్టి మీరే షరతులు పెడతారా అని నిలదీసింది. మేమూ షరతులు పెడతామని చెప్పింది. మొత్తమ్మీద, ట్రంప్ మాటలకు విశ్వసనీయత లేద ని, రోజుకో మాట మాట్లాడటమే ఆయన తీరని మరోసారి రుజువైంది. ఏదేమైనా.. ట్రంప్ వెనక్కి తగ్గటం మాత్రం కాదనలేని వాస్తవం. ట్రంప్ తీరుపై స్వదేశంలోనూ తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఇజ్రాయిల్ కోల్పోయిందేమీ లేదు క ఆనీ, అమెరికా భారీగా నష్టాన్ని మూటగట్టుకుంది. ఓ రకంగా చెప్పాలంటే యుద్ధంలో ఇరాన్ గెలిచిందనే చెప్పాలి. ఇరాన్ మీద కయ్యానికి కాలు దువ్వినప్పుడు అమెరికా–ఇజ్రాయెల్ లకు ఓ స్పష్టమైన లక్ష్యం లేదు. ఖమేనీ సారథ్యంలోని ప్రభుత్వాన్ని పడగొడతామని ఒకసారి, ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేయకుండా చూడటం అని మరోసారి, ఇరాన్ నుంచి అమెరికాకు ముప్పు పొంచి ఉందని, ఆ దేశాన్ని లొంగదీసుకుంటామని ఇంకోసారి.. ఇలా పూటకో మాట చెప్పారు ట్రంప్. మరోవైపు, తమ మీద రుద్దిన ఈ యుద్ధాన్ని ఎదుర్కొని తమ దేశ సమగ్రతను కాపాడుకునే ఏకైక, స్పష్టమైన లక్ష్యంతో ఇరాన్ యుద్ధంలోకి దిగింది. అంతులేని యుద్ధాలకు ముగింపు పలుకుతానని, అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా మారుస్తానంటూ రెండోసారి అధికారంలోకి వచ్చిన ట్రంప్.. అమెరికాకు ఏ విధంగానూ అవసరం లేని యుద్ధం చేస్తున్నారన్న భావన అమెరికన్లలో వ్యాపించింది. తాము కట్టిన పన్నుల్ని నెతన్యాహూ కోసం ఎందుకు ఖర్చు చేస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు, అమెరికాలో పెట్రోల్, డీజిల్ ధరలు ఇటీవలి కాలంలో ఎన్నడూ లేనంత పెరిగాయి. స్థిరచిత్తం లేని ట్రంప్ మాటలతో, చేతలతో అమెరికా అధ్యక్ష పదవి ఓ జోకులాగా తయారైంది. స్వయంగా ట్రంప్ మద్దతుదారులు కూడా ఈ యుద్ధాన్ని సమర్థించటం లేదు. సర్వేల్లో ట్రంప్ ప్రజాదరణ రోజురోజుకీ దిగజారుతోంది. మరోవైపు, ఈ ఏడాది చివర్లో అమెరికా ప్రతినిధుల సభకు ఎన్నికలు జరగనున్నాయి. అధికారపక్షమైన రిపబ్లికన్ పార్టీకి పరిస్థితులు ఏమాత్రం సానుకూలంగా లేవన్న సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే, తాజాగా వెనక్కి తగ్గారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వెనెజువెలాలో అధ్యక్షుడు మదురో అధికారిక నివాసంపై దాడి చేసి రాత్రికి రాత్రి కిడ్నాప్ చేసి అమెరికాకు తీసుకొచ్చిన ట్రంప్.. ఇరాన్ మీద కూడా అదే ఎ÷–లాన్ అమలు చేయాలని భావించారు. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ రాజధాని టెహ్రాన్‌లో సైనిక, పౌర ఉన్నతాధికారులతో సమావేశమైన తరుణంలో వారి మీద అమెరికా, ఇజ్రాయెల్ అకస్మాత్తుగా బాంబులు కురిపించాయి. వారిని హత్య చేసి యుద్ధం ప్రారంభించాయి. ఖమేనీ హత్య తర్వాత.. అప్పటి వరకూ ఉన్న అంతర్గత విభేదాలు, ప్రభుత్వం మీద ఉన్న అసమ్మతిని కూడా



పక్కనపెట్టి.. దేశ పరిరక్షణకు యావత్ ఇరాన్ ఒక్కటైంది. ఆ దేశంలోని ప్రతీ పట్టణంలో.. ఓవైపు క్షిపణులు, బాంబులు పడుతున్నా కూడా బెదరకుండా.. రోడ్ల మీదికి పెద్ద సంఖ్యలో వచ్చి ప్రభుత్వానికి మద్దతు ప్రకటిస్తూ ర్యాలీలు జరిపారు. ఇప్పటికీ ఇవి కొనసాగుతున్నాయి. ఇరాన్ బలాబలాలేమిటి అన్నది సమగ్రంగా సమీక్షించకుండానే ట్రంప్ ఈ యుద్ధంలోకి దిగారు. అమెరికా సైన్యాధికారులతో సంప్రదించలేదు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు నేతృత్వంలోని శక్తిమంతమైన యూదు లాబీ మాటలువిని ట్రంప్ యుద్ధం నిర్ణయం తీసుకున్నారని స్వయంగా అమెరికా ఉగ్రవాద నిరోధక విభాగం డైరెక్టర్ జో కెంట్ వెల్లడించి నిరసనగా పదవికి రాజీనామా చేశారు. గల్ఫ్ మొత్తానికి యుద్ధాన్ని విస్తరిస్తుందని ట్రంప్, నెతన్యాహు ఊహించి ఉండరు. ఇక హొర్ముజ్ జలసంధిని అడ్డుకోవటం ద్వారా ఇరాన్ తన వద్ద ఉన్న బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించింది. దీంతో యుద్ధం ప్రభావం యావత్ ప్రపంచం మీద పడింది. దీనికి ట్రంప్ దూకుడే కారణం. ప్రపంచం యావత్తూ గ్యాస్, ఇంధనాల కొరతతో అల్లుడుతోంది. ఆయా దేవాల ఆర్థిక స్థితి దారుణంగా పడిపోయింది. ఇప్పట్లో ఈ నష్టాల నుంచి కోలుకోవడం ఎవరికైనా కష్టమే.

## తెరుచుకున్న హోర్ముజ్ జలసంధి

**• సరుకు రావాణాకు ఇరాన్ అనుమతి**



**టెహ్రాన్,మార్చి26:** భారత్‌తో సహా మిత్ర దేశాలకు హోర్ముజ్ జలసంధిని తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. హోర్ముజ్ ద్వారా సరుకు రవాణా నౌకల రాకపోకలకు అనుమతి ఇచ్చినట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి ప్రకటించారు. భారత్, చైనా, రష్యా, ఇరాక్, పాకిస్తాన్‌లకు సరుకు రవాణాకు అనుమతి లభించింది. అబ్బాస్ అరఘ్చి స్పందన గురించి ముంబైలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ ఒక ప్రకటనలో తెలిపింది. హోర్ముజ్ జలసంధిని తెరవాలని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ అభ్యర్థించారు. దీని నేపథ్యంలోనే ఇరాన్ ఈ చర్య తీసుకున్నట్లు సమాచారం. మధ్యప్రాచ్యంలో యుద్ధాన్ని ముగించాలని గుటెర్రెస్ అమెరికా, ఇజ్రాయిల్‌లను కోరారు. 'హోర్ముజ్ జలసంధిని మూసివేయడం చమురు, గ్యాస్ రవాణాను స్తంభింపజేస్తోంది. ఈ ప్రాంతంలో, వెలుపల పౌరులు తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారు, అభద్రతతో జీవిస్తున్నారు. సంఘర్షణ పరిణామాలను తగ్గించడానికి పోరాటాన్ని ముగించడమే సరైన నిర్ణయం' అని గుటెర్రెస్ ఒక ప్రకటనలో రాశారు.

## అమెరికాను ఎదుర్కొనేలా ఇరాన్ ఎత్తులు

**• ఖర్గ్ ఐలాండ్‌లో మందుపాతరలు**

**టెహ్రాన్,మార్చి26:** ఇరాన్‌కు అత్యంత కీలకమైన ఖర్గ్ ఐలాండ్ ను స్వాధీనం చేసుకునే ఉద్దేశంతో పర్షియన్ గల్ఫ్‌లో అమెరికా తన బలగాలను మోహరిస్తోందని వార్తలు వస్తున్న ఈనేపథ్యంలో ఖర్గ్‌ను రక్షించుకునేందుకు ఇరాన్ సిద్ధమైంది. ఇందుకోసం అమెరికా దళాలను అక్కడ అడుగుపెట్టనీయకుండా ఇరాన్ భారీగా మందుపాతరలు అమర్చినట్లు సమాచారం. వాటితో విధ్వంసకర ఉచ్చులు పన్నుతోందని తెలుస్తోంది. అంతేకాకుండా అక్కడికి భారీగా బలగాలను కూడా తరలిస్తున్నట్లు అంతర్జాతీయ వార్తా కథనం వెల్లడించింది. హర్మూజ్ జలసంధిని తెరిపించేలా ఒత్తిడి తెచ్చేందుకు ఖర్గ్‌ను ఓ సాధనంగా వాడాలని ట్రంప్ యంత్రాంగం యోచిస్తోంది. పశ్చిమాసియా ప్రాంతంలోని ఓ దేశం సహకారంతో ద్వీపాలను ఆక్రమించు కోవాలని మా శత్రువులు సన్నాహాలు చేస్తున్నారన్న నిఘా సమాచారం ఉంది. శత్రువుల కదలికలను మేం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. శత్రువు ఒక్క అడుగు ముందుకువేసినా.. పశ్చిమాసియాలోని ఆ దేశంలోని కీలక మౌలిక సదుపాయాలే లక్ష్యంగా ఎడతెగని దాడులు చేస్తాం అని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఎంబీ ఘలిబాఫ్ ఇప్పటికే హెచ్చరికలు చేశారు. అమెరికా సైనికులు, కమాండర్ల ఆచూకీ చెప్పండంటూ పశ్చిమాసియా దేశాలకు ఇరాన్ (ఎసజీని) విజ్ఞప్తి చేసింది. అమెరికా స్థావరాలపై తాము దాడులు చేస్తుండటంతో అక్కడున్న యూఎస్ సైనికులు ఇతర ప్రాంతాల్లో ఆశ్రయం పొందుతున్నారని ఇరాన్ వెల్లడించింది. పశ్చిమాసియా దేశాల ప్రజలు వారి ఆచూకీని వెల్లడించాలని కోరుతున్నాం. అలాగే మీ భద్రత కోసం వారిని బహిష్కరించండని అడిగింది. తమ దాడుల్లో దెబ్బతిన్న అమెరికా స్థావరాలు నిర్జన ప్రాంతాలుగా మారాయని పేర్కొంది. 13 సైనిక స్థావరాలు దెబ్బతిన్నాయని వెల్లడించింది. భూతల దాడుల వార్తల నేపథ్యంలో అమెరికా, ఇజ్రాయెల్ సైన్యాన్ని ఇరాన్ హెచ్చరించింది. నెతన్యాహు, ట్రంప్ చేస్తోన్న మోసానికి మీ పిల్లలను బలిచేయకండంటూ హెచ్చరించింది.



## ఎర్రచందనం అక్రమ రవాణా కేసు


**• వైసిపి నేతకు జైలు శిక్ష విధించిన కోర్టు**

**చిత్తూరు,మార్చి26:** శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన వైసీపీ నాయకుడికి తిరుపతి ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. ఎర్రావారిపాలెం మండలం యనమలవారిప్లలెకు చెందిన ఉటుకూరి చెంగల్‌రెడ్డి, తిమ్మసముద్రానికి చెందిన వెంకట్‌రెడ్డి 2015వ సంవత్సరంలో శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడ్డారు. వీరిపై భాకరాపేట స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. చెంగల్‌రెడ్డిపై నేరం రుజువు కావడంతో తిరుపతి ఆర్ఎన్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి రెండేళ్ళ జైలు శిక్ష, రూ. 20 వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఇఃబిస2.తూణజరిమానా చెల్లించకపోతే మరో మూడు నెలలు జైలు శిక్ష అనుభవించాల్సివుంటుందన్నారు. ఈ కీలకమైన కేసు విచారణ, పర్యవేక్షణ, కోర్టు లైజనింగ్‌లో కృషి చేసిన డీఎస్పీ ప్రసాద్, స్పెషల్ ప్రాసిక్యూటర్ అమరనారాయణ, అప్పటి ఎస్ఐ నెట్టి కంఠయ్య, ప్రస్తుత సీఐ సత్యనారాయణ, ఎస్ఐ కృష్ణయ్య, కోర్టు లైజనింగ్ హెడ్ కానిస్టేబుల్ హరినాథ్, కోర్టు హెడ్ కానిస్టేబుల్ నరసింహులును ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు. శిక్ష పడిన చెంగల్‌రెడ్డి భార్య రె÷–డడెమ్మ ప్రస్తుతం ఎర్రావారిపాలెం ఇన్‌చార్జ్ ఎంపీపీగా వుండగా చెంగల్‌రెడ్డి గతంలో మండల వైసీపీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఈయనపై పలు ఎర్రచందనం అక్రమ కేసులు నమోదయ్యాయి.



## పంటపొలాల్లోనే ఏనుగుల తిష్ట

**- ఆందోళనలో రైతులు**



**చిత్తూరు,మార్చి26:** చంద్రగిరి మండలం, ఎగువ కూచివారిప్లలె పంట పొలాల్లో పగలు కూడా ఏనుగులు తిష్ట వేస్తున్నాయి. దీంతో రైతులు విలవిలలాడిపోతున్నారు. కొన్ని రోజులుగా ఏనుగుల మంద గ్రామంలోని పంట పొలాలపై పడి బీభత్సం సృష్టిస్తోంది. సాధారణంగా రాత్రి వేళల్లో వచ్చే ఏనుగులు, ఇప్పుడు ఏకంగా పట్టపగలే పొలాల్లో తిష్టవేస్తుండటంతో రైతులు ప్రాణభయంతో వణికిపోతున్నారు. బుధవారం ఎగువ కూచువారి పల్లె రైతుల పొలాల్లో ఏనుగులు మామిడి తోటలు, ఇతర పంటలను తొక్కి వేయడమే కాకుండా, చెట్ల కొమ్మలను విరిచివేసి భారీ నష్టాన్ని కలిగించాయి. సాగునీటి పైపులను, మోటార్లను సైతం ధ్వంసం చేస్తున్నాయి. అటవీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి ఏనుగులను అడవిలోకి మళ్లించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. పంట నష్టపోయిన తమకు ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

## సామ్రాజ్యవాద యుద్ధాల్లో సమిధలయ్యేది శ్రామికులే




సామ్రాజ్యవాద అమెరికా, ఇజ్రాయిల్ ఇరాన్‌పై చేస్తున్న యుద్ధంలో కాలి బూడిద అవుతున్నది యుద్ధ ట్యాంకులు, మిస్సైల్స్, డ్రోన్స్ మాత్రమే కాదు, మూడో ప్రపంచ దేశాల కార్మికుల -- కర్షకుల శ్రమశక్తి. దేశీయ ఇంధన అవసరాలను ఎనభై శాతం పైగా దిగుమతి పై ఆధారపడడంతో యుద్ధం వలన ప్రధానంగా ఎఫెక్ట్ అవుతున్న దేశాలలో మన దేశం ఒకటి అనేకంటే, మనదేశంలోని కార్మిక, కర్షక వర్గం ప్రధానమైనదని పేర్కొనడం సబబు. హర్మూజ్ జల సంధి మూసివేతతో గత ఇరవై ఐదు రోజులుగా ఇంధన దిగుమతులతోపాటు పశ్చిమాసియా దేశాలకు ఎగుమతయ్యే ఫార్మా ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ గూడ్స్ పైన ప్రభావం పడింది. వీటిలో పనిచేస్తున్న వేలాది కార్మికుల ఉపాధి దెబ్బతినే ప్రమాదం ఉంది. ఫార్మా ఉత్పత్తులకు హైదరాబాద్ ముఖ్యమైన కేంద్రం. యుద్ధం కారణంగా ఫార్మా ఉత్పత్తులకు అత్యంత కీలకమైన రా మెటీరియల్స్ ఎంజైమ్స్, సాల్వెంట్లు, కొరత ఏర్పడింది.ఫార్మా, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఎగుమతుల కంటైనర్‌పై వార్ సెస్ కింద అదనంగా రూ.రెండు లక్షలు వసూలు చేస్తున్నారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం తెలంగాణలోని ఉత్పాదక పరిశ్రమల కార్మికులపై ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా ఎల్.ఎన్.జి వంటి ముడి పదార్థాల కొరత ఏర్పడటంతో పరిశ్రమలు ఉత్పత్తిని తగ్గించుకోవలసి వస్తోంది. రసాయనాలు, ప్లాస్టిక్‌లు, ఆహార ప్రాసెసింగ్ వంటి పరిశ్రమలు ఉత్పత్తి మందగించాయి. సిరామిక్, ఉక్కు, వస్త్ర, ఫ్యాబ్రికేషన్ యూనిట్లను పెద్ద ఎత్తున మూసివేయడానికి కారణమవుతోంది. ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లుతోంది. ఇండస్ట్రియల్ గ్యాసెస్, కెమికల్స్ వంటి ముఖ్యమైన ముడి పదార్థాల కొరతకు దారితీసింది. ఇంధనాన్ని ఆదా చేసేందుకు రసాయన, ప్లాస్టిక్ తయారీ కర్మాగారాలు తమ ఉత్పత్తిని తగ్గిస్తున్నాయి. దీనివల్ల కార్మికులు ఉద్యోగాలు కోల్పోవడం లేదా పని గంటలు తగ్గడం వంటి పరిణామాలకు గుతవుతున్నారు. కొన్ని తయారీ యూనిట్లలోని పారిశ్రామిక క్యాంటీన్లు ఇప్పటికే మూతపడ్డాయి.

# ఖబర్దార్ సీఎం,పరిగి ఎమ్మెల్యే

**పోలీసుల కళ్ళపైన పడ్డ రైతులు.....**
**పరిగి నియోజకవర్గం , రాపోల్, కల్లాపూర్ గ్రామస్తులు**




**వికారాబాద్ జిల్లా మార్చి 27 పరిగి డివిజన్** :ఇండస్ట్రియల్ పార్క్ పేరిట పరిగి నియోజకవర్గం కాడ్లాపూర్, రాపోలు గ్రామాల్లో 1200 ఎకరాల భూమిని అన్యాయంగా దోచుకుంటున్న రాక్షస కాంగ్రెస్ సర్కార్.తమ పొలాలను ఇండస్ట్రియల్ పార్క్ కోసం లాక్కోవద్దంటూ పరిగి బస్టాండ్ ముందు రైతుల ఆందోళన. పంటలు పండే తమ భూములు లాక్కోవద్దంటూ పోలీసుల కాళ్ళ మీద పడి ప్రాధేయపడ్డ రైతులు.శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ప్రజలపై పోలీసుల దాడి. మహిళలని కూడా చూడకుండా విచక్షణారహితంగా రాక్షసంగా తోసేసిన పోలీసులు.తమ దందా కోసం రైతుల పొలాలను గుంజుకోవాలని చూసే రియల్ ఎస్టేట్ బ్రోకర్ రేవంత్ సర్కార్‌ను ఆ రైతులే తరిమికొట్టుడు ఖాయం! ఈ కార్యక్రమంలో భూమిని కోల్పోయిన రైతులు ప్రజాసంఘాల వాళ్ళు పాల్గొన్నారు..

# కోసినీ గ్రామంలోని పర్ధాన్ గుడాలలో ఉచిత కంటి పరీక్ష




**కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా** కోసినీ గ్రామంలోని పర్ధన్ గూడ లో JK SPM ఆధ్వర్యంలో ప్రజలకు ఉచిత కంటి పరీక్ష నిర్వహించారు. పేద ప్రజలకు ఉచితంగా కంటి పరీక్ష నిర్వహించడం ద్వారా మాకు ఎంతో ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కోసిని సర్పంచ్ వసాకే పుల్లబాయి, మాలి సంఘం కాగజ్ నగర్ మండల్ జనరల్ సెక్రెటరీ వసాకే హనుమంతు గారు, సిఎస్ఆర్ మేనేజర్ రేవతి గారు, డాక్టర్ బియ్యాల వెంకటేశ్వర్ గారు సుశీల గారు, శివకుమార్ గారు, తన్నీరు విజయ్ కుమార్,అంగన్వాడి టీచర్ చిన్నారి గారు వార్డ్ మెంబర్స్ రాజేష్ గారు రోజా గారు గ్రామ పెద్దలు మహిళలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పుల్లాబాయి గారు మాట్లాడుతూ కోసిని గ్రామంలో ఉచిత కంటి పరీక్ష నిర్వహించడం ద్వారా పేద ప్రజలకు చాలా ఉపయోగపడుతుంది అని అందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలి అని తెలిపారు. మా గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహించినందుకు జీఖ ఛ్రావీ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు

# కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ గ్లాసుల స్వాధీనం

**కాగజ్‌నగర్** మున్సిపాలిటీ పరిధిలోని మెయిన్ మార్కెట్ ప్రాంతంలో ఉన్న జ్యోతి ట్రాన్స్‌పోర్ట్ వద్ద ప్లాస్టిక్ గ్లాసుల నిల్వపై మున్సిపల్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిషేధిత ప్లాస్టిక్ గ్లాసులు పెద్ద మొత్తంలో గుర్తించి, వాటిని స్వాధీనం (Seizure) చేయడం జరిగింది.ఈ తనిఖీలు మున్సిపల్ కమిషనర్ శ్రీ బి. తిరుపతి గారి ఆదేశాల మేరకు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ ఎం. శంకర్ మరియు ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ డి. ప్రణీల్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది పాల్గొన్నారు.మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిరోధించేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు నిల్వ చేయడం, వినియోగించడం పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అలాగే వ్యాపారస్తులు పర్యావరణ హితమైన ప్రత్యామ్నాయాలను వినియోగించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధించబడతాయని స్పష్టం చేశారు.

# రేషన్ బియ్యం పట్టివేత

**వ్యాన్ సీజ్: (30 )క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం**



**చింతలమానేపల్లి,** చింతల మానేపల్లి నుంచి మహారాష్ట్ర లోని అహేరి కి వీఏ 33 T 4765 వాహనం లో (PDS) బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా చింతల మానేపల్లి మండల కేంద్రం వద్ద ఎన్ఫోర్స్మెంట్ డీటీలు శ్రీ రాజ్‌కుమార్, శ్రీనివాస్ గార్లు అర్ధరాత్రి 12.30 గంటలకు పట్టివేత. 60 బస్తాల PDS సన్న బియ్యం, సుమారు 30 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకోవడం జరిగింది.ప్రాథమిక విచారణలో, మహారాష్ట్రలోని అహేరి ప్రాంతానికి చెందిన నేహాల్ షేక్ అనే వ్యక్తి తన వాహనాలను తెలంగాణ సరిహద్దు గ్రామాలకు పంపించి, స్థానిక దళారుల సహాయంతో ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు వెల్లడైంది. ఇట్టి అక్రమ వ్యాపారం పై నేహాల్ షేక్ మరియు మరో 5గురు నిందితులపై 6ఎ కేసు నమోదు చేయడం జరిగింది. విచారణ కొనసాగుతోంది ఎవరైనా PDS బియ్యంతో అక్రమ వ్యాపారం నిర్వహించినట్లయితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దు

**కాగజ్‌నగర్** "సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి" అని కాగజ్‌నగర్ రూరల్ సీఐ కుమారస్వామి పేర్కొన్నారు. గురువారం లికొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నికిత పంత్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో సర్పంచులు, ఉప సర్పంచులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కుమారస్వామి మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే చిన్నచిన్న వివాదాలను పెద్ద సమస్యలుగా మారకముందే పరిష్కరించాలని సూచించారు. గ్రామ స్థాయిలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని తెలిపారు.అక్రమ మద్యం విక్రయాలు, జూదం, గాంబ్లింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే మండలంలో అనుమతి లేకుండా జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక దృష్టి సారించామని, అక్రమ ఇసుక రవాణా జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్సై అనిల్ కుమార్, పోలీస్ సిబ్బంది, సర్పంచులు, ఉప సర్పంచులు పాల్గొన్నారు.

# రికార్డు స్థాయి తైబజార్ వేలం

**తైబజార్ వేలంపాట 12లక్షల ఒక వెయ్యి రూపాయలు**
**వెంకట్రాములు ను సన్మానించిన సర్పంచ్, వార్డు సభ్యులు**





**వికారాబాద్ జిల్లా మార్చి 27 పరిగి డివిజన్** కుల్కచర్ల మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో తేది : 26/03/2026 గురువారం గ్రామ సర్పంచ్ వార్వళ్ళ అంజిలయ్య,పంచాయతీ కార్యదర్శి భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో తైబజర్ వేలంపాట నిర్వహించారు.వేలంపాటలో గ్రామానికి చెందిన పర్సాపురం వెంకట్రాములు 12లక్షల ఒక వెయ్యి రూపాయలకు వేలం పాట పాడి తైబజర్‌ను దక్కించుకున్నారు. వేలం పాట డబ్బులను గ్రామపంచాయతీ నిబంధనాలకు లోబడి చెల్లించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ విజయ్ కుమార్,బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు గాదె మహిపాల్ ముదిరాజ్,వార్డు సభ్యులు ఉత్తర కుమారి, పుట్ట రాధిక రామస్వామి,కడుమూరి రాంరెడ్డి,వినోద్ కుమార్,కే. మధు, బాలకృష్ణ, ఐలాగారి కృష్ణయ్య, వెంకటేష్,గ్రామస్తులు ,నీరటి కర్ణయ్య,ఊరడి చంద్రయ్య,నాగని బిచ్చన్న,పిట్ల బాలయ్య,ఏదుల సత్యయ్య, చాకలి కృష్ణయ్య, జెట్టిగాళ్ల వెంకటయ్య, రాజు, నర్సిములు,తదితరులు పాల్గొన్నారు.

# ఆకస్మాతుగా వచ్చే మతపరమైన పైన సమస్యలను ఎదుర్కోవడానికి మరియు ఆంటీ -డిసెక్రేషన్ పైన పోలీస్ అధికాలకు, సిబ్బందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమం -- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా,

**వికారాబాద్ జిల్లా మార్చి 27** :జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పెద్దపీట వేస్తూ, ఆకస్మికంగా తలెత్తే మతపరమైన సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవడమే లక్ష్యంగా జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఆధ్వర్యంలో పోలీసు అధికారులకు మరియు సిబ్బందికి ఒకరోజు ప్రత్యేక "యాంటీ డిసెక్రేషన్ డ్రిల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. జిల్లా పోలీస్ కార్యాలయం లో జరిగిన ఈ శిక్షణలో బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్ సిబ్బందితో పాటు జిల్లాలోని ఉన్నత పోలీసు అధికారులు,డీఎస్పీ లు,ఎస్.ఐ లు, సీఐ లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, సమాజంలో అల్లర్లు సృష్టించే శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మతపరమైన ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా ముందస్తు చర్యలు చేపట్టడం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని స్పష్టం చేశారు.శిక్షణలో భాగంగా, క్షేత్రస్థాయిలో అల్లర్లు జరిగినప్పుడు పోలీసులు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు జాగ్రత్తలు, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అనుసరించాల్సిన వ్యూహాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ( పి పి టి) ద్వారా వివరించారు. ముఖ్యంగా అల్లర్లు తలెత్తినప్పుడు సమయంలో "ఏమి చేయాలి (డి ఓ ఎస్) -- ఏమి చేయకూడదు ( డి ఓ ఎస్' టీఎస్)" అనే అంశాలపై సిబ్బందికి స్పష్టమైన అవగాహన కల్పించారు. రెచ్చగొట్టే ప్రసంగాలు, సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను అరికట్టడం, మరియు పరిస్థితిని అదుపులోకి తెచ్చే క్రమంలో సంయమనం పాటిస్తూనే కఠినంగా వ్యవహరించడం ఎలాగో వివరించారు. బ్లూ కోల్ట్స్ మరియు పెట్రో కార్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి అతి తక్కువ సమయంలో చేరుకుని, పరిస్థితిని ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు వివరించాలని ఎస్పీ గారు ఆదేశించారు. అనంతరం జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన డెమో కార్యక్రమాన్ని ఎస్పీ స్వయంగా పర్యవేక్షించారు. ఆకస్మికంగా ఏదైనా మతపరమైన సున్నితమైన అంశం తలెత్తినప్పుడు, గుంపులను ఎలా నియంత్రించాలి, పరిసరాలను ఎలా భద్రపరచాలి అనే అంశాలపై సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, "పోలీస్ వ్యవస్థ ఎల్లప్పుడూ ప్రజల భద్రత కోసం అప్రమత్తంగా ఉండాలి. క్షేత్రస్థాయిలో సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరిస్తేనే శాంతిభద్రతలు కాపాడబడతాయి. ఇలాంటి శిక్షణలు సిబ్బందిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని" పేర్కొన్నారు.ఇట్టి కార్యక్రమం లో జిల్లా అదనపు ఎస్పీ బి. రాములు నాయక్, డిటిసి డీఎస్పీ శ్రీనివాసులు, డి సి ఆర్ బి డీఎస్పీ జానయ్య, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, తాండూర్ డీఎస్పీ నర్సింగ్ యాదయ్య, ఏ ఆర్ డీఎస్పీ వీరేష్,సీఐ లు, ఎస్.ఐలు సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.







# తెలగాణ రాష్ట్ర పోలీస్ శాఖలో ఒకే బ్యాచ్ అధికారుల మధ్య ఉన్న పదోన్నతుల వ్యత్యాసాన్ని వెంటనే పరిష్కరించాలి అసెంబ్లీలో ఎమ్మెల్యే శ్రీమతి పి. సబితా ఇంద్రారెడ్డి డిమాండ్.

**పెంచికల్ పేట్** తెలంగాణ శాసనసభలో జరిగిన హోం శాఖ పద్దులపై చర్చలో పాల్గొన్న మహేశ్వరం శాసనసభ్యురాలు పి. సబితా ఇంద్రారెడ్డి, రాష్ట్ర పోలీసుల సేవలను అభినందిస్తూనే, వారి పదోన్నతులకు సంబంధించిన ఒక కీలకమైన సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్రంలో 24 గంటల పాటు శాంతిభద్రతల పరిరక్షణలో శ్రమిస్తున్న పోలీస్ శాఖ దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉందని, వారి సేవలకు ఏ చిన్న ఆటంకం లేకుండా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు.2009 బ్యాచ్ ఎస్సై ప్రమోషన్ల వ్యవహారం: రాష్ట్రంలోని రెండు మల్టీ జోన్లలో జోన్ 1, జోన్ 2,2009 ఎస్సై బ్యాచ్ కు చెందిన వారిలో గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో దాదాపు 250 నుంచి 300 మందికి సీఐ లుగా ప్రమోషన్లు ఇవ్వడం జరిగిందని గుర్తుచేశారు .మిగిలి పోయిన 60-70 మంది ఎస్సైలకు అన్యాయం, ఆ ప్రమోషన్ల ప్రక్రియలో, అదే 2009 బ్యాచ్ కు చెందిన మరో 60-70 మంది అధికారులకు సీఐలుగా ప్రమోషన్ రాక ఇప్పటికీ ఎస్సైలుగానే ఉండిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరేళ్ల క్రితమే సీఐలైన వారి బ్యాచ్ మేట్స్ ఇప్పుడు డీఎస్పీ (DSP) ప్రమోషన్ల కు సిద్ధంగా ఉన్నారని, ఇది తీవ్రమైన అసమానతలకు దారితీస్తోందన్నారు.ఒకే బ్యాచ్ కు ఎంపికైనప్పటికీ, ప్రమోషన్లు రాని వారు (ఎస్సైలు), తమ తోటి బ్యాచ్ మేట్స్ (సీఐలు) కు సెల్యూట్ చేయాల్సిన ఇబ్బందికర,అసౌకర్య వాతావరణం నెల కొందనిసభ దృష్టికి తెచ్చారు.సూపర్ న్యూమరరీ Supernumerary పోస్టుల సృష్టికి డిమాండ్ :ఈ 60-70 మంది ఎస్సైలకు ప్రస్తుతం ఖాళీలు లేకపోతే, ప్రభుత్వం తక్షణమే స్పందించి అవసరమైతే 'సూపర్ న్యూమరరీ' పోస్టులైనా సృష్టించి వారికి న్యాయంగా రావాల్సిన సీఐ (CI) ప్రమోషన్లను కల్పించాలని ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారినా పోలీసుల సేవల్లో మార్పు ఉండదని, వారు ధైర్యంగా, ప్రశాంతంగా విధులు నిర్వర్తించాలంటే ఇలాంటి న్యాయమైన ప్రమోషన్ల సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది అని అన్నారు.ఎన్నికల ముందు హోం గార్డులను పర్మినెంట్ చేస్తామని, వారికి పెన్షన్, హెల్త్ కార్డులు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను ఇచ్చింది. కానీ ఇప్పటివరకు అమలు చేయలేదు.వెంటనే కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి.మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి.



# కాగజ్ నగర్ రూరల్ సిఐ గారినీ సన్మానించిన పెంచికల్ పేట్ మండల సర్పంచ్లు

**పెంచికల్ పేట్** మండలం లోని గ్రామపంచాయతీ సర్పంచ్ ల ఆధ్వర్యంలో కాగజ్ నగర్ రూరల్ సిఐ,పెంచికల్ పేట్ మండల ఎస్సై గారినీ సన్మానించి అభినందనలు తెలిపారు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలం లోని సమస్యలపై సర్పంచ్ లతో కలిసి మండల అభివృద్ధి కి కృషి చేస్తున్న సిఐ, ఎస్సై గారినీ సన్మానించడం ఆనందంగా ఉంది అని తెలిపారు..వారు ఎల్లప్పుడూ మాకు సహాయసహకారాలు అందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం అభినంద నియామని వారు తెలిపారు..ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్లు, నాయకులు పాల్గొన్నారు



# డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో మౌళిక సదుపాయాలు కల్పించాలి.

**నెల రోజుల్లో పనులు పూర్తి చేయాలి.**
**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట జిల్లా మార్చి 26**:సూర్యాపేట పట్టణంలోని కేసారం వద్ద నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో మౌళిక సదుపాయాలను కల్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సంబందిత కాంట్రాక్టర్ ను ఆదేశించారు. గురువారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో రెవెన్యూ, మున్సిపల్, హౌసింగ్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ ప్రజల కోసం నిర్మించిన రెండు పడకల గదుల ఇళ్లలో మౌళిక సదుపాయలు అయిన తాగునీరు, విద్యుత్ మొదలైన సదుపాయాలను నెల రోజుల్లో పూర్తిచేయాలని సంబందిత కాంట్రాక్టర్ ఆదేశించారు. వాటర్ ట్యాంక్ లకు కనెక్షన్ల పనులు పూర్తి చేసి నీటిసరఫరా జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిద్ధార్థ, సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, గుత్తేదారులు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# రావణ రాజ్యమా !

రామరాజ్యం అంతరించి..
రావణ రాజ్యం ఏలుబడులు
కామదాహంతో వాలి వారసులు
మానవ మృగాళ్ల స్వేచ్ఛా సంచారాలు
అవినీతి బూజు పట్టిన మెదళ్లు
ఈర్ష్య అసూయ మంటల సెగలు
కాలిపోతున్న మానవత్వ పంటలు
మౌనముద్రలో రాముడి వారసులు
సీతమ్మకు కరువైన రక్షణ గొడలు
లక్ష్మయ్యలు కానరాని అకాలాలు
అంతరిస్తున్న హనుమ పాత్రధారులు
అనాథలవుతున్న సత్య ధర్మాలు
కరువైన రేపటి మంచి రోజులు
లంకేశుని దహనంతో పరిష్కారాలు
నేడే నాటాలి మానవీయ విత్తులు
అసుర బుద్ధులకు కట్టాలి గోరీలు
మనవతామూర్తులకు పట్టాలి గొడుగులు
రాముడి వారసులకు కొట్టాలి జేజేలు !

మధుపాళీ

## పుకార్లను నమ్మవద్దు.. పెట్రోల్ నిల్వలు నిండుగా ఉన్నాయి: ఎస్సై జయబాబు.




**టి. నర్సాపురం, మార్చి 26 .**జిల్లాలో పెట్రోల్ కొరత ఉందంటూ సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను ప్రజలెవరూ నమ్మవద్దని ఏలూరు జిల్లా టి. నర్సాపురం మండల సబ్ ఇన్‌స్పెక్టర్ జయబాబు ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు పలు కీలక సూచనలు చేశారు. మండలంలోని అన్ని పెట్రోల్ బంకుల్లో సరిపడా పెట్రోల్, డీజిల్ నిల్వలు అందుబాటులో ఉన్నాయి. ఎక్కడా కొరత లేదు. కొరత ఏర్పడుతుందనే భయంతో అవసరానికి మించి ఇంధనాన్ని నిల్వ చేసుకోవద్దని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.?ఎవరైనా అక్రమంగా ఇంధనాన్ని నిల్వ చేసినట్లు తెలిసినా లేదా కృత్రిమ కొరత సృష్టించాలని చూసినా వెంటనే 9440796676.. 9550351100 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. అలాగే ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి, వాస్తవాలను మాత్రమే ఇతరులకు చేరవేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## వాడపల్లి వెంకన్న కళ్యాణోత్సవాలకు, కొత్తపేట మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారానికి ఇంచార్జి మంత్రి అచ్చెన్నాయుడిని ఆహ్వానించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు...



**విజయవాడ, మార్చి 26..**కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవాలకు తరలిరావాలని కోరుతూ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రివర్యులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక,మత్స్య శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆహ్వానించారు. విజయవాడ క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలుసుకుని స్వామి వారి కళ్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రిక, ప్రసాదం అందజేశారు. అలాగే ఈనెల 31వ తేదీన జరగనున్న కొత్తపేట మార్కెట్ కమిటీ స్వీకార కార్యక్రమానికి సైతం తరలిరావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. వాడపల్లి వెంకన్న కళ్యాణోత్సవాలు ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5 గంటలకు ధ్వజారోహణంతో కళ్యాణోత్సవాలు మొదలవుతాయని, ఏప్రిల్ 3వ తేదీ వరకూ ఏడు రోజుల పాటు కళ్యాణోత్సవాలు జరగనున్నాయని ఎమ్మెల్యే బండారు మంత్రి అచ్చెన్నాయుడికి వివరించారు.కళ్యాణోత్సవానికి తరలి వచ్చి స్వామివారి ఆశీస్సులు అందుకోవాలని కోరారు.

## ఏలూరు ఎస్. పి. సూచన పు కార్లను నమ్మవద్దు. అన్ని పెట్రోల్ బంకుల్లో సరిపడా పెట్రోల్ అందుబాటులో ఉంది




**ఏలూరు, మార్చి 26**
సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మి అవసరానికి మించి నిల్వ చేసుకోవద్దు. దయచేసి పానిక్ అవ్వకుండా సహకరించండి. అసత్య ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకోబడతాయి. బాధ్యతాయుతంగా ప్రవర్తించి, నిజమైన సమాచారాన్నే పంచండి.అక్రమ నిల్వలు ఉంటే వెంటనే 9550351100 కు తెలియజేయండి.

## ఏలూరు మాజీ రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్ పర్సన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి భర్త దశదిన కార్యక్రనికి హాజరైన, రెడ్డి అప్పలనాయుడు.



**ఏలూరు, మార్చి 26** ఏలూరు క్రాంతి కళ్యాణ మండపం నందు ఈరోజు జరిగిన మాజీ రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్ పర్సన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి భర్త గారైన కీ.శే. ఈడ్పుగంటి నవరాజ్ (చైత్ర హాస్పిటల్ సిఈఓ) దశదిన కార్యక్రమానికి హాజరై నివాళులు అర్పించిన ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జీ శ్రీ రెడ్డి అప్పల నాయుడు.ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ శిరిపల్లి శివరామకృష్ణ ప్రసాద్, సీనియర్ నాయకులు రాఘవయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు..

## మేరుగ నర్సిరెడ్డి దశ-దిన కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు



**ఎన్టీఆర్ జిల్లా మార్చి 26**వత్సవాయి మండలం భీమవరం గ్రామానికి చెందిన మేరుగ నర్సిరెడ్డి దశ-దిన కార్యక్రమం లో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు వారితో పాటు రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండవ శ్రీనివాస్ గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి పింగళి నరసింహా రెడ్డి, మండల ఆర్టిఐ విభాగ అధ్యక్షులు కుంచపు మోషే తదితరులు నివాళులర్పించారు

# దక్షిణ భారత మెడపై డీలిమిటేషన్ కత్తి పడనుందా !

ప్రస్తుతం తమిళనాడు సిఎం స్టాలిన్ జాతీయ హిందీ భాషను బలవంతంగా దక్షిణ భారత రాష్ట్రాలపై రుద్దడం వల్ల స్థానిక భాషలు అంతరిస్తాయని, హిందీని తప్పనిసరి చేయడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకిస్తుండడం చూస్తున్నాం. దీనికి తోడుగా 2026లో చేపట్టనున్న డీలిమిటేషన్ ప్రయోగం పూర్తి అయితే దక్షిణ భారతంతో పోల్చితే ఉత్తర భారతంలో పార్లమెంట్/అసెంబ్లీ స్థానాలు భారీగా పెరుగుతాయనే ఆందోళనలో దక్షిణ భారత పార్టీలు, పౌర సమాజం మునిగి పోతున్నది. ఎక్కడ చూసినా డీలిమిటేషన్ చర్చ జరుగుతున్నది. డీలిమిటేషన్ అమలు చేస్తే జనాభా ప్రాతిపదిక కుటుంబ నియంత్రణ పాటించని ఉత్తర భారతంలో ఎంపీ సీట్లు అతిగా పెరగడం, కుటుంబ నియంత్రణతో జనాభా పెరుగుదలను అదుపులో పెట్టుకున్న దక్షిణ భారత రాష్ట్రాల్లో ఎంపీ/ఎంఎల్ఏ సీట్లు తగ్గడం జరగవచ్చునే అనుమానాలను కేంద్ర ప్రభుత్వం తాజాగా కొట్టిపారేసినప్పటికీ దక్షిణ భారతం దీని పట్ల పలు అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నారు.

డీలిమిటేషన్ అంటే ఏమిటి ?

ప్రతి పదేళ్లకు ఒకసారి జనగనణ తర్వాత జనాభా ప్రాతిపదికన రాష్ట్రాల పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలు, నియోజకవర్గ ప్రాంతాలను పునర్విభజన చేసే ప్రక్రియను డీలిమిటేషన్ అని పిలుస్తున్నాం. అధిక జనాభా కలిగిన రాష్ట్రాలకు అధిక నియోజక వర్గాలు, తక్కువ జనాభా కలిగిన రాష్ట్రాలకు తక్కువ స్థానాలు కేటాయించడం జరుగుతూ వస్తున్నది. డీలిమిటేషన్ ద్వారా ఎస్సీ, ఎస్టీ స్థానాలుకూడా పునర్ నిర్వచించబడతాయని తెలుసుకోవాలి. రాజ్యాంగంలోకి ఆర్టికల్ 82, 170 ప్రకారం, పార్లమెంట్‌లో చట్టం చేసి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే స్వయం ప్రతిపత్తిగల "డీలిమిటేషన్ కమీషన్" ద్వారా ప్రతి జనగణన తర్వాత నియోజకవర్గాల పునర్విభజన చేయడం జరుగుతుంది. ఇప్పటి వరకు 1951, 1961, 1971లలో జనగణన వరుసగా 36.1 కోట్లు, 43.9 కోట్లు, 54.8 కోట్ల జనాభా ఆధారంగా డీలిమిటేషన్ చేయడంతో పార్లమెంట్ స్థానాలు 494, 522, మరియు 543 వరకు పెంచడం జరిగింది.

2026 వరకు పొడిగించిన నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ:

1976లో కుటుంబ నియంత్రణ అమలును పెద్ద ఎత్తున చేపట్టిన నేపథ్యంలో డీలిమిటేషన్ ప్రక్రియను 25 ఏండ్ల వరకు పొడిగించడం జరిగింది. జనాభా నియంత్రించని రాష్ట్రాలకు అధిక నియోజకవర్గాలు కేటాయించాల్సి వస్తుందనే కారణంగా 1976లో 42వ రాజ్యాంగ సవరణతో డీలిమిటేషన్ ప్రక్రియను 25 ఏండ్ల వరకు, అనగా 2000 వరకు పొడిగించడం జరగడం చూసాం. 2001 సంవత్సరంలో 84వ, 2003లో 87వ రాజ్యాంగ సవరణతో తిరిగి మరో సారి డీలిమిటేషన్ ఎక్సర్‌సైజ్‌ను మరో 25 ఏండ్ల వరకు, అనగా 2026 వరకు పొడిగించారు. అనగా 1971 తర్వాత డీలిమిటేషన్ ప్రక్రియను 50 ఏండ్ల వరకు పొడిగించడం జరిగిందని తెలుసుకోవాలి. 2026లో డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తి అయితే 141 కోట్ల జనాభాకు పార్లమెంట్ స్థానాల సంఖ్య 50 శాతం పెంచామని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న 543 ఎంపీ స్థానాలు 816 వరకు పెరగనున్నాయి. అదే విధంగా దేశవ్యాప్తంగా ఉన్న 4,123 ఎంఎల్ఏ స్థానాల సంఖ్య 6,185 వరకు చేరనున్నాయి. ఇప్పుడు ఉన్న ఎంపీ స్థానాల కన్న 273 స్థానాలు పెరుగుతాయని, ఇవి కుటుంబ నియంత్రణ పాటించని అధిక జనాభా కలిగిన యూపీ, బీహార్ లాంటి రాష్ట్రాల్లో ఎంపీ స్థానాలు అధికంగా పెరగవచ్చని దక్షిణ భారతం భయపడు తున్నది. కుటుంబ నియంత్రణను పాటించి జనాభాను నియంత్రించిన దక్షిణ భారత రాష్ట్రాలను డీలిమిటేషన్ వల్ల అన్యాయం జరుగుతుందని సౌత్ ఇండియా గళం పెంచడం సముచితంగా, సమర్థనీయంగా కనిపిస్తున్నది. 2026లో జనగణన చేపడితే 2031 వరకు పూర్తి కావడం, ఆ తర్వాత డీలిమిటేషన్ ప్రక్రియ అమలు చేయడం జరగవచ్చు. దీనితో పాటు మహిళలకు 33 శాతం ఎంపీ స్థానాలు, అనగా 273 స్థానాలు కేటాయించడంతో డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తి అవుతుంది.

డీలిమిటేషన్‌పై దక్షిణ భారత అభ్యంతరాలు ఏమిటి ?

తెలుగు రాష్ట్రాల్లో తెలంగాణలో ఎంపీ స్థానాలు 25 లేదా 26 వరకు, ఎంఎల్ఏ స్థానాలు 178 లేదా 179 వరకు చేరవచ్చు. అలాగే ఆంధ్ర ప్రదేశ్‌లో ఎంపీ స్థానాలు 37 లేదా 38 వరకు, శాసనసభ స్థానాలు 262 లేదా 263 వరకు పెరగనున్నట్లు అర్థం అవుతున్నది. ప్రస్తుతం దక్షిణ భారతంలో 24 శాతం అనగా 129 ఎంపీ స్థానాలు (543 మొత్తం స్థానాలు) ఉన్నాయి. తెలంగాణలో 17, ఏపీలో 25, కేరళలో 20, తమిళనాడులో 39, కర్నాటకలో 28 ఎంపీ స్థానాలు ఉన్నాయి. ప్రతి ఎంపీ స్థానానికి 20 లక్షల జనాభాను నిర్ణయించి 2026లో డీలిమిటేషన్ చేసిన యెడల తెలంగాణలో 17 నుంచి 25/26, ఏపి 25 నుంచి 37/38, కేరళలో 19 నుంచి 30, కర్నాటకలో 28 నుంచి 42 సీట్ల వరకు, మహారాష్ట్రలో 48 నుంచి 72 వరకు, తమిళనాడులో 39 నుంచి 59, ఛత్తీస్‌ఘడ్‌లో 17 నుంచి 26, గుజరాత్‌లో 26 నుంచి 39, ఒడిసాలో 21 నుంచి 32, ఝార్ఖండ్‌లో 14 నుంచి 21, బెంగాల్‌లో 42 నుంచి 63, రాజస్థాన్‌లో 25 నుంచి 38, ఢిల్లీలో 7 నుంచి 11, జమ్ము కాశ్మీర్‌లో 5 నుంచి 8 వరకు, అస్సాంలో 14 నుంచి 21 ఎంపీ స్థానాలు పెరగవచ్చు. కేటాయించడం జరుగుతుంది. 2026 జనగణన ఆధారంగా డీలిముటేషన్ ప్రక్రియ అమలు అయితే యూపీలో ఎంపీ స్థానాలు ప్రస్తుత 80 నుంచి 120 వరకు, బీహార్‌లో 40 నుంచి 60, మధ్యప్రదేశ్‌లో 29 నుంచి 44 వరకు, రాజస్థాన్‌లో 25 నుంచి 38 వరకు నియోజకవర్గాలు పెరుగుతాయి. ఈశాన్య చిన్న రాష్ట్రాల్లో ఇప్పుడు ఉన్న ఎంపీ స్థానాలు ఒక్కొక్కటి చొప్పున మాత్రమే పెరగడం జరుగుతుంది. అనగా దక్షిణ భారతంలో ఎంపీ స్థానాలు 129 నుంచి 144 వరకు, అనగా అతి కొద్ది సీట్లు మాత్రమే పెరుగుతాయని దక్షిణ భారతం ఆవేశపడుతున్నది. దేశవ్యాప్త 816 ఎంపీ స్థానాల్లో 20 శాతం వరకు నియోజకవర్గాలు మాత్రమే దక్షిణాది రాష్ట్రాల్లో పెరగడం జరగవచ్చు.దక్షిణాది ఐదు రాష్ట్రాల్లో (తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కేరళ, కర్నాటక) ఎంపీ స్థానాలు 129 నుంచి 195 వరకు పెరిగి 66 సీట్లు అధికంగా వస్తాయి. అదే విధంగా ఉత్తర భారత 4 రాష్ట్రాల్లో (యూపీ, బీహార్, రాజస్థాన్, ఎంపీ) ఉన్న 174 సీట్లు డీలిమిటేషన్ తర్వాత 262 వరకు పెరిగి 88 సీట్లు అధికంగా రానున్నాయి. యూపీ జనాభాను నియంత్రించిన పుణ్యానికి బహుమతిగా దక్షిణాదికి ఎంపీ సీట్లు తగ్గడం, జనాభాను అదుపు చేయని ఉత్తర భారతానికి అధిక ఎంపీ సీట్లు కేటాయించడం జరిగితే దక్షిణ – ఉత్తర భారతాల మధ్య విభేదాలు పెరిగడం,దక్షిణ భారతాన్ని ఒక దేశంగా విభజించాలని ప్రతిపాదనలు కూడా బలపడవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. దేశాభివృద్ధిలో ప్రధాన భూమికను నిర్వహిస్తున్న దక్షిణాది మెడపై డీలిమిటేషన్ కత్తి చూపితే రెండు ప్రాంతాల మధ్య ఘర్షణ వాతావరణం మొలకెత్తడం తప్పనిసరి కావచ్చు. దేశ హితం కోరే రాష్ట్రాలకు ప్రోత్సాహకాలు ప్రకటించడానికి బదులు డీలిముటేషన్ వేదికగా అన్యాయం చేయడం విచారకరం, అభ్యంతరకరం కూడా అని విశ్లేషకులు భావిస్తున్నారు.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

# నాటకరంగం - కళాకారుల అద్భుత సృజన క్షేత్రం

**(27 మార్చి "ప్రపంచ నాటకరంగ దినోత్సవం" సందర్భంగా)**

నాటకరంగం లేదా థియోటర్ వేదికగా పలువురు నటులు, నటీమణులు, ఇతర కళాకారుల సహకార సృజనాత్మకత కళలను ప్రదర్శనలు ఇవ్వడం జరుగుతున్నది. నాటకశాల వేదికపై ప్రత్యక్షంగా కళాకారులు తమ నిజమైన లేదా ఊహాత్మక పాత్రలకు జీవం పోస్తూ ప్రేక్షకుల మన్ననలు పొందడం అనాదిగా కొనసాగుతున్నది. నాటకరంగ కళాకారులు తమ నటన ప్రావీణ్యాలతో ముఖకవళికలు, సంభాషణలు, గీతాలాపనలు, సంగీతం, నాట్యాలు లాంటి పలు అంశాలకు ప్రేక్షకుల కరతాళధ్వనుల మధ్య నిర్వహిస్తూ సమాజంలో జరుగుతున్న పోకడలు, విజ్ఞాన వినోదాలు, ప్రభుత్వ పాలనలు, రాజకీయ నాయకుల పోకడలు, వ్యవస్థలో లోపాల వెలికితీతలు, సూచనలు, చైతన్య కార్యక్రమాలు లాంటివి నాటక రంగంలో సుసాధ్యం అవుతున్నాయి. ఆధునిక నాటక రంగం కూడా డిజిటల్ రంగులు అద్దుకొని పలు వినూత్న మార్పులకు ఊపిరి పోస్తున్నది. నటులు తమ నటనతో పాటు పాత్రకు తగిన వేషధారణలు, వేదిక వెనుక సందర్భోచిత పరదాలు, ఆధునిక సాంకేతిక ప్రదర్శనలు, మైమింగ్, ఏకపాత్రాభినయాలు, తోలు బొమ్మలాటలు, సర్కస్, ఒపేరా, డిజిటల్ మీడియా లాంటివి అద్భుత రీతిలో అందంగా, వినోదాత్మకంగా, విజ్ఞానదాయకంగా, సానుకూల మార్పుల దిశగా,కళ్లు తెరిపించే విధంగా వేదికను సుసంపన్నం చేస్తూనే ఉన్నారు.

నాటకరంగం – సాంస్కృతిక సృజనతో ప్రపంచ శాంతి స్థాపన:

1961లో అంతర్జాతీయ నాటకరంగ సంస్థ చొరవతో ప్రతి ఏటా 27 మార్చిన "ప్రపంచ నాటకరంగ దినోత్సవం (వరల్డ్ థియెటర్ డే)" పాటించుట 1962 నుంచి ఆనవాయితీగా మారింది. 2026 ప్రపంచ నాటక దినోత్సవం ఇతివృత్తంగా "నాటకరంగం – సాంస్కృతిక సృజనతో ప్రపంచ శాంతి స్థాపన" అనబడే అంశాన్ని తీసుకున్నారు. ఒకరి పాత్రలో మరొకరు నటిస్తూ ప్రేక్షకులను అలరించడం లేదా ఒక అంశాన్ని ప్రజల కళ్ల ముందుంచడం, సమాజ విపరీత పోకడలను వేలెత్తి చూపడం, సకారాత్మక మార్పులను సూచించడం, విద్య వినోదాల విందులు ఆరబోయడం నాటక రంగ ప్రత్యేకతల్ని తెలుసు కోవాలి.

డిజిటల్ వెలుగుల్లో కళ తప్పిన నాటకరంగం:

డిజిటల్ యుగంలో స్మార్ట్ ఫోన్స్, టీవీలు ఇంటింటా వెలగడంతో సినిమా హాళ్లు కూడా ఖాళీగా కనిపిస్తున్నాయి. నాటక రంగం రానురాను తెర వెనక్కి వెళుతూ కళాకారుల, ప్రజల ఆదరాభిమానాలు పలుచబడుతున్నాయి. నాటక ప్రదర్శనలు అరుదై పోయాయి. నటులు, నటీమణులు మరో మార్గం లేక నటనకు స్వస్తి పలకడం లేదా సినిమా రంగంలోకి వెళ్లే ప్రయత్నాలు చేయడం కొనసాగుతున్నది. నాటక రంగ కళాకారులు అంటే పరిహాసం అయిపోవడం అత్యంత బాధాకరం. నాటకరంగానికి నిధుల కొరత, ప్రభుత్వాల నిరాదరణ, కొరవడిన కళాకారులకు ప్రోత్సాహాలు, డిజిటల్ వేదికలకు పెరిగిన ఆదరణ, ప్రజల ఆసక్తి తగ్గడం లాంటి అంశాలు థియేటర్ ఆర్ట్ రంగానికి శాపంగా మారుతున్నాయి. నాటకరంగం వైపు యువత చూపులు తగ్గడం, నాటకరంగ కళాకారులను చిన్న చూపు చూడడం, కళాపోషకులు తగ్గడం, కళాభిమానులు పలుచబడడం, థియేటక్ ప్రదర్శనలకు ప్రేక్షకులు తగ్గడం లాంటివి థియేటర్ ఆర్ట్స్‌కు విఘాతాలుగా మారడం విచారకరం. మనదైన పూర్వపు నాటక కళకు డిజిటల్ రంగులు అద్ది కళాకారుల ప్రదర్శనలను ఆదరిద్దాం, విజ్ఞాన వినోద, చైతన్యాలను పొందుదాం.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

# శ్రీ రామ నవమి - లోక కళ్యాణ కలిమి

**(27 మార్చి "శ్రీ రామ నవమి" పర్వదిన సందర్భంగా)**

హిందూ క్యాలెండర్ వివరణ ప్రకారం త్రేతా యుగంలో చైత్రమాసంలో శుక్ల పక్షం నవమి తిథి పుణ్య గడియల్లో, అనగా 27 మార్చి 2026న శుభ గడియల్లో అయోధ్యలో శ్రీ రాముడు జన్మించడం జరిగిన శుభ సందర్భంగా "శ్రీ రామ నవమి" పర్వదినాన్ని వైభవంగా, భక్తి ప్రపత్తులతో నిర్వహించుకోవడం అనాదిగా ఆచరించబడుతున్నది. అయోధ్య పదానికి అర్థంగా 'అ' అనగా 'లేదు'అని,'యోధ్య'అనగా 'సంఘర్షణ' అని, 'సంఘర్షణలు లేని ప్రదేశం' అని అర్థం చేసుకుంటున్నాం. ఈ రోజున పవిత్ర భావనలతో సీతారాముల మందిరాలకు వెళ్లి పూజలు చేయడం, స్వామి వాకడరి దీవెనలు పొందడం, భజనలు-కీర్తనలు పాడడం, సీతా రాముల కళ్యాణ వేడుకలు నిర్వహించడం, హనుమ, లక్ష్మణ సీతా సమేత రామచంద్ర స్వామి ఉత్సవ విగ్రహాలతో ఊరు వాడ ఊరేగింపులు నిర్వహించడం చూస్తూ ఉన్నాం.శ్రీ విష్ణువు లేదా శ్రీ కృష్ణుడు మరో మానవ అవతారంగా శ్రీ రాముడిగా భువిపైకి రావడం, తన జీవనశైలిగా పాటు విలువలకు కట్టుబడి జీవితాన్ని సుసంపన్నం చేసుకోవడం ద్వారా మానవాళికి సరైన జీవన విధానాలను బోధించడం జరిగింది.

శ్రీ రామ నవమి పర్వదినం :

శ్రీ రామ నవమికి ముందు నవరాత్రులను 'చైతన్య నవరాత్రులు'గా భక్తి శ్రద్ధలతో పాటించడం, రాముడి జన్మ స్థలమైన అయోధ్యలో ప్రధాన వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహించడం జరుగుతున్నది. అయోధ్యతో పాటు భద్రాచలం, రామేశ్వరం లాంటి పలు ప్రధాన సీతారాముల దేవాలయాల్లో కూడా రామ నవమి వేడుకలు అంగరంగ వైభవంగా వేడుకలు నిర్వహించడం, లక్షల్లో భక్తులు దర్శనాలకు క్యూ కట్టడం చూస్తున్నాం. మర్యాద పురుషోత్తముడిగా శ్రీ రాముడు మానవ రూపంలో దైవంగా మానవీయ విలువలను తను ఆచరించి మనకు సనాతన ధర్మాలను బోధించడం జరుగుతున్నది. శ్రీ రాముడి జీవితం 'మంచి' లేదా సన్మార్గం'కు ప్రతిరూపంగా, రావణుడి జీవితం 'చెడు' లేదా 'దుర్మార్గం' ప్రతిబింబించే విధంగా ఉండడం, రాముడి జీవితం 'చెడు పై మంచి విజయం'గా మనకు మార్గనిర్దేశనం చేస్తున్నది. రావణుడిపై రాముడి విజయం అమానవీయతపై మానవీయ విలువల విజయంగా కూడా భావిస్తున్నాం.

రామ, సీత, దశరథ్, హనుమ, కౌసల్య పాత్రల వైశిష్ట్యం:

శ్రీ రాముడి తండ్రి 'దశరథ్ (దశ ; రథ్ = పది రథాలు) అనగా సుసంపన్న జీవితాలకు పది ఇంద్రియాలను సూచిస్తున్నది. వీటిలో ఐదు కర్మేంద్రియాలు (మాట లేదా నోరు, చేతులు, కాళ్లు, విసర్జన కేంద్రాలు, సంతోనోత్పత్తి కేంద్రాలు), మరో ఐదు జ్ఞానేంద్రియాలు (చూపు, వాసన, వినికిడి, రుచి, స్పర్శ) అని తెలుసుకుంటూ, సమతుల జీవన గమనానికి ఈ పది ఇంద్రియాలను నియంత్రించుకోవడం నేర్చుకోవాలని సూచిస్తున్నది. రాముడి తల్లి 'కౌసల్య' అనగా 'అద్భుత నైపుణ్యాలు లేదా కౌశలాలు కలిగిన వారు' అని అర్థం చేసుకోవాలి. కౌసల్య బోధనలతో రాముడు అద్వితీయ జీవన కౌశలాలను నేర్చుకున్నట్లు తెలుసుకోవాలి. రాముడిని 'ఆత్మ' లేదా 'సోల్'గా, సీతను 'మనస్సు'గా, హనుమను 'భక్తి, క్రమశిక్షణ, స్వయం-అవగాహన'గా, రావణుడిని 'గర్వం లేదా అహంకారం'కి రూపమని భావిస్తారు. ఆత్మను మనస్సుతో ఏకం చేయడానికి (రాముడిలో సీతను ఏకం చేయడం) భక్తికి కట్టుబడిన హనుమ సహాయంతో రామణుడి అతి గర్వానికి తగు శాస్తి జరగడం, సీతారాములు ఇద్దరు ఒకటి కావడం జరిగింది.

సత్య యుగం నుంచి కలియుగం వరకు.. :

కాల చక్రంలో సత్య యుగంలో దేవుళ్లు, రాక్షసుల మధ్య యుద్ధాలు జరగడం, త్రేతాయుగంలో రెండు మహారాజ్యాల మధ్య పోరాటం జరగడం, ఆదర్శ రాముడి చేతుల్లో అనైతిక అసుర రావణుడి మరణం సంభవించడం చూసాం. ద్వాపరయుగంలో జగన్నాథుడి దర్శకత్వంలో ఒకే కుటుంబానికి చెందిన రెండు (పాండవులు, కౌరవులు) సోదర సమూహాల మధ్య యుద్ధం జరిగి దుర్మార్గపు ఆలోచనలపై సన్మార్గపు సదాలోచనలు గెలవడం జరిగింది. నేడు నడుస్తున్న కలియుగంలో వ్యక్తుల్లో గర్వం, దురాశ, అక్రమార్జన లాంటి దుర్గుణాలు మొలకెత్తి నిరంతరం అంతరంగాల్లో అంతర్యుద్ధం జరుగుతూ ఉన్నది. త్రేతాయుగంలో శ్రీ రామాయణం (రాముడి జీవన ప్రయాణం)లో బాల, అయోధ్య, అరణ్య, కిష్కింధ, సుందర, యుద్ధ, ఉత్తర అనబడే ఏడు కాండలు ఉన్నాయని, అందుకోని ప్రతి పాత్ర మానవజాతికి సన్మార్గాలను చూపుతున్నాయని మనకు తెలుసు.

ప్రపంచ మానవాళికి అందిన అరుదైన అపూర్వ జీవనశైలి శాశ్వత నిఘంటువులుగా ఇతిహాసాలుగా శ్రీమద్? రామాయణం, భారత భాగవతాలు అందించబడ్డాయి. ప్రతి ఒక్కరు దేవుడిపై భక్తి, శ్రద్ధలతో సత్యధర్మ, క్రమశిక్షణ, సహృదయాలనే సుగుణాలను కలిగి తమ జీవితాలను సుసంపన్నం చేసుకోవాలి, ఈ మార్గంలో శ్రీ రాముడు మనకు అదృశ్య చేయూతను ఇస్తున్నాడని నమ్ముతూ మన జీవనయానాలను కొనసాగిద్దాం, అశాంతికి తావు లేని ప్రపంచాన్ని నిర్మించుకుందాం.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

# అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్ లు పంపిణీ.

**రెండు నెలల్లో 44,346 కేంద్రాలకు రూ.62 కోట్లు వెచ్చించనున్న ప్రభుత్వం.**

**సెట్టూరు ట్టూరు మండలం మార్చ్ 26.** గ్యాస్ కొరత కారణంగా భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్లను ప్రభుత్వం అందించనుంది. రాష్ట్రవ్యాప్తంగా 55,746 కేంద్రాలుం డగా ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు కింద 11,400 కేంద్రా లకు స్టవ్లను అందించారు. వాటి నిర్వహణ, సమయం తదితరాలపై అంగన్వాడీ కార్యకర్తల నుంచి ప్రభుత్వానికి సానుకూల అభిప్రాయం అందింది. ఈ నేపథ్యంలో మిగతా 44,346 కేంద్రాలకు వీటిని అందించాలని నిర్ణయించింది. ఇండక్షన్ స్టవ్వు, పాత్రలు ఇవ్వనున్నారు. ఇందుకు రూ. 62కోట్లు ఖర్చు వుతుంది. ఒక్కో కేంద్రానికి ఇండక్షన్ స్టవ్, వంటపా త్రలు కలిపి రూ. 7వేల విలువైనవి అందించనున్నారు. మే నెలాఖరుకు నాలుగు విడతల్లో అన్ని కేంద్రాలకూ ఇవి అందేలా అధికారులు చర్యలు చేపట్టారు.

# సీజన్ మధ్యలో బరిలోకి దిగుతా...

**• కెప్టెన్ ప్యాట్ కమిన్స్ వెల్లడి**



ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులకు ఆ జట్టు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ గుడ్ న్యూస్ చెప్పాడు. వెన్ను గాయంతో బాధపడుతున్న తాను వేగంగా కోలుకుంటున్నానని, సీజన్ మధ్యలో బరిలోకి దిగుతానని తెలిపాడు. ఇంగ్లండ్‌తో యాషెస్ సిరీస్ సందర్భంగా వెన్ను గాయానికి గురైన ప్యాట్ కమిన్స్.. అప్పటి నుంచి ఆటకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ గాయం కారణంగానే అతను ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 కూడా ఆడలేదు. ఐపీఎల్ 2026 సీజన్ ఆరంభ మ్యాచ్‌లకు కూడా ప్యాట్ కమిన్స్ దూరమయ్యాడు. అతని గైర్హాజరీలో సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్సీ బాధ్యతలను ఇషాన్ కిషన్‌కు అప్పగించారు. గాయంతో ఆరంభ మ్యాచ్‌లకు దూరమైనా.. ప్యాట్ కమిన్స్ బుధవారం సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుతో కలిసాడు. గాయంతో ఇబ్బంది పడుతున్నా జట్టుతో కలిసి అతను ప్రయాణించనున్నాడు. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో బుధవారం జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో కమిన్స్ పాల్గొన్నాడు. వార్మప్‌లు, ఫీల్డింగ్, క్యాచ్‌లు ప్రాక్టీస్ చేశాడు. తక్కువ రనప్‌తో ఖాళీ నెట్స్‌లో కొన్ని బంతులు కూడా బౌలింగ్ చేశాడు.తాజాగా టీమ్ సోషల్ మీడియా టీమ్‌తో మాట్లాడిన కమిన్స్.. తాను కోలుకుంటున్నానని.. సీజన్ మధ్యలో జట్టుకు అందుబాటులోకి వస్తానని చెప్పాడు.

# చరిత్ర సృష్టించనున్న భువనేశ్వర్ కుమార్



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుస్టార్ పేసర్ భువనేశ్వర్ కుమార్.. సరికొత్త చరిత్రను లిఖించేందుకు సిద్ధమయ్యాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా తన పాత జట్టు సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగే తొలి మ్యాచ్‌లో భువనేశ్వర్ కుమార్ రెండు వికెట్లు తీస్తే వరల్డ్ రికార్డ్ నమోదు చేయనున్నాడు. ఐపీఎల్ కెరీర్‌లోనే 200 వికెట్లు తీసిన తొలి పేసర్‌గా చరిత్రకెక్కనున్నాడు. ఇప్పటివరకు 190 మ్యాచులు ఆడిన ఈ ఆర్‌సీబీ స్వింగ్ కింగ్ 27.33 సగటుతో 198 వికెట్లు పడగొట్టాడు. ఇందులో రెండు ఐదు వికెట్ల ప్రదర్శనలు, రెండు నాలుగు వికెట్ల ప్రదర్శనలు ఉన్నాయి. ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో పంజాబ్ కింగ్స్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ మాత్రమే అతని కంటే ముందున్నాడు. అత్యధిక ఐపీఎల్ వికెట్లు తీసిన పేసర్ల జాబితాలో భువనేశ్వర్ కుమార్ తర్వాత ముంబై ఇండియన్స్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా ఉన్నాడు. అతను 145 మ్యాచుల్లో 22.02 సగటుతో 183 వికెట్లు తీశాడు. చెన్నై సూపర్ కింగ్స్ మాజీ ప్లేయర్ డ్వేన్ బ్రావో 161 మ్యాచుల్లో 183 వికెట్లతో బుమ్రా సరసన నిలిచాడు. ఈ సీజన్‌లో బుమ్రా 200 వికెట్ల మైలురాయి అందుకునే అవకాశం ఉంది. ఐపీఎల్ 2025 మెగా వేలంలో భువనేశ్వర్ కుమార్‌ను ఆర్‌సీబీ రూ.10.75 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. వేలంలో లక్నో సూపర్ జెయింట్స్, ముంబై ఇండియన్స్ జట్లతో పోటీపడి మరి కొనుగోలు చేసింది. ఆ సీజన్‌లో 14 ఇన్నింగ్స్‌ల్లో 17 వికెట్లతో ఆర్‌సీబీ విజయంలో భువీ కీలక పాత్ర పోషించాడు. ఆర్‌సీబీ తరపున అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా నిలిచాడు.36 ఏళ్ల భువనేశ్వర్ కుమార్‌కు కొత్త బంతితో అద్భుతమైన రికార్డు ఉంది. పవర్‌ప్లే ఓవర్లలో అతను అత్యధికంగా 79 ఐపీఎల్ వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. ఈ జాబితాలో ముంబై ఇండియన్స్ లెఫ్ట్ ఆర్మ్ పేసర్ ట్రెంట్ బౌల్ట్ మాత్రమే ఈ భారత వెటరన్‌కు దగ్గరగా ఉన్నాడు. పవర్‌ప్లేలో తీసిన మొత్తం 79 వికెట్లలో 29 వికెట్లను ఇన్నింగ్స్ మొదటి ఓవర్‌లోనే పడగొట్టడం అతని ప్రత్యేకత. గత సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన గత మ్యాచ్‌లో భువనేశ్వర్ కుమార్ 43 పరుగులిచ్చి ఒకే వికెట్ తీసాడు. ట్రావిస్ హెడ్ మాత్రమే ఔట్ చేశాడు. ఈ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ 94 పరుగులతో అజేయంగా నిలిచాడు.

# ఐపీఎల్ మ్యాచ్ టిక్కెట్ల బ్లాక్ దందా..

**• కర్ణాటక ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు**




ఐపీఎల్ 2026 సీజన్ ఆరంభ మ్యాచ్‌కు ముందే బెంగళూరులో టికెట్ల లొల్లి మొదలైంది. మార్చి 28న స్థానిక చిన్నస్వామి స్టేడియం వేదికగా డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య తొలి మ్యాచ్ జరగనుంది. ఈ హై ఓల్టేజ్ మ్యాచ్‌కు సంబంధించిన టికెట్ల పంపిణీ వ్యవహారం ఇప్పుడు కర్ణాటకలో తీవ్ర రాజకీయ దుమారానికి దారితీసింది. మ్యాచ్ చూసేందుకు మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత పాస్‌లు లేదా వీఐపీ టికెట్లు ఇవ్వకపోవడంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయానంద కాశప్పనవర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం తీరును ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ప్రభుత్వ స్థలంలో స్టేడియం నిర్మించుకుని, ప్రభుత్వం నుంచి అన్ని రకాల మౌలిక సదుపాయాలు, ఇతర సహకారాలు పొందుతున్న కేఎస్‌సీఏ కనీసం ప్రజాప్రతినిధులను గౌరవించడం లేదని ఆయన ఆరోపించారు. ఎమ్మెల్యేల కుటుంబాలకు కనీస ప్రాధాన్యం ఇవ్వకపోవడం దారుణమంటూ ఆయన బహిరంగంగానే తన అసంతృప్తిని వ్యక్తం చేయడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది. మార్చి 28న జరిగే తొలి మ్యాచ్ కోసం మంత్రులు, ఎమ్మెల్యేలకు ఇప్పటివరకు ఎలాంటి టికెట్లు కేటాయించలేదని కాశప్పనవర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సౌకర్యాలు వాడుకుంటూనే తమను కేఎస్‌సీఏ అధికారులు అవమానిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులైన తాము సామాన్యుల్లా క్యూలైన్లలో నిలబడి టికెట్లు కొనుగోలు చేయలేమని తేల్చి చెప్పారు. కాబట్టి ప్రొటోకాల్ ప్రకారం ఒక్కో ఎమ్మెల్యేకు కనీసం ఐదు వీఐపీ టికెట్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. వీఐపీల హోదాను దృష్టిలో ఉంచుకుని క్రికెట్ అసోసియేషన్ తగిన విధంగా వ్యవహరించాలని ఆయన హితవు పలికారు. కేవలం వీఐపీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా, టికెట్ల విక్రయాల్లో కేఎస్‌సీఏ భారీ అక్రమాలకు పాల్పడుతోందని ఎమ్మెల్యే సంచలన ఆరోపణలు చేశారు. బ్లాక్ మార్కెట్‌లో టికెట్లను యథేచ్ఛగా అమ్ముకుంటున్నారని విమర్శించారు. అధికారికంగా రూ.5 వేల ధర ఉన్న టికెట్‌ను రూ.35 వేలకు అక్రమంగా విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఆన్‌లైన్‌లో బుకింగ్ ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే టికెట్లు అన్నీ అమ్ముడైపోయినట్లు చూపిస్తున్నారని, దీని వెనుక పెద్ద దందా నడుస్తోందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలతో ఈ వివాదం ఇప్పుడు రాజకీయ రంగు పులుముకుంది. మరోవైపు సామాన్య క్రికెట్ అభిమానులు సైతం టికెట్ల విక్రయాల్లో పారదర్శకత లోపించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గంటల తరబడి ఆన్‌లైన్‌లో వేచి చూసినా టికెట్లు దొరకడం లేదని ఫ్యాన్స్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అసలు టికెట్లు ఎవరికి అమ్ముతున్నారో క్రికెట్ బోర్డు స్పష్టం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అయితే ఎమ్మెల్యే చేసిన ఈ తీవ్రమైన ఆరోపణలు, బ్లాక్ మార్కెటింగ్ విమర్శలపై కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి వివరణ ఇవ్వలేదు.



# మరో టైటిల్‌పై సన్‌రైజర్స్ గురి

ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ మరో టైటిల్‌పై గురిపెట్టింది. చివరగా ఆరెంజ్ ఆర్మీ డేవిడ్ వార్నర్ సారథ్యంలో 2016లో టైటిల్ అందుకుంది. ఆ తర్వాత 2018, 2024 సీజన్లలో ఫైనల్ చేరినా విజేతగా నిలవలేకపోయింది. గతేడాది పేలవ ప్రదర్శనతో ఆరో స్థానంతో సరిపెట్టుకుంది. ఈ సారైనా మెరుగైన ప్రదర్శన చేసి టైటిల్ అందుకోవాలనే కసితో ఉంది. అయితే ఫిట్‌నెస్ సమస్యలతో ప్యాట్ కమిన్స్ ఆరంభ మ్యాచ్‌లకు దూరం కావడం జట్టుకు గట్టి ఎదురుదెబ్బ. విధ్వంసకర బ్యాటర్లతో బ్యాటింగ్ విభాగం బలంగా ఉన్నా బౌలింగ్ విభాగం బలహీనంగా ఉంది. ప్యాట్ కమిన్స్ లేని లోటును తీర్చే బౌలర్ ఎవరా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. అంతేకాకుండా వేలంలోకి వదిలేసిన మహమ్మద్ షమీ స్థానాన్ని భర్తీ చేసే బౌలర్ ఎవరూ జట్టులో కనిపించడం లేదు. దాంతోనే సన్‌రైజర్స్ హైదరాబాద్ 250o పరుగులు చేసినా మ్యాచ్ గెలవలేదని ఆకాశ్ చోప్రా వంటి విశ్లేషకులు బల్ల గుద్ది చెబుతున్నారు. విధ్వంసకర బ్యాటర్లు జట్టులో ఉన్నా.. దూకుడుగా ఆడి ఆల్‌టైమ్ రికార్డు స్కోర్లు నమోదు చేసినా.. జట్టు గెలుస్తుందా? అంటే చెప్పలేని పరిస్థితి నెలకొంది. గత సీజన్‌లోనూ పేలవ బౌలింగ్ సన్‌రైజర్స్ విజయవకాశాలను దెబ్బతీసింది. ప్రాక్టీస్‌లో ఆరెంజ్ ఆర్మీ విధ్వంసకర బ్యాటర్లే దూకుడుగా ఆడి బౌలర్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నారనే వాదన కూడా ఉంది. ఈ క్రమంలోనే దూకుడే జట్టుకు బలం, బలహీనతగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గత సీజన్లలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్లాట్ పిచ్‌లపై ఆడిన మ్యాచ్‌ల్లో గెలవగా.. స్లో వికెట్స్‌పై ఓటమిపాలైంది. కాస్త నెమ్మదిగా ఉన్న పిచ్‌పై సన్‌రైజర్స్ బ్యాటర్లు తేలిపోతుండగా..
బౌలర్లు పూర్తిగా చేతులెత్తేస్తున్నారు.ఈ సమస్యను అధిగమించేందుకే సన్‌రైజర్స్ హైదరాబాద్ యువ బౌలర్లను కొనుగోలు చేసింది. స్మరణ్ రవిచంద్రన్, హర్ష్ దూబె, శివాంగ్ కుమార్, ప్రఫుల్ హింగె, శివమ్ మావి, సకిబ్ హుస్సేన్, క్రైనిస్ ఫులెట్రా అనే బౌలర్లను కొనుగోలు చేసింది.
అయితే ఇందులో మెజార్టీ ఆటగాళ్లకు ఐపీఎల్ ఆడిన అనుభవం లేదు. వీళ్లలో ఏ ఇద్దరు అసాధారణ ప్రదర్శన కనబర్చినా సన్‌రైజర్స్ బౌలింగ్ కష్టాలు తీరుతాయి. లేదంటే జట్టు మరోసారి ప్లే ఆఫ్స్ చేరకుండా అస్సాం ట్రైన్ ఎక్కాల్సిందే.

# పాకిస్థాన్ ఆటగాళ్లపై వార్నర్ ఆగ్రహం



పాకిస్థాన్ ఆటగాళ్లపై ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డేవిడ్ వార్నర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. పాకిస్థాన్ ప్రీమియం ఆటగాళ్లకు కనీస ఇంగిత జ్ఞానం లేదని, ప్రెస్‌మీట్‌లో ఎలా ఉండాలో కూడా తెలియదని అసహనం వ్యక్తం చేశాడు.పాకిస్థాన్ సూపర్ లీగ్ 2026 సీజన్ నేపథ్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో డేవిడ్ వార్నర్ ఈ వ్యాఖ్యలు చేశాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.పాకిస్థాన్ సూపర్ లీగ్(పీఎస్‌ఎల్) 2026 సీజన్‌కు నేడు తెరలేవనుంది. ఈ క్రమంలో బుధవారం లాహోర్‌లోని గడాఫీ స్టేడియంలో కెప్టెన్ల రౌండ్ టేబుల్ ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ టోర్నీలో కరాచీ కింగ్స్‌కు సారథ్యం వహిస్తున్న డేవిడ్ వార్నర్.. పాక్ ఆటగాళ్ల తీరును తప్పుబడుతూ అసహనం వ్యక్తం చేశాడు.ప్రెస్ మీట్‌లో వార్నర్ తన జట్టు వ్యూహాల గురించి సీరియస్‌గా వివరిస్తుండగా.. పక్కనే కూర్చున్న ఇతర జట్ల కెప్టెన్లు షాహీన్ అఫ్రిది, మహ్మద్ రిజ్వాన్, సౌద్ షకీల్ ఒకరిపై ఒకరు జోకులు పేల్చుకుంటూ నవ్వుకున్నారు. వార్నర్ చెప్పే మాటలను పట్టించుకోలేదు. దాంతో అతను తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. 'అసలు ఇక్కడ ఏం జరుగుతోంది? ఇలా అడుగుతున్నందుకు క్షమించండి. ఇక్కడ కొంతమంది స్కూల్ పిల్లల్లా ప్రవర్తిస్తున్నారు. వీళ్లు తమను తాము ప్రీమియం ప్లేయర్స్ అని పిలుచుకుంటున్నారు. కానీ వీరి ప్రవర్తన మాత్రం చిన్న పిల్లల కంటే అధ్వాన్నంగా ఉంది. ఒక ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఎలా ప్రవర్తించాలో కూడా వీరికి తెలియదా?'అని మండిపడ్డాడు.డేవిడ్ వార్నర్ చేసిన ఈ వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. వార్నర్‌ను కొందరు తప్పుబడుతుంటే మరికొందరు సమర్థిస్తున్నారు. అంతర్జాతీయ ప్రెస్ మీట్స్‌లో ప్రొఫెషనలిజం ఉండాల్సిందేనని వార్నర్‌కు మద్దతు తెలుపుతున్నారు.

# టీమిండియాలోకి రీఎంట్రీ ఇవ్వడమే నా లక్ష్యం

**• ఢిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్ పృథ్వీ షా వ్యాఖ్యలు**



టీమిండియాలోకి రీఎంట్రీ ఇవ్వడమే తన లక్ష్యమని ఢిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్ పృథ్వీ షా అన్నాడు. అందుకోసం ఎంతకైనా తెగిస్తానని, 200 శాతం కష్టపడుతానని తెలిపాడు. ఐపీఎల్ 2025 సీజన్ వేలంలో అన్‌సోల్డ్‌గా నిలిచిన పృథ్వీ షాను ఈ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ కనుకరించి రూ.75 లక్షల కనీస ధరతో కొనుగోలు చేసింది.అతనికి తుది జట్టులో చోటు దక్కుతుందా? లేదా?అనేది గ్యారెంటీ లేదు. ఐపీఎల్ 2026 సీజన్ నేపథ్యంలో ఓ వార్తా ఏజెన్సీతో మాట్లాడిన పృథ్వీ షా.. టీమిండియాలోకి రీఎంట్రీ ఇవ్వడమే తన ఏకైక లక్ష్యమని చెప్పాడు. 'టీమిండియాలోకి రీఎంట్రీ ఇవ్వడం కోసం నేను ఇంకా క్రికెట్ ఆడుతున్నాను. ఈ విషయంలో ఎలాంటి సందేహం లేదు. అందుకోసం నేను చాలా కష్టపడుతున్నాను. గతంలో కంటే మూడు రెట్లు ఎక్కువ కష్టపడుతున్నాను. వాస్తవానికి ఈ విషయం గురించి మాట్లాడటానికి నాకు ఇష్టం లేదు. కానీ భారత జట్టులోకి తిరిగి రావడానికి, ట్రోఫీని గెలవడానికి నా సాయశక్తులా ప్రయత్నిస్తాను. జట్టు విజయం కోసం 100 శాతం కాదు.. 200 శాతం కృషి చేస్తాను.గత కొన్నేళ్లుగా నేను ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నాను. వాటన్నింటినీ నేను చిరనవ్వుతో స్వీకరించాను. నేను తిరిగి జట్టులోకి వచ్చినా.. అవన్నీ నా మనసులోనే ఉంటాయి. టీమిండియాలోకి రావాలంటే ఒకటే మార్గం. కష్టపడాలి.. సాయశక్తుల కృషి చేయాలి. తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోవాలి.ఢిల్లీ క్యాపిటల్స్ తుది జట్టులో చోటు గురించి ఆలోచించడం లేదు. ఒకవేళ కేఎల్ రాహుల్ ఓపెనర్‌గా బరిలోకి దిగితే.. అతనితో కలిసి ఎవరు ఆడినా బాగా ఆడాలి. నేనే ఓపెనింగ్ చేయాలని కోరుకోవడం లేదు. ఎవరు ఓపెనింగ్ చేసినా.. జట్టుకు విజయాన్ని అందించాలి.తుది జట్టులో ఖచ్చితంగా పోటీ ఉంది. మీరు రంజీ ట్రోఫీ ఆడినా.. ఐపిఎల్ , టీమిండియా, ఇండియా-ఏ తరపున ఆడినా క్రికెట్‌లో పోటీ అనేది ఉంటుంది. ప్రస్తుతం 10 మంది ఓపెనర్లు ఉన్నారు. కాబట్టీ పోటీ ఖచ్చితంగా ఉంటుంది.'అని పృథ్వీ షా చెప్పుకొచ్చాడు. అండర్ 19 ప్రపంచకప్ విజయంతో భారత క్రికెట్‌లోకి తారాజువ్వలా దూసుకొచ్చిన పృథ్వీ షా అంతే వేగంగా జట్టుకు దూరమయ్యాడు. టీమిండియా భవిష్యత్తు సారథి అవుతాడని ప్రశంసలు అందుకున్న ఈ ముంబై కుర్రాడు.. ప్రస్తుతం ఐపీఎల్‌లోనూ నిలదొక్కుకోలేకపోతున్నాడు. గాయాలు, ఫిట్‌నెస్ సమస్యలతో పాటు చెడు స్నేహాలు పృథ్వీ షా కెరీర్‌ను నాశనం చేశాయి.

### పాక్‌పై దాడుల కథతో వివేక్ అగ్నిహోత్రి కొత్త సినిమా

# 'ఆపరేషన్ సిందూర్'

'ది కశ్మీర్ ఫైల్స్', 'ది వ్యాక్సిన్ వార్' వంటి చిత్రాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి తన తదుపరి ప్రాజెక్టును ప్రకటించారు. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో తెరకెక్కనున్న ఈ సినిమా కోసం ప్రముఖ నిర్మాణ సంస్థ టీ-సిరీస్ అధినేత భూషణ్ కుమార్‌తో చేతులు కలిపినట్లు ఆయన వెల్లడించారు. సరిహద్దు అవతల భారత సైన్యం నిర్వహించిన రహస్య సైనిక చర్యల ఆధారంగా ఈ చిత్రం ఉండబోతోందని తెలిపారు. ఈ సినిమా




కథకు లెఫ్టినెంట్ జనరల్ కేజేఎస్ 'టినీ' ధిల్లాన్ రాసిన "ఆపరేషన్ సిందూర్: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ ఇండియాస్ డీప్ స్ట్రైక్స్ ఇన్‌సైడ్ పాకిస్థాన్" అనే పుస్తకం ఆధారం. ఈ విషయాన్ని వివేక్ అగ్నిహోత్రి ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. "ఉపఖండంలో భద్రతా నిర్వచనాన్ని మార్చేసి, పాకిస్థాన్ అణు బూటకాన్ని బట్టబయలు చేసిన కథ 'ఆపరేషన్ సిందూర్'. దీనికోసం నేను, భూషణ్ కుమార్ చేతులు కలిపాం" అని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు. కేవలం సంచలనం సృష్టించడానికి కాదని, వాస్తవాలను స్పష్టంగా సినిమా మాధ్యమం ద్వారా చెప్పడానికే ఈ సినిమా తీస్తున్నట్లు వివరించారు. పుస్తకంలోని వివరాల ప్రకారం 2025 ఏప్రిల్ లో జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం వద్ద జరిగిన ఉగ్రదాడిలో 26 మంది అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడికి ప్రతీకారంగా భారత సైన్యం మేలో 'ఆపరేషన్ సిందూర్' పేరుతో ఒక సైనిక చర్యను ప్రారంభించింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని జైషే మహ్మద్, లష్కరే తోయిబా వంటి ఉగ్రవాద సంస్థల స్థావరాలపై భారత్ మిస్సైల్ దాడులు చేసింది. ఈ వాస్తవ ఘటనల ఆధారంగా భారత సాయుధ దళాలలోని పలు విభాగాల నుంచి సమాచారం సేకరించి, క్షేత్రస్థాయిలో విస్తృతమైన పరిశోధన చేసి ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్ర బృందం తెలిపింది. ఉపఖండ భద్రతా పరిణామాలను మార్చేసిన ఈ సైనిక వ్యూహాలను వెండితెరపై ఆవిష్కరించడమే ఈ సినిమా లక్ష్యమని వివేక్ అగ్నిహోత్రి స్పష్టం చేశారు.

# బాలకృష్ణకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్..

# ఢిల్లీ సీఎం చేతుల మీదుగా ప్రదానం

ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అరుదైన గౌరవం అందుకున్నారు. భారతీయ చిత్ర పరిశ్రమకు దశాబ్దాలుగా అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఆయనకు ప్రతిష్ఠాత్మక 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' (జీవితకాల సాఫల్య) పురస్కారం లభించింది. దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం ప్రారంభమైన 'అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఢిల్లీ (×ఖీఖీఱ) 2026' వేడుకల్లో ఆయన ఈ అవార్డును స్వీకరించారు.

ఢిల్లీలోని భారత్ మండపంలో ఘనంగా జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేఖా గుప్తా చేతుల మీదుగా బాలకృష్ణ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. బాలకృష్ణతో పాటు సీనియర్ నటి షర్మిలా ఠాగూర్, దివంగత నటుడు ధర్మేంద్రకు కూడా జీవితకాల సాఫల్య పురస్కారాలను ప్రకటించారు. ధర్మేంద్ర తరఫున ఆయన కుటుంబ సభ్యులు ఈ అవార్డును స్వీకరించారు. ఈ వేడుకలను ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, మంత్రులు కపిల్ మిశ్రా, పర్వేశ్ సాహిబ్ సింగ్ వర్మ, నటీమణులు హేమమాలిని, కంగనా రనౌత్, షర్మిలా ఠాగూర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. బాలకృష్ణకు ఈ గౌరవం దక్కడం పట్ల ఆయన అభిమానులు, సినీ ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# గుండెలు పిండేసిన ప్రియాంక చోప్రా!

గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కేవలం వెండితెరపైనే కాదు. నిజ జీవితంలోనూ ఎంతో మందికి స్ఫూర్తినిస్తుంటారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె చేసిన వ్యాఖ్యలు సామాన్య మధ్యతరగతి ప్రజల గుండెలను పిండేశాయి. సమాజంలో -విజయం- అనే పదానికి ఉన్న అర్థాన్ని ఆమె పూర్తిగా మార్చేసారు. ప్రతిరోజూ తమ ఇష్టం లేని పనిని కూడా బాధ్యత కోసం చేసేవారే అసలైన విజేతలని కొనియాడారు. -చాలా మందికి తాము చేసే ఉద్యోగాలంటే ఇష్టం ఉండదు. కానీ తమ కుటుంబాలను పోషించుకోవడానికి, పిల్లల భవిష్యత్తు కోసం, కడుపు నింపుకోవడం కోసం వారు ప్రతిరోజూ ఆ ఇష్టం లేని పనులకే వెళ్తుంటారు. అలాంటి వారు పడే కష్టం, వారు చూపే అంకితభావం నా దృష్టిలో అత్యంత గొప్ప విజయం అని పేర్కొన్నారు. కేవలం లక్ష్యాలను సాధించే వారు మాత్రమే విజేతలు కాదు. కడుపు నింపుకోవడానికి బాధ్యతలను మోసేవారు కూడా వీరులే అని పీసీ అభిప్రాయపడ్డారు. సాధారణంగా సెలబ్రిటీలు -మీకు నచ్చిన పనినే చేయండి.. అప్పుడే విజయం వస్తుంది- అని చెబుతుంటారు. కానీ ప్రియాంక మాత్రం చాలా మంది వాస్తవ జీవితాన్ని ప్రస్తావించారు. -ప్రతి ఒక్కరికీ తమకు నచ్చిన పని చేసే అవకాశం దొరకదు. ఇష్టం లేకపోయినా ముఖంపై చిరునవ్వుతో బాధ్యతను నెరవేర్చే వ్యక్తిలో ఉండే ఆత్మస్థైర్యం సామాన్యమైంది కాదు. ఆ పట్టుదలే వారిని నా దృష్టిలో ఒక సూపర్ హీరోని చేస్తుంది- అని చెప్పుకొచ్చారు. ఇప్పుడీ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తూ ఒత్తిడిలో ఉన్న యువత, ప్రియాంక మాటలతో ఎంతో ఊరట పొందుతున్నారు. ఒక స్టార్ హోదాలో ఉండి కూడా సామాన్యుల కష్టాలను, వారి జీవన పోరాటాన్ని ఇంత సున్నితంగా అర్థం చేసుకోవడం ప్రియాంకలోని మానవత్వాన్ని చాటి చెబుతోందని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. ప్రియాంక చోప్రా చేసిన వ్యాఖ్యలు సక్సెస్ అనే మాటకు ఒక కొత్త నిర్వచనాన్ని ఇచ్చింది. కెరీర్ లో ఎత్తుపల్లాలను చూసి కుంగిపోకుండా? కుటుంబాన్ని కాపాడుకోవడమే అతిపెద్ద లక్ష్యంగా పెట్టుకుని పోరాడే ప్రతి సామాన్యుడికి ఆమె మాటలు ఒక పెద్ద సెల్యూట్ లా నిలిచాయి.




# ప్రధాని మోదీపై 'కాంతార' నటుడు ఫైర్

అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ఇంధన కొరత నేపథ్యంలో దేశ ప్రజలందరూ ఐకమత్యంగా ఉండాలని ప్రధాని మోదీ పిలుపునివ్వడంపై 'కాంతార' నటుడు కిషోర్ సోషల్ మీడియా వేదికగా విరుచుకుపడ్డారు. గత పదేళ్లలో దేశాన్ని కులమతాల వారీగా విడగొట్టి, ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని కలిసి ఉండాలని అడుగుతున్నారని ఆయన ప్రశ్నించారు.

దేశాన్ని హిందువులు, ముస్లింలు, క్రైస్తవులుగా విడగొట్టి ప్రజల మధ్య ద్వేషాన్ని నింపిన తర్వాత, ఇప్పుడు విపత్తులు వస్తున్నాయని అందరినీ ఏకం కావాలని కోరడం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు. నోట్ల రద్దు, రఫేల్ ఒప్పందం, కరోనా లాక్‌డౌన్, అగ్నివీర్, వ్యవసాయ చట్టాల వంటి కీలక నిర్ణయాల సమయంలో ప్రజలను, ప్రతిపక్షాలను కనీసం సంప్రదించారా? అని నిలదీశారు. కరోనా సమయంలో సుమారు 50 లక్షల మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయినా ప్రభుత్వం వారిని లెక్కలోకి తీసుకోలేదని కిషోర్ మండిపడ్డారు. ప్రజలు గొర్రెల మందలా చావడానికి సిద్ధంగా లేరని హెచ్చరించారు. మణిపూర్, కశ్మీర్, లడఖ్ సమస్యలపై ప్రధాని మౌనాన్ని ఆయన తప్పుబట్టారు.

యుద్ధ నేరాలకు పాల్పడుతున్న దేశాధినేతలను (ఇజ్రాయెల్) కౌగిలించుకునే ముందు ప్రజల అనుమతి తీసుకున్నారా? అని ప్రశ్నిస్తూ, ప్రధాని తీరును 'నాన్-బయోలాజికల్ మ్యాడ్నెస్' (అశాస్త్రీయమైన వెర్రితనం)గా అభివర్ణించారు. దేశ అత్యున్నత పదవికి గౌరవం ఇవ్వలేని వారు ఆ పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు.



# కరుప్పు.. సూర్య కమ్ బ్యాక్ పక్కా?

కోలీవుడ్ స్టార్ హీరోల్లో సూర్య స్టైల్ ప్రత్యేకం. రెగ్యులర్ కమర్షియల్ సినిమాలకు పూర్తి భిన్నంగా కథాబలమున్న సినిమాలతో పాటు సరికొత్త కథలు, క్యారెక్టర్లతో ప్రత్యేక గుర్తింపుని సొంతం చేసుకున్న సూర్య గత కొంత కాలంగా వరుస ఫ్లాపులు, డిజాస్టర్లతో సతమతమవుతూ రేసులో వెనబడిపోయారు. ఒక దశలో వరుస బ్లాక్ బస్టర్లని సొంతం చేసుకున్న సూర్య ఇప్పుడు సరైన హిట్ల కోసం ఎదురు చూస్తున్నాడు. -జైభీమ్- తరువాత సూర్య హిట్టు మాట విని ఏళ్లు గడుస్తున్నాయి. సామాజిక సమస్య నేపథ్యంలో చేసిన -ఈటీ- ఫలితాన్ని ఇవ్వలేదు.

భారీ అంచనాలతో పాన్ ఇండియా వైడ్‌గా సంచలనాలు సృష్టించాలని చేసిన ఫాంటసీ యాక్షన్ మూవీ -కంగువా- బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచి షాక్ ఇచ్చింది. రూ.300 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తే అందులో రూ.100 కోట్లు మాత్రమే తిరిగి రాబట్టి డిజాస్టర్‌గా బాప్ అనిపించుకుంది. రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా చేసిన -రెట్రో- కూడా ఇదే ఫలితాన్ని అందించి సూర్యని ఆలోచనలో పడేసింది. దీంతో కంగారుపడిన సూర్య ఆలోచించి అడుగులు వేయడం మొదలు పెట్టారు.

సక్సెస్ కోసం ఆర్జే బాలాజీ చెప్పిన -కరుప్పు- కథని నమ్మి రూటెడ్ స్టోరీతో సినిమా చేశారు. త్రిష కథానాయికగా నటించిన ఈ మూవీ రిలీజ్‌కు రెడీ అయినా ప్రస్తుతం ఉన్న పోటీ దృష్ట్యా మేకర్స్ ఈ మూవీ రిలీజ్‌ని మే 14కు వాయిదా వేశారు. దీనితో పాటు తెలుగు డైరెక్టర్ వెంకీ అట్లూరితో కలిసి తెలుగు స్ట్రెయిట్ ఫిల్మ్ -విశ్వనాథ్ అండ్ సన్స్- చేశారు.



# ఓవైపు కామెడీ.. ఓవైపు హారర్..

# ఆసక్తికరంగా 'రాకాస' ట్రైలర్

సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటిస్తున్న చిత్రం 'రాకాస'. హారర్ కామెడీ జోనర్‌లో ఈ సినిమాను మానస శర్మ తెరకెక్కించారు. ఇప్పటికే విడుదలైన సినిమా టీజర్, పాటలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ని విడుదల చేశారు. ఓవైపు కామెడీతో నవ్వులు పూయిస్తూనే.. మరోవైపు హారర్‌తో భయపెడుతోంది ఈ సినిమా ట్రైలర్. ఇక ఈ సినిమాలో గెటప్ శ్రీను, తనికెళ్ల భరణి, బ్రహ్మాజీ తదితరులు కీలక పాత్రలు పోషించారు. అనుదీప్ దేవ్ ఈ సినిమాకి సంగీతం అందించాడు. పింక్ ఎలిఫాంట్ పిక్చర్స్ బ్యానర్‌పై నిహారిక కొణిదెల ఈ సినిమాని నిర్మించింది. ఈ సినిమా ఏప్రిల్ 3వ తేదీన విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ని మీరు చూసేయండి...



Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,

Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com